ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి

# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY




శనివారం 04 జూలై 2026 | Saturday 04 July 2026 | హైదరాబాద్ Hyderabad | ⇨ పేజీలు: 12+12 | ⇨ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 91 | Vol.No 28 Issue No .91 | www.visionandhra.in


ఊర్కొండ ఆంజనేయ స్వామి దేవాలయంలో పబ్బతి ఆంజనేయ స్వామి...

పబ్బతి ఆంజనేయ గుడి అభివృద్ధికి రూ.10 కోట్లు..

భూతప్రేతాలను పారదోలే స్వామికి మహర్దశ

జడ్పీటీసీగా గెలిపించిన మిడ్జిల్ రుణం తీర్చుకుంటున్న సీఎం..

బోయిన్‌పల్లికి సబ్‌స్టేషన్, ఇప్పుడు గుడికి నిధులు..

*తన రాజకీయ జీవితానికి తొలి మెట్టు వేసిన మిడ్జిల్ మండల గడ్డపై 20 ఏళ్ల తర్వాత తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేడు అడుగుపెట్టనున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో భూతప్రేతాలను పారదోలే దేవుడిగా, కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం గా పేరుగాంచిన ఊర్కొండ పబ్బతి ఆంజనేయ స్వామి సన్నిధికి సీఎం హోదాలో తొలిసారి వస్తుండడంతో మండలమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆలయ అభివృద్ధికి సుమారు రూ.10 కోట్ల నిధులు మంజూరు చేస్తారనే వార్తతో భక్తులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.*

# 20 యేండ్ల తర్వాత నేడు మిడ్జిల్ గడ్డపై సీఎం రేవంత్..

## అభయ ఆంజనేయుని సన్నిధిలో మొక్కులు



2006 సంవత్సరంలో జడ్పీటీసీ గా గెలుపొందిన సందర్భంగా...

**ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రతినిధి,04 (విజన్ ఆంధ్ర):**

### ప్రసిద్ధి గాంచిన పబ్బతి క్షేత్రం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన ఆంజనేయ క్షేత్రాల్లో ఊర్కొండ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయం ఒకటి. భూత, ప్రేత, పిశాచ బాధలతో వచ్చే భక్తులకు ఇక్కడి స్వామి అభయమిస్తాడని ప్రగాఢ నమ్మకం. ప్రతి మంగళ, శనివారాల్లో ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు దండోపతండాలుగా తరలివస్తారు. అయితే సరైన వసతులు, అభివృద్ధి లేక ఆలయం ఎదుగుదలకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో సీఎం పర్యటన, నిధుల ప్రకటన ఆలయ రూపురేఖలను పూర్తిగా మార్చేయనుందని అధికారులు చెబుతున్నారు. రాజగోపురం, ప్రహరీ, కళ్యాణ మండపం, భక్తుల విడిది గదులతో పాటు పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతోంది.

### మిడ్జిల్ నుంచే సీఎం పీఠం దాకా

2004లో మిడ్జిల్ మండలం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా జడ్పీటీసీ బరిలో నిలిచారు రేవంత్ రెడ్డి. దివంగత నేత వేప గోపాల్ రెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని "ప్రాంత అభివృద్ధి, ప్రజా సేవే లక్ష్యం" అని ఇచ్చిన హామీతో పార్టీలకతీతంగా అన్ని పార్టీల నాయకులు, ప్రజలు ఆయనకు అండగా నిలిచి గెలిపించారు. జడ్పీటీసీగా గెలిచిన వెంటనే తన సొంత నిధులతో మండలంలోని బోయి న్‌పల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదులు నిర్మించి ఇచ్చారని సీనియర్ నాయకులు గుర్తు చేసుకున్నారు.




### మరువని మమకారం

జడ్పీటీసీ నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, టీపీసీసీ అధ్యక్షుడిగా ఎదిగి నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి పీఠం అధిరోహించినా రేవంత్ రెడ్డి మిడ్జిల్‌ను మరిచిపోలేదు. సీఎం అయిన తర్వాత కూడా బోయిన్‌పల్లి గ్రామానికి రూ.3 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేయించారు. "20 ఏళ్లు గడిచినా మిడ్జిల్ నాయకులను, కార్యకర్తలను ఇప్పటికీ పేరుతో పిలుస్తారు. అన్నా, తమ్ముడూ అని ఆప్యాయంగా పలకరిస్తారు. ఆయనలో మనుషుల పట్ల ఉన్న ప్రేమ ఇప్పటికీ అలాగే ఉంది" అని స్థానిక నాయకులు చెబుతున్నారు. తమ గడ్డపై నుంచి ఎదిగిన బిడ్డ సీఎం అయి తిరిగి మిడ్జిల్‌కు రావడం తమ అదృష్టమని, ఇది మండలానికే గర్వకారణమని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
రాజకీయ జీవితానికి బీజం వేసిన మిడ్జిల్ గడ్డకు, కోరిన కోరికలు తీర్చే పబ్బతి ఆంజనేయస్వామికి సీఎం రేవంత్ రెడ్డి ఇస్తున్న కానుక ఇది అంటూ ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ,జడ్పిటిసిగా ఇచ్చిన మాటను సీఎంగా నిలబెట్టుకుంటున్నాడనే చర్చ మిడ్జిల్, ఊర్కొండ మండలాల్లో జోరుగా సాగుతోంది...


తెలంగాణ సీఎం గా ప్రమాణ స్వీకారం చేస్తూ...

**సీఎం పర్యటన నేపథ్యంలో ఊర్కొండ, మిడ్జిల్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.**

---

## బిఆర్ఎస్ అప్పులు అక్షరాలా రూ. 8,21,651 కోట్లు

- చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు డ్రామాలు
- నాటి అప్పులు, తప్పులపై కెసిఆర్ స్పందించాలి
- హరీష్ రావు అబద్దాలను కట్టిపెడితే మంచిది
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్ట్రాంగ్ వార్నింగ్

అనేక సంస్థలకు వేలకోట్ల బకాయిలు పెట్టిన ఘనులు




హైదరాబాద్,జూలై3 :గత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేసిన భారీ అప్పులు, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రస్తుతం లేనిపోని అబద్దాలను ప్రచారం చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన తప్పులను తక్కువ చేసి చూపించేందుకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారని భట్టి విక్రమార్క అన్నారు. మంత్రిగా పనిచేసిన విషయాన్ని మరిచిపోయి హరీశ్ మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి భట్టి

మిగతా 2లో..

## అబద్దాల లేఖలతో ప్రచారం చేస్తున్న హరీష్ రావు

- సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో జూపల్లి,
- సవాల్‌పై కట్టుబడి ఉన్నందునే వచ్చానని వెల్లడి
- బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ మంత్రి



హైదరాబాద్,జూలై3 : తెలంగాణ అప్పులపై సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు సిద్ధమని ప్రకటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు సాయంత్రం ప్రెస్‌క్లబ్‌కు వచ్చారు. శుక్రవారం ఉదయం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌కు ఆయన సవాల్ విసిరారు. సాయంత్రం 5 గంటలకు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు వస్తానని చెప్పారు. ఈ మేరకు మంత్రి జూపల్లి శుక్రవారం సాయంత్రం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన

మిగతా 2లో..

## అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు

- యాత్రలో పాల్గొనడం గొప్ప అనుభూతిగా వెల్లడి
- యాత్రలో జాగ్రత్తలు పాటించాలంటూ ఎక్స్ వేదికగా పిలుపు



న్యూఢిల్లీ,జూలై 3 : అమర్‌నాథ్ యాత్రను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ భక్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర యాత్రను ఒక 'గొప్ప భాగ్యం'గా అభివర్ణించిన ప్రధాని, భక్తి శ్రద్ధలతో, క్రమశిక్షణతో, బాధ్యతాయుతమైన జాతీయ భావనతో భక్తులు ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు. శివభక్తులను ఉద్దేశించి రాసిన లేఖను ఎక్స్ వేదికగా పంచుకుంటూ మోదీ పలు కీలక విషయాలను ప్రస్తావించారు.'పవిత్రమైన అమర్‌నాథ్ యాత్రలో పాల్గొనడం ఒక గొప్ప భాగ్యం. ప్రతి సంవత్సరం మంచు లింగంని నేరుగా దర్శించుకునే ఈ అవకాశం లక్షలాది మంది

మిగతా 2లో..

## అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాలు

- పూటకో మాట.. రోజుకో అడ్రస్‌లా జూపల్లి తీరు
- విమర్శలు గుప్పించిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు



సంగారెడ్డి,జూలై3 : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేసిన అప్పుల విషయంలో అబద్దాలు చెప్తున్నదని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా

మిగతా 2లో..

## అయోధ్య చోరీపై ఆర్ఎస్ఎస్ ఆందోళన

- దోషులను కఠినంగా శిక్షించాల్సిందే
- హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వారిని వదలరాదు
- ఈ ఘటనతో హిందూ వ్యతిరేక శక్తులకు అవకాశం ఇవ్వరాదు
- విచారం వ్యక్తం చేసిన ఆర్ఎస్ఎస్ ప్రతినిధి దత్తాత్రేయ హోసబలే

న్యూఢిల్లీ,జూలై3 :అయోధ్య రామ మందిర విరాళాల చోరీ ఘటనపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆర్ఎసెస్ ఆందోళన వ్యక్తం చేసింది. రాముడి విరాళాలను దొంగిలించడం తమను తీవ్రంగా బాధిస్తోందని ఆరెస్సెస్

మిగతా 2లో..

## కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల నటన అద్భుతం

- కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా



హైదరాబాద్, జూలై3 :కాంగ్రెస్, భారాస నేతల నటన అద్భుతంగా ఉందని, బిగ్‌బాస్

మిగతా 2లో..

## రాయలసీమ ప్రాంతాన్ని 'ఉక్కుసీమ'గా మారుస్తా

- 'స్టీల్ స్టేట్'గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
- జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులకు శ్రీకారం
- సున్నపురళ్లపల్లెలో రూ.16,350 కోట్లతో నిర్మాణం
- సీమలో పారాల్సింది రక్తం కాదు..నీళ్లు
- మావిగన్, విజయవాడ..రేపు మరేంటో
- జగన్ తీరుపై పరోక్షంగా విమర్శలు
- సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడి

అమరావతి,జూలై3 :ఆంధ్రప్రదేశ్‌ను సరికొత్త పారిశ్రామిక హబ్‌గా, ముఖ్యంగా 'స్టీల్ స్టేట్'గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కడప జిల్లాలోని జమ్మలమడుగు మండలం సున్నపురళ్లపల్లెలో రూ.16,350 కోట్లతో నిర్మించనున్న ప్రతిష్టాత్మక జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఆ తర్వాత విజయనగరం జిల్లాలోని జిందాల్ పారిశ్రామిక పార్కును వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం

మిగతా 2లో..




## గుజరాత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్ ఏర్పాటు

- వెలుగులోకి జైష్-ఎ-మహ్మద్ కుట్ర
- మధ్యప్రదేశ్‌లో 8 మంది అరెస్ట్



గాంధీనగర్,జూలై3 : గుజరాత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్ ఏర్పాటు కోసం ఉగ్రవాద సంస్థ

మిగతా 2లో..

## నెలరోజుల పసికందు కిడ్నాప్ ఛేదన

- 72 గంటల్లోనే కిడ్నాపర్ల అరెస్ట్.. పాప సేఫ్
- వివరాలు వెల్లడించిన సిపి రమేశ్ రెడ్డి




హైదరాబాద్,జూలై3 : నెలరోజుల పసికందు కిడ్నాప్ కేసును సైబరాబాద్ చందానగర్ పోలీసులు 72గంటల్లో ఛేదించారు. ఈ సందర్భంగా శుక్రవారం సైబరాబాద్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపి రమేష్ రెడ్డి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గత నెల 30వ తేదీ అర్ధరాత్రి అనంతరం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నిద్రిస్తున్న మహిళ వద్ద నుంచి నెల రోజుల వయస్సు గల

మిగతా 2లో..

## అబద్ధాల లేఖలతో ప్రచారం చేస్తున్న హరీశ్ రావు

మాట్లాడుతూ.. సవాల్‌పై కట్టుబడి ఉన్నందునే ప్రెస్‌క్లబ్‌కు వచ్చానన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు కోసం ఎదురుచూస్తున్నానని తెలిపారు. తాను వెనకడుగు వేసి పారిపోయే వ్యక్తిని కానన్నారు. 'కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు 4 పేజీల చొప్పున లేఖలు రాశా. ముగ్గురికీ వాట్సాప్‌లోనూ ఆధారాలతో లేఖలు పంపించా. రూ.4.17 లక్షల కోట్ల అప్పు అంటూ హరీశ్ లెటర్స్ లేఖ పంపారు. రూ.8.21 లక్షల కోట్ల అప్పు అని లేఖలో చెప్పా. పారిపోవడం మా ఇంటావంటా లేదు. ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. లేఖలో తాను ప్రస్తావించినవి అబద్ధాలని నిరూపించ గలరా అని మంత్రి ప్రశ్నించారు. తాను చెప్పినవి అబద్ధాలైతే రాజీనామాకు సిద్ధం అంటూ పునరుద్ఘాటించారు. హరీశ్‌రావు సొల్లు పురాణం చెబుతున్నారు. నా ప్రశ్నలకు సమాధానం దాటవేస్తున్నారు. నేను అడిగింది ఏంటి? హరీశ్ చెప్పిందేంటి అని నిలదీసారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ కోసం 3 కుర్చీలు వేశాం. హరీశ్‌రావు రాసిన లేఖలో ఏమీ లేదు. ఇప్పటికైనా విలువలతో బతకండి' అని అన్నారు. కాగా, చర్చకు రావాలని పిలిచి పోలీసులతో అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు

శివభక్తులకు అత్యంత పవిత్రమైన, మరపురాని అనుభూతిని ఇస్తుంది. ఈ సంవత్సరం యాత్రకు సిద్ధమవుతున్న భక్తులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ యాత్ర భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక శాశ్వతమైన అధ్యాయమని ప్రధాని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా సనాతన సంస్కృతిని అనుసరించే లక్షలాది మంది భక్తులు ప్రతి ఏటా బాబా అమర్‌నాథ్ ఆశీస్సుల కోసం జమ్మూ కశ్మీర్‌కు వస్తుంటారని గుర్తుచేశారు. వివిధ ప్రాంతాలు, విభిన్న భాషలు, భిన్నమైన ఆచారాలు ఉన్నప్పటికీ.. మహాదేవుని ఆశీస్సులు పొందాలనే ఒకే ఒక సంకల్పంతో భక్తులంతా ఇక్కడికి తరలివస్తారని, ఈ రెండు నెలల కాలంలో బాబా బర్ఫానీ పవిత్ర సన్నిధిలో భారతదేశ 'భిన్నత్వంలో ఏకత్వం' అనే అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుందని మోదీ అన్నారు. ఈ యాత్ర సజావుగా సాగడానికి అహర్నిశలు శ్రమిస్తున్న భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూ కశ్మీర్ పోలీస్, ఐటీబీపీ, బీఎస్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పాటు ఆరోగ్య కార్యకర్తలు, పరిపాలనా యంత్రాంగం, పారిశుద్ధ్య కార్మికులు, వాలంటీర్లకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది యాత్ర సందర్భంగా భక్తులందరూ తమ జీవితంలో ఐదు ముఖ్యమైన సంకల్పాలను స్వీకరించాలని ప్రధాని పిలుపునిచ్చారు. అమర్‌నాథ్ యాత్ర మార్గంలో ఎక్కడా చెత్తాచెదారం వేయకుండా, పరిశుభ్రత నియమాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. వాతావరణ మార్పులు, వర్షాల నేపథ్యంలో జారే మార్గాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, పరిపాలనా యంత్రాంగం ఇచ్చే ఆదేశాలు, ట్రాఫిక్ నిబంధనలు, భద్రతా సూచనలను పూర్తిగా అంకితభావంతో పాటించాలని సూచించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, యాత్రికులు తమ ప్రయాణ ఖర్చుల్లో కనీసం 10 శాతం మొత్తాన్ని జమ్మూ కశ్మీర్‌లోని స్థానిక ఉత్పత్తులను కొనుగోలుకు కేటాయించాలి. ఇది అక్కడి కుటుంబాలకు, యువతకు ఉపాధినిస్తుందన్నారు. రక్షాబంధన్ పండుగతో ముగిసే ఈ యాత్ర ముగింపు సందర్భంగా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అమ్మ పేరిట ఒక మొక్క ప్రచారంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలన్నారు. దేశమే ప్రథమమనే భావనతో, మన బాధ్యతలను ఏదాని పొదుపున నిజాయితీగా నిర్వర్తిస్తూ, 'వికసిత్ భారత్' నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలి. చివరగా, భక్తులందరి ప్రయాణం సుఖమయంగా, సురక్షితంగా, ఆధ్యాత్మికంగా సాగాలని ప్రధాని ఆకాంక్షించారు.

## అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాలు

ప్రభాకర్ అధ్యక్షతన ఎస్ఐఆర్ పై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తరువాత రాష్ట్రంలో చేసిన అప్పు రూ. 1,77,058 కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు నాకు లేఖ రాశాడు. కానీ రేవంత్ రెడ్డి నాలుగు నెలల క్రితం అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.3,45,294 కోట్లు అని చెప్పాడు. నాలుగు నెల కిందనే నిండు అసెంబ్లీలో రేవంత్ రెడ్డి అంత చెప్పాడు అంటే ఈ నాలుగు నెలలది కూడా కలిపితే రూ. 4 లక్షల కోట్లు దాటుతుందన్నారు. జూపల్లి ఒక మాట చెబుతున్నాడు, రేవంత్ రెడ్డి ఇంకో మాట చెబుతున్నాడు. ఇప్పుడు రాజీనామా ఎవరు చేయాలి? అని హరీశ్ రావు సూటిగా ప్రశ్నించాడు. పూటకో సవాల్.. రోజుకో అడ్రస్‌లా మంత్రి జూపల్లి కృష్ణారావు తీరు ఉందని హరీశ్‌రావు విమర్శించారు. మంత్రి జూపల్లి సవాళ్లు నిన్నే చూశాం.. ఏమైందో అందరికీ తెలుసు. తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పింది ఆయనే. వెంటనే మాట మార్చి గన్‌పార్క్‌కు వెళ్లారు. గన్‌పార్క్‌కు వెళ్లకుండా పోలీసులు మమ్మల్ని అడ్డుకున్నారు. చర్చకు కేసీఆర్ రావాలని ఇప్పుడు అంటున్నారు. జూపల్లి వాట్సప్‌లో లేఖ పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వాళ్లు చేసిన అప్పులు లేఖలో రాశారు. తాము వచ్చాక రూ.1.77లక్షల కోట్లు అప్పు చేశామని జూపల్లే చెప్పారు. ఆర్‌బీఐ వద్ద తెచ్చిన ఎఫ్ఆర్‌బీఎం అప్పులు మొత్తం చెబుతా. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.1.86లక్షల కోట్లు. ఆర్‌బీఐ తెచ్చిన అప్పులోనే తేడాలు చెప్పారు. ఏం చేయాలో అర్థంకాక డ్యామేజ్ కంట్రోల్ చేసుకుంటున్నారు' అని హరీశ్‌రావు విమర్శించారు.

## గుజరాత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్ ఏర్పాటు

జైష్-ఎ-మహ్మద్ చేసిన కుట్ర వెలుగులోకి వచ్చింది. గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్.. గుజరాత్, మధ్యప్రదేశ్‌లో 8 మందిని అరెస్ట్ చేసింది. గుజరాత్ ఏటీఎస్ అధికారులు గురువారం గుజరాత్‌లోని బనస్కాంత, పటాన్, నవ్‌సారితో పాటు పొరుగు రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లోని దేవాస్ ప్రాంతంలో ఏకకాలంలో దాడులు నిర్వహించి ఈ 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అహ్మద్ గాజీవాలా, ఇబ్రహీం ఘాఘా, ముదస్సిర్ గాజీవాలా, జకారియా దురానీ, ముఫ్తీ ఫౌజాన్ దౌవా, మహ్మద్ అమీన్ పాలన్‌పురి, మహ్మద్ అబ్దుల్ సాఫ్దీ, బిలాల్ దురానీ ఘాఘాగా గుర్తించారు. వీరిలో ముగ్గురు సిద్ధ్‌పూర్, చిఖ్లీలోని మతపరమైన విద్యాసంస్థలతో సంబంధం ఉన్నట్లు తేలింది. నిందితులంతా జైష్-ఎ-మహ్మద్ సంస్థ తరపున యాక్టివ్‌గా పనిచేస్తూ.. గుజరాత్ వ్యాప్తంగా తమ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడానికి పని చేస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. అంతేకాదు.. ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతుగా రిక్రూట్‌మెంట్లు చేపట్టడానికి ఎ÷-లాన్ చేసినట్లు తేల్చారు. అధికారులు అరెస్టైన వారిపై ఉగ్రవాద నిరోధక చట్టాల కింద కేసులు నమోదు చేశారు. వారినుంచి డిజిటల్ పరికరాలు, ఇతర ఆధారాలు స్వాధీనం చేసుకున్నారు. ఉగ్రవాద సంస్థతో దేశవ్యాప్త సంబంధాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## నెలరోజుల పసికందు కిడ్నాప్ ఛేదన

ఆడశిశువును కిడ్నాప్ చేసిన ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి..ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా తప్పిపోయిన, కిడ్నాప్‌కు గురైన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు అప్పగించే క్రమంలో ఈ కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని కేవలం 72 గంటల్లోనే కేసును ఛేదించి పాపను సురక్షితంగా రక్షించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సాధిక మక్సూద్ అనే మహిళకు సంతానం లేకపోవడంతో పాపను అక్రమంగా తెప్పించుకునేందుకు కుట్ర పన్నినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. 'ఆమె బ్యూటీ పార్లర్‌లో పనిచేస్తున్న నిమ్మి జహాన్, రహనుమా అలీల సహాయం కోరింది. లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రోడ్డుపై నిద్రిస్తున్న కర్ణాటక కు చెందిన కుటుంబం వద్ద నుంచి పసికందును ఎత్తుకెళ్లి ఆటోలో ఎత్తుకెళ్లారు. ఈ శిశువును తీసుకురావడానికి కిడ్నాపర్లకు సాధిక మక్సూద్ రూ.1.50 లక్షలు చెల్లించినట్లు విచారణలో తేలింది. అనంతరం పాపతో కలిసి కోల్‌కతాకు వెళ్లేందుకు రైల్వే టికెట్లు కూడా బుక్ చేసుకున్నప్పటికీ, వేగంగా స్పందించి వారిని అదుపులోకి తీసుకుని పాపను రక్షించాం' అని తెలిపారు. ఈ కేసులో ఏ1 మొహమ్మద్ జుబెర్, ఏ2 మొహమ్మద్ ఇర్ఫాన్, ఏ3 సాధిక మక్సూద్, ఏ4 నిమ్మి జహాన్, ఏ5 రహనుమా అలీలను అరెస్ట్ చేసామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ క్రైమ్స్ శ్రీనివాస్, ఆర్ సి పురం ఏసీబీ వై శ్రీనివాస్ రావు, చందానగర్ సిఐ విజయ్ కుమార్, అమీన్పూర్ డిఐ భాస్కర్ తో పాటు పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అప్పులు అక్షరాలా రూ. 8,21,651 కోట్లు

విక్రమార్క మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్పష్టమైన లెక్కలను బయటపెట్టిన ఆయన.. గత పాలకులు రాష్ట్రంపై సుమారు రూ. 8,21,651 కోట్ల అప్పులు , బకాయిల భారాన్ని మిగిల్చారని, వాటిని ప్రస్తుత ప్రభుత్వం ఎంతో శ్రమతో క్రమబద్ధీకరిస్తోందని వెల్లడించారు. అలాగే రెసిడెన్షియల్ పాఠశాలల్లోని పిల్లలకు నాణ్యమైన భోజనం, బట్టలు , కనీస సౌకర్యాలను కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తమ ప్రభుత్వం వచ్చాకే విద్యా సంస్థల్లోని వసతులను మెరుగుపరిచి సంక్షేమానికి పెద్దపీట వేసిందని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను డిప్యూటీ సీఎం తీవ్రంగా ఖండించారు. బొగ్గు గనుల కేటాయింపులు, ఉత్పత్తికి సంబంధించి గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించి సంస్థను నష్టాల్లోకి నెట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం సింగరేణిని కాపాడుకోవడానికి అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని వివరించారు. సింగరేణిలో జరిగిన గత ప్రభుత్వ కాలపు అక్రమ వ్యవహారాలపై తాము విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తున్నట్లు ఈ సందర్భంగా భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో, బయటా అబద్ధపు ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించిన ఆయన, దమ్ముంటే తమతో నేరుగా బహిరంగ చర్చకు రావాలంటూ మాజీ సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు.బీఆర్ఎస్ పాలనలో చేసిన అప్పులపై కేసీఆర్ స్పందించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో మొత్తం అప్పు రూ.8.21 లక్షల కోట్లు అని.. మొత్తం అప్పుల్లో గత ప్రభుత్వ బకాయిలు ఉన్నాయని తెలిపారు. అప్పులు అన్నీ వాస్తవాలు కాదా.. వీటిని ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పులను తక్కువ చేసి చూపేందుకే కేటీఆర్, హరీశ్ ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి మండిపడ్డారు.

మంత్రిగా పనిచేశానని మర్చిపోయి మరీ హరీశ్ మాట్లాడుతున్నారని.. అనేక అంశాలపై అబద్దాలు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తేవాలన్నారు. బీఆర్ఎస్ నేతల అబద్దాలు ప్రజల్లోకి వెళ్లకూడదన్నారు. సోషల్ మీడియా ద్వారా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్దాల పునాదులపై పదేళ్లు పరిపాలించారని.. బీఆర్ఎస్ చేసిన అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విరుచుకుపడ్డారు. అప్పుల భారం రాష్ట్రంపై వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు అనేక విషయాలపై అబద్దాలు చెబుతున్నారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకురావాలి. బీఆర్ఎస్ నేతలు చెప్పే అవాస్తవాలు ప్రజల్లోకి వెళ్లకూడదు. సోషల్ మీడియా వ్యవస్థల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. అబద్దాల పునాదులపై పదేళ్లపాటు పరిపాలన చేశారు. బీఆర్ఎస్ నేతలు కావాలనే ప్రభుత్వంపై పదేపదే దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ పార్టీ హయాంలో చేసిన అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్‌కు సవాల్ విసురుతున్నాం. 2014 నుంచి 2023 వరకు అప్పులు చేసి రాష్ట్రంపై పెనుభారం వేసింది నిజం కాదా? వివిధ మార్గాల ద్వారా మీరు చేసిన అప్పు రూ.8.21లక్షల కోట్లు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారు?అప్పుల అంశంపై నిత్యం మాట్లాడితే రాష్ట్రం పరువు పోతుందని తగ్గాం. మేం వచ్చాక రూ.2.08లక్షల కోట్లు చెల్లించాం. 10 శాతం వడ్డీకి కూడా మీరు అప్పులు తెచ్చారు. కట్టాల్సిన వడ్డీని రూ.34 వేల కోట్ల నుంచి రూ.11వేల కోట్లకు తగ్గించాం. బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. సింగరేణిపై ప్రతిరోజూ అబద్దాలు చెబుతున్నారు' అని భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రాయలసీమ ప్రాంతాన్ని 'ఉక్కుసీమ'గా మారుస్తా

మాట్లాడారు.రాయలసీమకు స్వర్ణయుగం ప్రారంభమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశంలోనే మొదటిసారిగా గ్రీన్ స్టీల్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామని ఆయన ప్రకటించారు. కేవలం విశాఖపట్నం మాత్రమే కాకుండా, రాయలసీమ ప్రాంతాన్ని కూడా 'ఉక్కుసీమ'గా మారుస్తామని హామీ ఇచ్చారు. గతంలో స్టీల్ ప్లాంట్ పేరుతో కొందరు ఐరన్ ఓర్‌ను దోచుకుంటూ స్మగ్లింగ్‌కు పాల్పడ్డారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాయలసీమ ప్రాంతానికి రూ.4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తీసుకువచ్చామని అన్నారు. అంతేకాదు స్థానికంగా పరిశ్రమలు స్థాపించి ఇక్కడి యువతకే ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. గతంలో అనంతపురం జిల్లాలో కియా పరిశ్రమను తీసుకురావడం వల్ల ఆ ప్రాంత రూపురేఖలు మారాయన్నారు. ఇప్పటివరకూ అక్కడ 19 లక్షల కార్లు తయారయ్యాయని గుర్తుచేశారు. రాయలసీమకు ఎవరి వల్ల నష్టం జరిగింది, ఎవరి హయాంలో మంచి జరిగిందో ప్రజలు చరిత్రను ఒకసారి గుర్తుచేసు కోవాలని కోరారు. స్టీల్ ఎ÷-లాంట్ ఏర్పాటుతో రాయలసీమ చరిత్రలో నవశకం మొదలైంది. రాయలసీమ బిడ్డగా అభివృద్ధి చేసి చూపెడతా. రాయలసీమ అంటే కరవు నేల కాదు జలకళ కాబోతోందన్నారు. ఈ ప్రాంతం హార్టికల్చర్‌హబ్‌గా మారిపోయింది. విధ్వంస పాలనతో నష్టపోయిన రాష్ట్రానికి మళ్లీ ప్రాణం పోస్తున్నాం. పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాలతో రాయలసీమ బిజీగా మారింది. రాళ్ల సీమ కాదు.. రతనాల సీమ అని చూపిస్తున్నాం. ఇంకా పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు సజ్జన్ జిందాల్ సిద్ధంగా ఉన్నారు. రాబోయే రోజుల్లో సీమకు అన్నీ మంచి రోజులే. రాయలసీమలో ఎ÷-లాంట్ ఏర్పాటు చేస్తామని ముందే మాట ఇచ్చాం. గతంలో మోసపూరిత శంకుస్థాపనలు చూశాం. 2019 డిసెంబరులో ఒకసారి, 2023లో రెండోసారి భూమిపూజ చేశారు. తట్ట మట్టి అయినా తీశారా.. చిన్న భవనమైనా కట్టారా? అడ్డంకులన్నీ తొలగించుకొని వచ్చాం, 1100 ఎకరాల భూమి ఇచ్చాం. రెండు స్టేజీల్లో రెండు మిలియన్ టన్నుల ఉత్పత్తి జరగనుంది. జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ ఎ÷-లాంట్‌తో ఏపీ.. ఉక్కు రాష్ట్రంగా తయారవుతుంది. విశాఖ మాత్రమే కాదు.. రాయలసీమ కూడా ఉక్కుకు కేంద్రమవుతోందని సీఎం అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ఒకప్పుడు రాయలసీమలో ఉన్న ఫ్యాక్షన్ సంస్కృతిని అంతం చేశామని, సీమలో పారాల్సింది రక్తం కాదు.. సాగునీరు. ఫ్యాక్షనిజం పోయినప్పటికీ, నేరాలు చేసేవాళ్లు రాజకీయాల్లోకి రావడం దురదృష్టకరం అన్నారు. విధ్వంసమే అజెండాగా పెట్టుకున్న ఒక వ్యక్తి రాష్ట్రానికి ఏం చేయగలరు. 2014లో అమరావతిని రాజధానిగా అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు, అయితే అధికారంలోకి వచ్చాక.. మూడు రాజధానులంటూ నవ్వులపాలు చేశారు. మావిగన్, విజయవాడ అంటూ మతిస్థిమితం లేని వ్యక్తిలా మాట్లాడుతున్నారు. రేపు ఇంకేమంటారో తెలియని పరిస్థితి. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుంది. రాష్ట్రంలో రౌడీ మూకలు, గంజాయి బ్యాచ్‌లకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తోంది. ఇలాంటి అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం.' అని సీఎం తెలిపారు.

## అయోధ్య చోరీపై ఆర్ఎస్ఎస్ ఆందోళన

ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే విచారం వ్యక్తం చేశారు. తరతరాలుగా భక్తుల త్యాగాలు, అంకితభావం కారణంగా శ్రీరామ జన్మభూమిలోని ఈ భారీ ఆలయం రూపుదిద్దు కుందన్నారు. ఆలయ నిర్వహణలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఒక ప్రత్యేకమైన అంశంగా పరిగణించి, ఆలయ నిర్వహణలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్దాలని హోసబలే శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను కోరారు. ఈ కేసులో దర్యాప్తు జరుగుతున్నందున నిందితులకు శిక్షపడే వరకు సంయమనం పాటించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనను అవకాశంగా తీసుకొని కొందరు వ్యక్తులు హిందూ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. రామమందిర విరాళాల దుర్వినియోగం కేసు నేపథ్యంలో రాజీనామా చేసిన అయోధ్య ఆలయ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రాలకు శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ షో-కాజ్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆలయ అధికారుల మధ్య జులై 6న జరగనున్న కీలక సమావేశంలో ఈ చర్యలు తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. విరాళాల అవకతవకలకు సంబంధించి లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని వారిని కోరనున్నట్లు తెలిపాయి. దర్యాప్తు అనంతరం వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో రామ్ మందిర్ విరాళాల వివాదంపై ఆర్ఎస్ఎస్ శుక్రవారం స్పందించింది.

అయోధ్య హుండీల నుంచి డబ్బులు దొంగతనం చేయటంపై ఆర్ఎస్ఎస్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ సంఘటన ఎంతో బాధ కలిగించిందని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జనరల్ సెక్రటరీ దత్తాత్రేయ హోసబలే న్యూఢిల్లీ నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో.. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు. ఆలయ నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని కోరారు. దేశ వ్యతిరేక శక్తుల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ ఘటన కోట్లాది మంది రామభక్తుల నమ్మకాన్ని, హిందూ సమాజం సెంటిమెంట్లను తీవ్రంగా గాయపరిచింది. ఈ ఘటన కారణంగా మేము తీవ్ర ఆవేదనకు, ఆగ్రహానికి గురయ్యాం. ఈ దురదృష్టకర సంఘటనను హిందూ వ్యతిరేక, దేశ వ్యతిరేక శక్తులు తమ స్వార్థం కోసం వాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. హిందూ సమాజంపై, సనాతన ధర్మంపై బురద జల్లడానికి ఈ వివాదాన్ని ఒక అస్త్రంగా మలచుకునే కుట్రలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఈ కష్టసమయంలో హిందూ సమాజమంతా ఎంతో ఓపికను, నిగ్రహాన్ని ప్రదర్శించాలి. ఎలాంటి తప్పుడు ప్రచారాలకు లోనుకాకుండా.. శత్రువుల కుట్రలను తిప్పికొట్టడానికి అందరూ ఐక్యమత్యంగా ఉండాలి. రామమందిరం ఎన్నో తరాల పోరాటాలు, కోట్లాది మంది త్యాగాల ఫలితంగా నిర్మితమైంది. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా ఆలయ ట్రస్ట్ పటిష్ఠమైన చర్యలు తీసుకుంటుందన్న నమ్మకం నాకు ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సవాళ్లు విసరడం.. పారిపోవడం అలవాటే

**- రేంవత్, మంత్రుల తీరే ఇందుకు నిదర్శనం**

**- మాజీమంత్రి వేముల ప్రశాతంత్ రెడ్డి విమర్శలు**

హైదరాబాద్,జూలై 3 :

ప్రతిపక్ష పార్టీలకు సవాల్ విసరడం, పారిపోవడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. మంత్రులు కూడా అదేతరహాలో ఉన్నారని మండిపడ్డారు. ఇందుకు తాజాగా మంత్రులు వ్యయహరించిన తీరే నిదర్శనమని అన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరి తోక ముడిచిన కాంగ్రెస్ మంత్రుల డొల్లతనం బయట పడిందని , మంత్రులు పోలీసులను అడ్డంపెట్టుకొని పారిపోయారని ఆరోపించారు. గతంలో సవాల్ చేసిన రేవంత్ రెడ్డి ప్రెస్‌క్లబ్‌ను కల్లు కాంపౌండ్‌తో పోల్చి పారిపోగా , కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి మూడు నెలల్లోనే మల్కాజీగిరి ఎంపీగా పోటీ చేశారని ఎద్దేవా చేశారు. ఉద్యమం జరిగినప్పుడు గుర్తుకు రాని గన్‌పార్క్ కాంగ్రెస్ మంత్రులకు ఇప్పుడు గుర్తొచ్చిందా ? అంటు ప్రశ్నించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై మంత్రులు అహంకారంతో మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వద్ద సమాధానం లేనప్పుడే ప్రతిపక్ష నాయకులను అరెస్టులు చేస్తారని మండిపడ్డారు. ఏదేని సమస్యపై రేవంత్ రెడ్డి డిఫెన్స్ లో పడగానే బండి సంజయ్ తెరపైకి వస్తాడని, బండి సంజయ్ డిఫెన్స్ లో పడగానే ముఖ్యమంత్రి తెరపైకి వస్తాడని విమర్శించారు. అమృత్ టెండర్ లో ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి కుంభకోణంపై కేంద్రానికి లేఖ రాస్తే చర్యలు ఎందుకు తీసుకోలేదని వేముల ప్రశ్నించారు. బొగ్గు కుంభకోణం జరిగిందని కేంద్రానికి లేఖ రాస్తే ఇంతవరకు చర్యలే లేవని అన్నారు. కేటీఆర్ హరీష్ రావు సెగకు మంత్రులు ఒక్కొక్కరు బయటకు వస్తున్నారని, ఇక ముందు ఇలాంటివి చాలా జరుగుతాయని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలతో సింగరేణిలో బొగ్గు మాయం పై మంత్రి భట్టి విజిలెన్స్ విచారణకు ఆదేశించారని వెల్లడించారు. అప్పులపై, గురుకులాల్లో జరిగిన అవినీతిపై చర్చకు స్వయంగా సవాల్ విసిరిన కాంగ్రెస్ మంత్రులు, చర్చకు హాజరు కాకుండా వెనక్కి పారిపోవడం వారి పిరికితనానికి నిదర్శనం అన్నారు. చర్చ కోసం తెలంగాణ భవన్‌కు చేరుకున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను, ఘన్ పార్క్‌కు బయలుదేరిన మాజీ మంత్రి హరీష్ రావును, అలాగే ఇతర ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ గౌడ్‌లను వందలాది మంది పోలీసులతో అడ్డుకోవడం, నిర్బంధించడం, అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని అవమానపరచడమేనని అన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, కక్షసాధింపు పాలనకు పరాకాష్ట అన్నారు. అప్పులపై నిజంగా చర్చించే ధైర్యం ఉంటే పూర్తి స్థాయిలో అసెంబ్లీలో చర్చ నిర్వహించాలి. చర్చ కు కేసీఆర్ అవసరం లేదు. ఎంతమంది మంత్రులు వచ్చినా కేటీఆర్, హరీష్ రావు లెక్కలతో సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. చర్చకు రమ్మని సవాల్ విసిరి, చర్చకు వచ్చిన ప్రతిపక్ష నాయకులను పోలీసులతో అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ మంత్రులు భయపడి పారిపోయారనే విషయం స్పష్టమైంది.సవాల్ విసరడం, చివరకు తోక ముడవడం కాంగ్రెస్ మంత్రులకు అలవాటుగా మారింది. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సతీమణిని అఘామేఘాల మీద ప్రాధాన్యత లేని శాఖలకు బదిలీ చేయడం ప్రభుత్వం ఎంత భయపడుతోందో వెల్లడిస్తోంది. ఇవన్నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమేనని అన్నారు. తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పిన మంత్రి జూపల్లి కృష్ణారావు భవన్ కి రాకుండా ఘన్ పార్క్ కి రమ్మంటే అక్కడికి కుడా వద్దకు వెళ్లేందుకు బయలుదేరిన కేటీఆర్‌ను కూడా పోలీసులతో అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని బయటపెడుతోంది. బిఆర్ఎస్ నాయకులు పై అక్రమ కేసులు, అరెస్టులు, నిర్బంధాలతో భయపెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఎన్ని నిర్బంధాలు చేసినా, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఆపేది లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో పూర్తిగా విఫలమయ్యారు. రాష్ట్ర సమస్యలను పరిష్కరించడంలో చేతులెత్తేసి, రాజకీయ కక్షసాధింపులకే పరిమితమయ్యారు. కాంగ్రెస్ మంత్రులు ప్రజా పాలనను గాలికి వదిలేసి అవినీతిలో మునిగిపోయారని వేముల విమర్శలు గుప్పించారు.



## కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల నటన అద్భుతం

షోను తలపిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ప్రజలు మీ నాటకాలు చూసి నవ్వుకుంటున్నారు. అబద్దాలకు ఆస్కార్ అవార్డు ఇస్తే రెండు పార్టీలూ అర్హత సాధిస్తాయని అన్నారు. గురుకులాల టెండర్లు, తెలంగాణ అప్పులతోపాటు అవినీతి, అక్రమాలపైనా చర్చిద్దాం రండి. మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆధ్వర్యంలో తేదీ, సమయం, వేదిక నిర్ణయిస్తాం. కాంగ్రెస్, భారాస పాలనా వైఫల్యాలను ప్రజల ముందుంచేందుకు మేం సిద్ధం. మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి ఖర్చు చేసిన నిధులు, అందించిన సంక్షేమ కార్యక్రమాలపైనా చర్చిద్దాం. తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని సంజయ్ అన్నారు.

## స్వాధీనం చేసుకున్న విమానం వేలం

**- దేశంలో తొలిసారిగా ఇడి సంచలన నిర్ణయం**

హైదరాబాద్,జూలై3 : దేశంలోనే తొలిసారిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ స్వాధీనం చేసుకున్న ఓ విమానాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించింది. హైదరాబాద్ జోనల్ ఈడీ స్వాధీనం చేసుకున్న హాకర్ 800 విమానాన్ని విక్రయించేందుకు ఈ నెల 1న ఎంఎస్‌టీసీ ద్వారా ఆక్షన్ నిర్వహించగా.. రూ.3 కోట్లకు అమ్ముడుపోవడం విశేషం. హాకర్ 800 విమానం అనేది అంతకుముందు ఫాల్కన్ పోంజీ కేసు ప్రధాన నిందితుడు అమర్‌దీప్ కుమార్‌కు చెందినది. అయితే అమర్‌దీప్ నకిలీ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో రూ.792 కోట్ల మోసానికి పాల్పడినట్టు ఈడీ తేల్చింది. దర్యాప్తులో భాగంగా ఈ విమానాన్ని గత మార్చి 7న ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత.. చట్టపరమైన పక్రియ ద్వారా, పీఎంఎల్ఏ అడ్జుడికేటింగ్ అథారిటీ అనుమతితో దీనిని ఈ-వేలంలో రూ.3 కోట్లకు విక్రయించారు. ఈ సొమ్మును బాధిత పెట్టుబడిదారులకు తిరిగి చెల్లించనున్నారు. కాగా.. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్ట్ అవ్వగా, దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు ఈడీ తెలిపింది. అయితే.. ఈడీ స్వాధీనం చేసుకున్న విమానాన్ని పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో విక్రయించడం దేశంలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఆస్తుల విక్రయ పక్రియలో పారదర్శకత, పోటీ వాతావరణం కల్పించడం సహా ప్రభుత్వ ఆదాయాన్ని మరింత పెంచే దిశగా ఈ విధానం ఉపయుక్తమవుతుందని అధికారులు భావిస్తున్నారు.

## పాకిస్థాన్‌లో లోయలో పడ్డ బస్సు

**- 40మంది ప్రయాణికుల దుర్మరణం**



ఇస్లామాబాద్,జూలై 3 :పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు.. లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 40 మంది ప్రయాణికులు మరణించారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. పాకిస్థాన్ బలూచిస్థాన్ రాష్ట్రంలో షేరానీ జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న షేరానీ జిల్లా ఉన్నతాధికారులు, వైద్యులు, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను అత్యవసర చికిత్స కోసం ఝోబ్‌లోని ట్రామా సెంటర్‌కు తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటీవల జరిగిన అత్యంత ఘోర రోడ్డు ప్రమాదాల్లో ఇదీ కూడా ఒకటని అధికారులు తెలిపారు. సాంకేతిక లోపంతో ఓ బస్సు ఆగిపోయిందని, దీంతో అందులోని ప్రయాణికులను కూడా ఈ బస్సులోకి ఎక్కించారని అధికారులు చెప్పారు. దీంతో బస్సు ప్రయాణికులతో నిండిపోయిందన్నారు. ఈ ప్రమాదం జరిగిన బస్సు.. 36 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి బయలుదేరిందని పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభమైందని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

# సంపాదకీయం

## పార్లమెంట్ సమావేశాలపై కసరత్తు !

ఈ నెలాఖరులో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లోనే మరోమారు మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను పెట్టే యోచనలో కేంద్రం ఉంది. అయితే గత సమావేశాల్లో ఈ రెండు బిల్లులు వీగిపోయాయి. అయినా కేంద్రం తన పట్టును విడవకుండా ముందుకు సాగాలన్న యోచనలో ఉంది. ఈ బిల్లులు పాస్ కావాలంటే మూడోవంతు మెజార్టీ అవసరం. అందుకుతగ్గ కసరత్తుచేస్తున్నట్లుగా ఉంది. ఇదే సందర్భంలో అన్ని పార్టీలతో చర్చించే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. అందరి అభిప్రాయాలను తీసుకుని ముందుకు సాగాలన్న ఆనవాయితీని బిజెపి ఎప్పుడో విడనాడింది. గతంలో సమస్యలు లేదా బిల్లులకు సంబంధించి ముందస్తు అఖిపలక్ష సమావేశాలు జరిగేవి. కానీ అలాంటి ఆనవాయితీని బిజెపి పాటించడం లేదు. దాదాపు 12 ఏళ్లుగా ఏకాభిప్రాయ సాధనలో మోడీ ఏనాడూ ప్రయత్నం చేయలేదు. ఇకపోతే ఏం జరుగుతుందో కూడా ప్రతిపక్షాల ఊహకు కూడా అందడం లేదు. ఈ క్రమంలో రేపటి బిల్లులను ఎప్పుడు, ఎలా ప్రవేశ పెడతారన్నది కేవలం మోడీ, అమిత్ షాలకు మాత్రమే తెలిసి ఉంటుంది. కేంద్రమంత్రులు, బిజెపి నేతలకు కూడా వీటిపై సమాచారం ఉండకపోవచ్చు. ఇలా గోప్యత పాటించడం వల్ల వచ్చే లాభం ఏమిటన్నది కూడా వారికే తెలుసు. ఇకపోతే పార్లమెంట్ సమావేశాలు ఈ నెల 20 నుంచి ప్రారంభం కావచ్చని చూచాయగా తెలుస్తోంది. ఇదే సమయంలో సమావేశాలకు ముందుగానే మంత్రివర్గ పునర్వ్యస్థీకరణ ఉంటుందని సమాచారం వస్తోంది. దీంతో ఎవరు ఉంటారు, ఎవరు పోతారన్న లెక్కల్లో ఎంపిలు ఉన్నారు. ఇది కూడా మోడీ, అమిత్ షాల కనుసన్నల్లోనే జరుగుతుందనడంలో సందేహం లేదు. అందుకే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంటే దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందుగానే ఈ మార్పులు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని, కొన్ని కీలక మంత్రిత్వ శాఖల్లో కొత్త నాయకులకు చోటు కల్పించడమే లక్ష్యంగా ప్రధాని మోడీ వ్యూహరచన చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. వరుసగా ప్రధాని మోడీ, అమిత్ షాలు వేర్వేరుగా రాష్ట్రపతిని కలవడం ఈ వార్తలకు బలం చేకూరింది. బీజేపీ సంస్థాగత బృందంలో కూడా నితిన్ నబిన్ నేతృత్వంలో సమూల మార్పులు చేసేందుకు పార్టీ అగ్ర నాయకత్వం జాబితాను ఖరారు చేసింది. ప్రభుత్వంతో పాటు పార్టీలో కూడా సమర్థులైన వారికి బాధ్యతలు అప్పగించే దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వ పనితీరును మరింత వేగవంతం చేసేందుకు పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు ఉండబోతున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విద్యాశాఖ బాధ్యతలు అప్పగించి, ఆ స్థానంలో శక్తికాంత దాస్‌ను తీసుకురావచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అనురాగ్ ఠాకూర్ తిరిగి మంత్రివర్గంలోకి వచ్చే అవకాశం బలంగా ఉంది. పరీక్షల లీకేజీలు, ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో సమర్థవంతమైన నాయకత్వం అవసరమని ప్రధాని భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ధర్మేంధర ప్రధాన్‌ను తప్పించే అవకాశాలు కూడా లేకపోలేదు. మరోవైపు పంకజ్ చౌదరి, హర్ష్ మల్హోత్రా వంటి మంత్రులు పార్టీ సంస్థాగత బాధ్యతల్లోకి వెళ్లగా, జార్జ్ కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టు స్థానాల్లో కొత్త ముఖాలను కేబినెట్లోకి తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్,పంజాబ్ రాష్ట్రాల నుంచి మరికొందరు సమర్థ నేతలను మంత్రివర్గం లోకి తీసుకునే అవకాశం ఉంది. బెంగాల్‌లో మెరుగైన ఫలితాలు సాధించిన నేపథ్యంలో అక్కడి ఎంపీలకు ప్రాధాన్యత దక్కవచ్చు. శివసేన రెబెల్ వర్గం నుంచి ఒకరిద్దరికి, ముఖ్యంగా శ్రీకాంత్ షిండేకు అవకాశం లభించవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఆప్ రెబెల్ ఎంపీలు రాఘవ్ చద్దా లేదా అశోక్ మిట్టల్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. రానున్న రోజుల్లో జరగనున్న కీలక రాజకీయ పరిణామాల నేపథ్యంలో, ఈ మార్పులు దేశ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి. కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ త్వరలో కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉండడంతో ఉభయ తెలుగురాష్ట్రాల్లోనూ మార్పులు ఉండవచ్చు.ముఖ్యంగా తెలంగాణలో ఉన్న ఇద్దరిలో మార్పు ఉంటుందా అన్న చర్చకూడా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌కు మరో కేంద్రమంత్రి పదవి దక్కనుందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే టిడిపి నుంచి ఇద్దరు, బిజెపి నుంచి ఒక్కరు కేబినేట్‌లో ఉన్నారు. ఇప్పటికే ఏపీ నుండి ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ, మరో అదనపు పదవిని టీడీపీకి కేటాయించే యోచనలో బీజేపీ ఉన్నట్లు సమాచారం. ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి బలంగా ఉండటంతో, కేంద్రంలో మరిన్ని అవకాశాలు దక్కేలా చంద్రబాబు వ్యూహరచన చేస్తున్నారు. ఒకవేళ మూడో పదవి వస్తే, అది టీడీపీ ఖాతాలోకే వెళ్తుందా లేక జనసేనకు వెళుతుందా, లేక బిజెపికే వెళుతుండా అన్నది చూడాలి. పరిణామం రాష్ట్ర అభివృద్ధికి, కేంద్రంతో సత్సంబంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని పార్టీ నేతలు ఆశిస్తున్నారు. మరోవైపు, సామాజిక సమీకరణాలను బట్టి నిర్ణయం తీసుకుంటే పరిస్థితి మారవచ్చు. మహిళా కోటాలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పేరును కూడా అధిష్టానం పరిశీలించే అవకాశం ఉంది. కొత్త వారికి అవకాశం ఇస్తారా లేదా అనుభవజ్ఞుల వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి. బిజెపికే ఇస్తే మహిళా ఎంపి పురంధేశ్వరికి ఛాన్స్ దక్కవచ్చని అనుకుంటున్నారు. ఒకవేళ ప్రాంతీయ సమతుల్యత పాటిస్తే, ఉత్తరాంధ్ర లేదా రాయలసీమ ప్రాంతాలకు ప్రాధాన్యత పెరిగే ఛాన్స్ ఉంది. మంత్రి పదవి దక్కితే ఏపీకి కేంద్ర నిధులు, ప్రాజెక్టుల విషయంలో మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయని పార్టీ భావిస్తోంది. మొత్తంగా ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలు, మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లుల వ్యయహారంతో పాటు మంత్రివర్గ విస్తరణ అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా ఉంది. రానున్న రోజుల్లో దీనిపై స్పష్టత రానుంది. బిజెపి వ్యూహం ఎలా ఉందన్నది కూడా తెలియనుంది.

# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసిన వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం

### పాత్రికేయుల సంక్షేమానికి సహకారం అందిస్తామని హామీ



వేములవాడ రాజన్న సిరిసిల్ల, జూలై 03 (విజన్ ఆంధ్ర బ్యూరో):తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-హెచ్-143) వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ లాయక్ పాషా, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ ఉపాధ్యక్షులు చింతలతాడేం దేవరాజ్ నాయకత్వంలో కార్యవర్గ సభ్యులు ప్రభుత్వ విప్‌ను గజమాలలతో సత్కరించారు. అనంతరం ఆది శ్రీనివాస్ నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పాత్రికేయులు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలను నిష్పాక్షికంగా వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఐక్యంగా పనిచేస్తూ పాత్రికేయుల సంక్షేమం, వృత్తి విలువల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారం, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం వేములవాడ ప్రెస్ భవనంలో వివిధ జర్నలిస్టు సంఘాల సభ్యులకు కూడా అవకాశం కల్పించాలని కోరుతూ ప్రభుత్వ విప్‌కు ప్రెస్ క్లబ్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ సభ్యులు కొత్వల్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు విష్ణు,క్యాషియర్ పంపంరి నాగరాజు, జిల్లా రమేష్, ఫహద్, చౌటుపల్లి వెంకటేష్, దెబ్బేటి ప్రవీణ్, శ్రీరామోజు వేణు,సంటి రాజేందర్ షబ్బీర్, నవీన్, బూర్ల ప్రదీప్, బండి రజిని, బుర్ల సందీప్, లక్ష్మీనారాయణ,వేణు ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు

# ఇందిరా మహిళా శక్తి యూనిట్లతో మహిళలకు ఆర్థిక స్వావలంబన

## తంగళ్ళపల్లిలో ఫుడ్ ప్రాసెసింగ్, డైరీ యూనిట్ల ప్రారంభం

### మహిళా సంఘాలు మరిన్ని ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలి: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



తంగళ్ళపల్లి రాజన్న సిరిసిల్ల, జూలై 03 (విజన్ ఆంధ్ర బ్యూరో):ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెంకటసాయి కోల్డ్ ప్రెస్ ఆయిల్ అండ్ ఫ్లోర్ మిల్ యూనిట్తో పాటు కోవిదా మిల్క్ పాయింట్ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. అనంతరం యూనిట్లను పరిశీలించిన కలెక్టర్, మహిళలతో మాట్లాడి వాటి నిర్వహణ, ఉపాధి అవకాశాలు, ఆదాయం, భవిష్యత్ ప్రణాళికల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరా మహిళా శక్తి పథకం కింద ప్రారంభించిన కోల్డ్ ప్రెస్ ఆయిల్ యూనిట్‌లో కోల్డ్ ప్రెస్సింగ్ యంత్రం, పిండి గిర్ని సహా మొత్తం ఆరు యంత్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ. 11.50 లక్షల వ్యయంతో ఏర్పాటైన ఈ యూనిట్‌కు పీఎంఎఫ్ఎంఈ (గ్రావీఖీవీజు) పథకం కింద రూ. 3.50 లక్షల సబ్సిడీ అందనున్నట్లు వెల్లడించారు. అలాగే మహిళా సంఘాల సహకారంతో రూ. 5 లక్షల రుణం ద్వారా డైరీ యూనిట్‌ను ఏర్పాటు చేశామని, ఇందులో పాలు, ఇతర డైరీ ఉత్పత్తులు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. జిల్లాలో మరిన్ని మహిళా సంఘాలు ఇటువంటి ఆదాయ వనరులను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఉపాధి కల్పనతో పాటు మహిళా సాధికారతకు ఇటువంటి యూనిట్లు దోహదపడతాయని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో మహిళా సంఘాలకు రుణాల మంజూరుపై ప్రత్యేకంగా ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఆర్-సెటి (=ాజుఐ×) ద్వారా గ్రామీణ మహిళలు, పురుషులకు ఉచిత రెసిడెన్షియల్ నైపుణ్య శిక్షణ అందుబాటులో ఉందని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి రంగంలో రాణించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మల్లికార్జునరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ నర్సింగం, ఇంచార్జి తహసీల్దార్ మురళి, ఇంచార్జి ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ మీర్జా, సర్పంచ్ లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్-12 విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్




రాజన్న సిరిసిల్ల, జూలై 3 (విజన్ ఆంధ్ర బ్యూరో):జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్-12 కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, తప్పిపోయిన, పారిపోయిన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు చేర్చేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జూలై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్-12 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తప్పిపోయిన చిన్నారులను గుర్తించేందుకు దర్పన్ యాప్ వినియోగించాలని, ప్రతి పోలీస్ స్టేషన్‌లో నమోదైన మిస్సింగ్ కేసుల సమాచారాన్ని సేకరించి సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ఇటుక బట్టీలు, బేకరీలు, మెకానిక్ షాపులు, నిర్మాణ పనులు, వ్యవసాయ క్షేత్రాలు తదితర ప్రాంతాల్లో బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. బాల కార్మికులను గుర్తిస్తే యజమానులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని లేబర్, పోలీస్ అధికారులను ఆదేశించారు. రక్షించిన చిన్నారులకు కౌన్సెలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించాలని, విద్యపై ఆసక్తి లేని వారికి ఐటీఐ, పాలిటెక్నిక్, నైపుణ్య శిక్షణా సంస్థల ద్వారా ఉపాధి శిక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాలయాలు, బస్ స్టేషన్లు, బస్సులు తదితర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్న లేదా అనాథలుగా సంచరిస్తున్న చిన్నారులను గుర్తించి రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడే ప్రమాదంలో ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బస్సుల్లో లేదా బస్ స్టేషన్లలో అనాథ చిన్నారులు, మహిళలు కనిపిస్తే వెంటనే 1098 లేదా 181 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. జిల్లా సంక్షేమ, వైద్య ఆరోగ్య, పోలీస్, మున్సిపల్, దేవాదాయ శాఖలు, స్వయం సహాయక సంఘాలు పరస్పర సమన్వయంతో పనిచేసి చిన్నారుల భవిష్యత్తు కోసం కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అంజయ్య, సభ్యులు ఖాజా, మిషన్ వాత్సల్య సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌ఆర్‌ఎస్ రాయితీపై వేగం పెంచాలి

### -జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

### అర్హులైన దరఖాస్తుదారులకు ఫోన్, ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం ఇవ్వాలి

### మున్సిపల్, మండల పరిషత్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశం




రాజన్న సిరిసిల్ల, జూలై 03 (విజన్ ఆంధ్ర బ్యూరో):ఎల్ఆర్ఎస్-2020 కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం ఫీజు రాయితీని అర్హులైన దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రాయితీ గడువు ఈ నెల 31 వరకు మాత్రమే ఉన్నందున దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని సూచించారు. శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో రెవెన్యూ, మున్సిపల్, నీటి పారుదల శాఖ, మండల పంచాయతీ అధికారులతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 43,150 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు అందగా, వాటిలో 5,708 దరఖాస్తులు ఫీజు చెల్లించి పూర్తి అయినట్లు తెలిపారు. 3,316 దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయని, 6,051 దరఖాస్తులు ప్రస్తుతం అధికారుల పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. అలాగే 28,075 మంది దరఖాస్తుదారులు రాయితీకి అర్హులు కాగా, నిర్ణీత ఫీజు చెల్లించిన వెంటనే క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు దరఖాస్తుల స్క్రూటినీని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించిన కలెక్టర్, నీటి వనరుల బఫర్ జోన్‌లు, నాలాలు, చెరువులు, హెరిటేజ్ భవనాలు, ప్రభుత్వ భూములకు సంబంధించిన క్రమబద్ధీకరణ దరఖాస్తులను నిబంధనల ప్రకారం తిరస్కరించాలని స్పష్టం చేశారు. హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటుకు ఆదేశంజిల్లాలోని అన్ని మున్సిపల్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ రాయితీ, దరఖాస్తు ప్రక్రియ, ఫీజు వివరాలపై అవగాహన కల్పించే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రజలకు మార్గనిర్దేశం చేసే సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. అర్హులైన దరఖాస్తుదారులకు ఫోన్ కాల్స్, ఎస్ఎంఎస్‌ల ద్వారా సమాచారం అందించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, జిల్లా నీటి పారుదల శాఖ అధికారులు, డీటీసీపీ అధికారి అన్సారీతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కమలం వైపు నేతల చూపు


నెల్లూరు జూలై 2, ఏపీలోని అధికార, ప్రతిపక్ష పార్టీల్లోని కీలక నాయకులు కొందరు బీజేపీ వైపు చూస్తున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. వీరిలో అధికార పార్టీ ఎమ్మెల్యేలుగా , ఎంపీలుగా ఉన్న ఒకరిద్దరు నాయకుల పేర్లు కూడా తరచుగా వినిపిస్తున్నాయి. 'ఏమో.. వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితులు ఎలా ఉంటాయో.. తప్పేముంది. ఈ పార్టీ కాకపోతే.. మరొకటి. నాకు సత్తా ఉంది. ఆ పార్టీకి చేర్చుకునేందుకు అవకాశం ఉంది.' అని క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ఓ కీలక నాయకుడు ఆఫ్ ది రికార్డుగా వ్యాఖ్యానించారు. ఇక, ఎంపీల విషయంలోనూ ఇదే తరహా వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి కోస్తా జిల్లాల్లోని ఓ ఎంపీ గత ఎన్నికలకు ముందు చివరి నిమిషంలో టీడీపీ బీ ఫాం దక్కించుకున్నారు. కానీ, ఆయన పార్టీపరంగా కంటే.. జాతీయస్థాయి నేతలతోనే ఎక్కువగా టచ్‌లో ఉంటున్నారు. దీనికి కారణం.. అవసరమైతే.. వచ్చే ఎన్నికల్లో మార్పు కోసమేనని ఆయన చెబుతున్నారు. ఇది వినేందుకు చిత్రంగా ఉన్నా.. ఎవరికి వారు అప్పుడే కర్చీఫ్‌లు రెడీ చేసుకుంటున్నారు. ఇక, వైసీపీలోనూ కొందరు ఎమ్మెల్యేలు ఇదే బాటలో ఉన్నారన్న చర్చ కూడా ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఓ సీనియర్ నాయకుడు బీజేపీతో టచ్‌లోకి వెళ్లారు. అయితే.. ఆయన కీలక పదవిని ఆశించారని.. ఆ పదవి ఇచ్చే విషయంలో బీజేపీ వెనక్కి తగ్గడంతో ఆయన మౌనంగా ఉన్నారని వైసీపీలోనే చర్చ సాగుతోంది. ఇక, ఓ ఎంపీ అయితే.. నేరుగా బీజేపీ నేతలతోనే కలివిడిగా ఉంటున్నారు. ఢిల్లీలోనే ఎక్కువ సమయం గడిపేస్తున్నారు. బీజేపీ మంత్రుల కార్యాలయాల్లోనూ ఆయన కనిపిస్తున్నారు. ఎంపీగా పనులు చేయించుకునేందుకు వచ్చానని సదరు పార్లమెంటు సభ్యుడు సెలవిస్తున్నారు. అయితే.. ఇదంతా ఎందుకంటే.. అధికార పార్టీకి చెందిన నాయకుల్లో టికెట్ల బెంగ కనిపిస్తోంది. వారిపై చేయిస్తున్న సర్వేల్లో మార్కులు తగ్గడం... వచ్చే ఎన్నికల్లో టికెట్లు దక్కుతాయోలేదో నన్న బెంగ వెంటాడుతుండడంతో సదరు నేతలు ముందుగానే వచ్చే ఎన్నికలకు ప్రిపేర్ అవుతున్నారు. ఇక, వైసీపీ నాయకుల్లో వచ్చే ఎన్నికలపై పెద్దగా ఆశలు లేకుండా పోతున్నాయన్న వాదన ఉంది. ఏమో మళ్లీ విపక్షంలో కూర్చునే పరిస్థితి వస్తుందేమోనని వారు బెంగ పెట్టుకున్నారని అంటున్నారు. అందుకే కేసుల బెడద నుంచి తప్పించుకునేందుకు బీజేపీతో ముందుగానే టచ్‌లోకి వెళ్లిపోయారట.


# లోకల్ బాడీ ఎలక్షన్స్ గురి

విజయవాడ, జూలై 2,వైసీపీ అధినేత జగన్ పార్టీ నియోజకవర్గాల ఇంచార్జ్‌లు, మాజీ ఎమ్మెల్యేలతో భేటీ అవుతున్నారు. ఈ సందర్భంగా పార్టీపరంగా కొన్ని దిశానిర్దేశాలు చేస్తున్నారు. ఇదే సమయంలో స్థానిక ఎన్నికలకు సంబంధించి కూడా వారికి సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ముఖ్యంగా గత ప్రభవం తిరిగి తీసుకురావాలన్నదే జగన్ లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే.. ఇది సాధ్యమేనా? అనేది ప్రశ్న. ఎందుకంటే.. ఎవరు అధికారంలో ఉంటే వారే స్థానికంగా విజయం దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అసలు పోటీ నుంచే తప్పుకొంది. అయినా.. కొందరు టీడీపీ నాయకులు పోటీ చేశారు. ఇక, ఇప్పుడు వైసీపీ స్థానికంలో అయినా.. గెలుపు గుర్రం ఎక్కి.. విజయం దక్కించుకుని గత ఎన్నికల్లో జరిగిన పరాభవం నుంచి బయట పడేందుకు ప్రయత్నాలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కానీ, క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వంపై ఉన్న సానుకూలత వైసీపీకి కలసి వచ్చేలా లేదు.

# ప్రజల విశ్వాసమే పోలీసింగ్‌కు పునాది

### డీజీపీ సీవీ ఆనంద్






వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 03 (విజన్ ఆంధ్ర)రాష్ట్ర పోలీసుశాఖలో ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన, బాధ్యతాయుతమైన సేవలను అందించేందుకు ప్రతి పోలీసు అధికారి స్టాండరైజ్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఞూాం)ను కచ్చితంగా అమలు చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. జూలై 3న రాష్ట్రంలోని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, క్షేత్రస్థాయి అధికారులతో డీజీపీ దృశ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఎస్పీ సునిత రెడ్డి జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, విధుల నిర్వహణలో నిష్పక్షపాత ధోరణి, క్రమశిక్షణ, ప్రజల పట్ల మర్యాద, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించడం ప్రతి పోలీసు అధికారికి ప్రాథమిక బాధ్యత అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు, బాధితులకు సహాయం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో ఒకే విధమైన ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఫిర్యాదులను ఆలస్యం లేకుండా స్వీకరించి సత్వర పరిష్కారం చూపాలని, పెండింగ్ కేసులను వేగంగా దర్యాప్తు చేయాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, అక్రమ కార్యకలాపాల అరికట్టడం, ట్రాఫిక్ నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ, విజిబుల్ పోలీసింగ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, పారదర్శకత, జవాబుదారీతనంతో విధులు నిర్వహించి ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయాలని ఆదేశించారు. వనపర్తి ఎస్పీ సునిత రెడ్డి జిల్లాలో కేసుల దర్యాప్తు పురోగతి, గస్తీ వ్యవస్థ, ఫిర్యాదుల పరిష్కార విధానం, అత్యవసర 100 కాల్స్ స్పందన, బాధితుల ఇంటి వద్దకే వెళ్లి కేసుల నమోదు వంటి ప్రజా అనుకూల పోలీసింగ్ చర్యలను డీజీపీకి వివరించారు. ఈ సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి సీఐ సుగంధ రత్నం, కొత్తకోట సీఐ రాంబాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, ఆర్ఐ శ్రీనివాస్, కార్యాలయ సూపరింటెండెంట్లు ఇంతియాజ్, రాజవర్ధన్, జిల్లాలోని ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్‌కు ఘన సన్మానం

### కాలనీ అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడిన అంబేద్కర్ నగర్ ఫేజ్3 వాసులు



బోడుప్పల్, జూలై 3 (విజన్ ఆంధ్ర): బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్‌కు అంబేద్కర్ నగర్ ఫేజ్ 3 కాలనీ వాసులు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ ఆద్వర్యంలో కాలనీవాసులు ఆయనకు శాలువా కప్పి, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ మాజీ కార్పొరేటర్‌గా పనిచేసిన కాలంలో కాలనీ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో ఆయన అందించిన సేవలను వారు కొనియాడారు. బొమ్మక్ కళ్యాణ్ కుమార్ నాయకత్వంలో బోడుప్పల్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన ఇదే నిబద్ధతతో కృషి చేస్తూ మరిన్ని సేవలు అందించాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ పోలీసులు అధికారులను గుండెల్లో నిలుపుకుంటారు

### పూర్వ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



హన్మకొండ బ్యూరో ఛీఫ్ జులై 2( విజన్ ఆంధ్ర)వరంగల్ పోలీసులు తమతో కలిసి పనిచేసిన అధికారులను ఎప్పటికీ గుండెల్లో నిలుపుకుంటారని పూర్వ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వహించి, ఇటీవల సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా బదిలీ అయిన సన్ ప్రీత్ సింగ్‌కు గురువారం ఆర్మ్ రిజర్వ్ పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ మైదానంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పోలీస్ అధికారులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై సన్ ప్రీత్ సింగ్‌ను నిలబెట్టి, పోలీస్ అధికారులు తాళ్లతో ఆ వాహనాన్ని లాగుతూ తమ అభిమానాన్ని, గౌరవాన్ని చాటుతూ భావోద్వేగపూరితంగా వీడ్కోలు పలికారు. అనంతరం సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో 15 నెలలపాటు విధులు నిర్వహించిన కాలంలో ప్రతి అధికారి, ప్రతి పోలీస్ సిబ్బంది అందించిన సహకారం ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. కమిషనరేట్‌లోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్ల శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందించడంలో విశేష ఫలితాలు సాధించగలిగామని పేర్కొన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఏర్పడిందని, ఇక్కడి అధికారులు, సిబ్బంది, ప్రజలు చూపిన ప్రేమ, ఆదరణ జీవితాంతం గుర్తుండిపోతాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా వరంగల్ పోలీస్ కమిషనరేట్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు ధార కవిత, రాజమహేంద్ర నాయక్, అదనపు డీసీపీలు సురేష్ కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్ రావు, బాలస్వామి, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు (ఆర్.ఐలు), ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కట్టు దిట్టంగా అమలు చేయాలి

### -నిబంధనలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లపై కఠిన చర్యలు

### -కలెక్టర్ కోయ శ్రీహర్ష




పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-03(విజన్ ఆంధ్ర)జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆహార పదార్థాల నిల్వ, తయారీ, పరిశుభ్రత, వడ్డింపు వంటి అన్ని అంశాల్లో ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో పనిచేసే సిబ్బందికి ఆహార భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, వినియోగదారుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేసి, అవసరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం మాత్రమే తిరిగి నిర్వహణకు అనుమతులు ఇస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. మే 29న మంథని మార్కెట్ ప్రాంతంలోని శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్, జూన్ 13న గోదావరిఖనిలోని డెస్టినేషన్ రెస్టారెంట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అపరిశుభ్రత, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి ఆయా రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేసినట్లు తెలిపారు. తదనంతరం ఆయా సంస్థల నిర్వాహకులు పరిశుభ్రత, ఆహార భద్రత ప్రమాణాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు చేపట్టడంతో, ఫుడ్ సేఫ్టీ అధికారుల పునఃపరిశీలన అనంతరం శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్‌కు జూన్ 4న, డెస్టినేషన్ రెస్టారెంట్‌కు జూన్ 30న తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ఇతర హోటళ్లు, రెస్టారెంట్లలో కూడా ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ఎక్కడైనా అపరిశుభ్రత లేదా నిబంధనల ఉల్లంఘన గుర్తించిన వెంటనే సంబంధిత సంస్థలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. హోటల్, రెస్టారెంట్ నిర్వాహకులు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తూచా తప్పకుండా పాటించి ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

## సుర్దాపూర్‌లో పోడు రైతులను కలిసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 3 (విజన్ ఆంధ్ర)కొమురం భీం అసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని సుర్దాపూర్ గ్రామంలో పోడు భూముల సమస్యలపై ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి గ్రామంలో పర్యటించి పోడు సాగు చేస్తున్న రైతులతో నేరుగా మాట్లాడారు. "తరతరాలుగా అటవీ భూమిని నమ్ముకొని వ్యవసాయం చేస్తున్న పోడు రైతులకు న్యాయం జరగాలి. రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే కు వివరించారు. ఫారెస్ట్ అధికారుల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు సుర్దాపూర్‌తో పాటు మండలంలో అర్హులైన ప్రతి ఒక్క పోడు రైతుకు న్యాయం జరిగేలా చూస్తాను. ఫారెస్ట్, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని సర్వే ప్రక్రియ చేస్తాం. పోడు రైతులు ఎవరూ అధైర్య పడొద్దని రైతులకు ఎమ్మెల్యే సూచించారు, ఈ కార్యక్రమంలో కెరమెరి బీఆర్ఎస్ నాయకులు, పోడు రైతులు పాల్గొన్నారు.

## మోతినగర్లో హైడ్రా కూల్చివేతలు

హైదరాబాద్‌మోతినగర్-బోరబండ రోడ్డు సిగ్నల్ ప్రాంతంలో రహదారి పక్కన ఉన్న అక్రమ నిర్మాణాలను హైడ్రా ం అధికారులు శుక్రవారం ఉదయం కూల్చివేశారు. రోడ్డు విస్తరణ, ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఫుట్పాత్లు, రోడ్డు మార్జిన్లను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగించారు. ఈ కూల్చివేతలకు ముందు స్థానికులకు, వ్యాపారులకు నోటీసులు ఇచ్చామని అధికారులు తెలిపారు.

## రైలు కిందపడి దంపతుల ఆత్మహత్య

హైదరాబాద్ కుంట్లూర్ ప్రాంతంలో నివాసం ఉండే రవికుమార్, శిరీష దంపతులు శుక్రవారం నాడు ఘట్కేసర్ పరిధిలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులు దంపతులు వరంగల్ ప్రాంతానికి చెందిన వారని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు వెల్లడించారు.

## ఆస్టర్ క్వాలిటీ కేర్ కార్యకలాపాలు ప్రారంభం



హైదరాబాద్, జూలై 03 (విజన్ ఆంధ్ర) : ఆస్టర్ డీఎం హెల్త్ కేర్, క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ విలీనం పూర్తికావడంతో ఏర్పడిన ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్ జూలై 1 నుంచి అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించిందని ఆ సంస్థ ప్రతినిధులు శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఈ విలీనంతో ఆస్టర్ డీఎం, కేర్ హాస్పిటల్స్, ఎవరకేర్, కిమ్స్ హెల్త్ ఒకే గొడుగు కిందకు వచ్చాయన్నారు. సంస్థకు డా.అజాద్ మూపెన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా, వరుణ్ ఖన్నా మేనేజింగ్ డైరెక్టర్, గ్రూప్ సీఈఓగా కొనసాగనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 28 నగరాల్లో 39 ఆసుపత్రులు, 10,600కు పైగా పడకలతో సేవలందిస్తున్న ఆస్టర్ క్వాలిటీ కేర్, మెట్రో నగరాలతో పాటు టియర్-2, టియర్-3 నగరాలకు అత్యాధునిక వైద్య సేవలను విస్తరించనుందని తెలిపారు. భవిష్యత్‌లో గామా నైఫ్, జాప్ స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ వ్యవస్థలు, 10 రోబోటిక్ శస్త్రచికిత్స యంత్రాలు, 12 కొత్త లైనాక్ రేడియేషన్ థెరపీ యంత్రాల ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో మొత్తం పడకల సంఖ్యను 15 వేలకుపైగా పెంచాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రస్తుతం సంస్థలో 45 వేలకుపైగా వైద్యులు, నర్సులు, ఇతర ఆరోగ్య సేవల నిపుణులు పనిచేస్తున్నట్లు తెలిపారు.

# మహబూబాబాద్ రోటరికి అవార్డుల పంట

## రెండు తెలుగు రాష్ట్రాల రోటరీల్లో ఉత్తమ సేవారత్న అవార్డు


### వివిధ సేవా విభాగల్లోనూ మరో తొమ్మిది అవార్డులు
### హైదరాబాద్ కొంపెల్లి వేదికగా అవార్డుల ప్రధానోత్సవం
### రోటరీ గవర్నర్ రాంప్రసాద్ చేతులమీదుగా అవార్డుల స్వీకారణ
### మహబూబాబాద్ రోటరీక్లబ్ కు అభినందనల వెల్లువ.



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జులై 3 (విజన్ ఆంధ్ర):రోటరిక్లబ్ ఆఫ్ మహబూబాబాద్ కు ఉత్తమ సేవారత్న అవార్డు లభించింది. హైదరాబాద్ కొంపెల్లి వేదికగా జరిగిన అవార్డుల ప్రధానోత్సవాల్లో మహబూబాబాద్ రోటరిక్లబ్ కు అవార్డుల పంట పండింది. డిస్ట్రిక్ట్ - 3150 లోని రెండు రాష్ట్రాల పరిధిలో వివిధ విభాగల్లో తొమ్మిది అవార్డులు సాధించి జయకేతనం ఎగురవేసింది. డిస్ట్రిక్ట్ గవర్నర్ రాంప్రసాద్ చేతులమీదుగా జరిగిన అవార్డుల ప్రధానోత్సవాల్లో మహబూబాబాద్ రోటరీక్లబ్ పాల్గొంది. రోటరిక్లబ్ అధ్యక్షులు వేమిశెట్టి కిషోర్ కుమార్, సెక్రెటరీ జంగాల విజయ్ కుమార్, రోటరీ వ్యవస్థాపకులు మాలె నాగేశ్వరరావు, డిస్ట్రిక్ట్ లీడర్ వద్దుల సురేందర్ రెడ్డి, ట్రెజరర్ శంతన్ రామరాజు, సీనియర్ రొటేరియన్లు బిక్కి వెంకటేశ్వర్లు, తొర్నాల నగేష్ కుమార్ లు పాల్గొన్నారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ 2009లో ప్రారంభమైన మహబూబాబాద్ రోటరీ ప్రస్థానం అంచలంచలుగా ఎదిగిందన్నారు. తాము చేస్తున్న సేవాకార్యక్రమాలకు రెండు తెలుగు రాష్టాల 106క్లబ్బులో మూడో స్థానం దక్కడం సమాజం పట్ల మాకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందాన్నారు. 1905 చికాగో నగరంలో పాల్ హ్యారీస్ నాయకత్వాన మొదలైన రోటరీ ఇంటర్నేషనల్ ప్రపంచంలో పెనుమార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. అందుకనుగుణంగానే మహబూబాబాద్ రోటరిక్లబ్ పర్యావరణం, విద్య, వైద్య రంగాల్లోనే కాకుండా మహిళాసాధికారికత అంశాలపై స్ఫూర్తిదయాక సేవాకార్యక్రమాలు చేసిందన్నారు. వాటర్ ప్లాంట్లు, విద్యార్థినులకు పదిలక్షల విలువ చేసే రీయుసాబుల్ సానిటరీ ప్యాడ్స్, ఉచితంగా సైకిల్లు, టీవీలు, కృత్రిమకాళ్ళ క్యాంపులు ఇలా కోట్ల రూపాయల విలువ చేసే కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇప్పుడు వచ్చిన అవార్డులు సమాజాభివృద్ధి పట్ల మా భాద్యతను మరింత పెంచాయాన్నారు. ఇదే స్పూర్తిగా 2026 - 2027కు గాను మరింత పారదర్శకమైన, నాణ్యమైన, అత్యుత్తమమైన సేవలతో మహబూబాబాద్ రోటరిక్లబ్ ను మొదటి స్థానంలో నిలబెడుతామని విశ్వాసం వ్యక్తంచేశారు. అదేవిదంగా ఉత్తమ సేవారత్న అవార్డులు సాధించిన మహబూబాబాద్ రోటరీక్లబ్ ను అభినందించిందిన వారిలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్, ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ చీఫ్ విప్ తేజవత్ రాంచంద్రు నాయక్, కురవి వీరభద్రస్వామి ఆలయ చెర్మన్ కొర్ణ రవీందర్ రెడ్డిలు వున్నారు. ఇంకా ఈకార్యక్రమంలో రొటేరియన్లు బోనగిరి గిరిధర్ గుప్తా, బొల్లం శ్రీనివాస్, ముల్లంగి మోహన్ రెడ్డి, గూడూరు నాగేశ్వరరావు, కళ్లెం వెంకట్ రెడ్డి, కొడారి నాగేందర్, దూదికట్ల సత్యం, సాధు మహిపాల్ రెడ్డి, లక్ష్మి నర్సింహారావు బోయినిపల్లి సతీష్ రావు, జంగాల మంగపతి రావు, జంగాల నర్సింహారావు, ఓదెల శివకుమార్, నాళ్ళ వీరన్న, అచ్చ శ్రీనివాస్, మాలె శ్రవణ్, ఇమ్మడి కృష్ణమూర్తి, తోడేటి వెంకన్న, కట్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


## పద్మ పురస్కాలకు అర్హులైన వ్యక్తుల నుండి నామినేషన్ల ఆహ్వానం

### -జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల జులై 3 (విజన్ ఆంధ్ర బ్యూరో)భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రదానం వేసే పద్మ అవార్డులు- 2027 ( పద్మ విభూషణ్,పద్మ భూషణ్,పద్మ శ్రీ) అర్హులైన వారి నుండి నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశానికి,సమాజానికి విశిష్ట సేవలు అందించిన అసాధారణ ప్రతిభావంతులను పద్మ అవార్డులకు సిఫారసు చేయాలని భారత ప్రభుత్వం కోరుతున్నట్లు తెలిపారు. గుర్తింపు పొందన ప్రతిభావంతులు, గ్రామీణ,గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న వారు, మహిళా సాధికారత, బాలల సంక్షేమం,సామాజిక సేవ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అదే విధంగా కళలు,సాహిత్యం,విద్య,క్రీడలు,వైద్యం, సామాజిక సేవ,సైన్స్, ఇంజినీరింగ్,పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీస్,వాణిజ్యం, పరిశ్రమలు మొదలైన రంగాల్లో విశిష్ట సేవలు అందించి విజయాలు సాధించిన వారికి ఈ అవార్డులు అందజేయనున్నట్లు వెల్లడించారు. 2027 సంవత్సరానికి ఇచ్చే ఈ పద్మ అవార్డుల కోసం నామినేషన్లు/సిఫార్సులను రాష్ట్రపతి పురస్కార్ పోర్టల్ హ్ట్జుం://awards.gov.in ద్వారా స్వీకరించబడతాయని వెల్లడించారు. నామినేషన్లను 15 జూలై,2026 లోగా పైన పేర్కొన్న పోర్టల్‌లో అందుబాటులో ఉన్న ఫార్మాట్‌లో,పూర్తి వివరాలతో పాటు విశిష్ట సేవలు,సామాజిక సేవలు వివరణాత్మక కథనం రూపంలో పంపించాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో నామినేషన్లు పంపడానికి అవసరమైన సూచనలు https://awards.gov.in పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని,అలాగే నియమ నిబంధనలు పద్మ అవార్డుల వెబ్‌సైట్: https://padmaawards.gov.in లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన అర్హులైన వ్యక్తులు లేదా వారి పేర్లను సిఫారసు చేయదలచిన వారు,పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలను 2026 జూలై 15లోగా జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయానికి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

## కొత్మీర్ గ్రామంలో అధ్వాన్న రహదారి పట్టించుకోని అధికారులు



కొత్మీర్ జూలై 2 (విజన్ ఆంధ్ర )కొమురం భీం జిల్లాలోని దహేగాం మండల పరిధిలోని కొత్మీర్ గ్రామంలో చిన్నపాటి వర్షాలకే ప్రధాన రహదారి పూర్తిగా బురదమయంగా మారింది. రోడ్డంతా నీటి గుంతలతో నిండిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త రహదారి నిర్మించకపోవడంతో పాత రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఎక్కడ చూసినా గుంతలు, బురద పేరుకుపోవడంతో నడవడమే కష్టంగా మారిందిచిన్నారులు ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, వృద్ధులు రోడ్డుపై జారిపడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు రాకపోకలు కష్టంగా మారుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ఈ సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షాలు పడిన ప్రతిసారి ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని వారు తెలిపారు. కనీసం రోడ్డులోని గుంతలను మట్టి లేదా మరంతో పూడ్చి ప్రజలు నడిచేలా తాత్కాలిక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే గ్రామానికి శాశ్వత పరిష్కారంగా కొత్త సీసీ రోడ్డు లేదా బీటీ రోడ్డు నిర్మించాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఓపి బ్లాక్ బిల్లింగ్ నిర్మాణానికి భూమి పూజ చేసిన

### -ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గట్టు జూలై 3 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో 20 లక్షల వ్యయంతో ఓపి బిల్లింగ్ నిర్మాణం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి హాజరై పూజ చేసి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే కి డాక్టర్ శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆసుపత్రి ఆవరణంలో ఎమ్మెల్యే మొక్కలు నాటడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూగట్టు మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల నుండి ప్రజలు ఆరోగ్య సమస్యలపై ఆసుపత్రికి వచ్చినప్పుడు ప్రజలకు మెరుగైన వైద్యం అందించి ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్యము చికిత్సను అందించాలని సూచించారు. త్వరగా బిల్లింగ్ నిర్మాణం పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీలు విజయ్, రాజారెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బజారి, నాయకులు గద్వాల తిమ్మప్ప,మోహన్ గౌడ్, హనుమంత్ రెడ్డి, లక్ష్మారెడ్డి సంతోష్, కృష్ణ, గోవిందు, రంగన్న, వైద్యులు వైద్య సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యాసంస్థలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కేంద్రాలుగా నిలవాలి

### -జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు



కేటీదొడ్డి జూలై 03 (విజన్ ఆంధ్ర బ్యూరో)జిల్లాలోని ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కేంద్రాలుగా నిలవాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అన్నారు. శుక్రవారం కేటీదొడ్డి మండలంలో మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల,జూనియర్ కళాశాల (బాలుర)ను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా,వసతి,భోజన సౌకర్యాలు, పారిశుధ్యం తదితర ఏర్పాట్లను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కేంద్రాలుగా నిలవాలని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించడంతో పాటు హాస్టళ్లలో పరిశుభ్రతను ఎల్లప్పుడూ పాటించాలన్నారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, వంటశాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికితీసేలా బోధన కొనసాగించాలని,హాజరు శాతం పెంపు, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక వసతులను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచి, ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో వారికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ తనిఖీలో పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, హాస్టల్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి కి సాదర వీడ్కోలు



కడప,జూలై 03 (విజన్ ఆంధ్ర):రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు వై ఎస్ ఆర్ కడప జిల్లా ఒకరోజు పర్యటన ను ముగించుకొని మ.2.40 గం.లకు హెలిప్యాడ్ నుండి ప్రత్యేక హెలికాప్టర్ లో కుప్పం నకు బయలు దేరగా సాదర వీడ్కోలు లభించిందిజిల్లా ఇంచార్జి మంత్రి ఎస్.సవిత,జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ప్రభుత్వ విప్ మరియు జమ్మలమడుగు శాసన సభ్యులు సి.ఆదినారాయణ రెడ్డి,డి ఐ జి కోయా ప్రవీణ్, ఎస్ పి షెల్కే నచికేత్ విశ్వనాథ్,కమలాపురం,మైదుకూరు శాసనసభ్యులు పుట్టా కృష్ణ చైతన్య రెడ్డి,పుట్టా సుధాకర్ యాదవ్, నాయకులు భూపేష్ రెడ్డి ప్రజా ప్రతినిధులు సాదర వీడ్కోలు పలికారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు చేరాలి: ఎంపీ గోడం నగేశ్

## ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా,జూలై 03,(విజన్ ఆంధ్ర);జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును మరింత సమర్థవంతంగా చేపట్టి, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా అధికారులు కృషి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఎంపీ గోడం నగేశ్ అధ్యక్షతన నిర్వహించగా, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, మున్సిపల్ చైర్‌పర్సన్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.సమావేశంలో గత ఏడాది కాలంగా వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, పెండింగ్ పనులు, భౌతిక, ఆర్థిక పురోగతిపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు.గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులు, ఈజీఎస్, మెటీరియల్ వర్క్స్, 'ఏరువాక ' మన ఊరు మన చేను' కార్యక్రమం, బ్యాంకు లింకేజీ, పంచాయతీరాజ్ శాఖ ద్వారా ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, వ్యవసాయ శాఖ ద్వారా పీఎంకేఎస్‌వై అమలు, యూరియా నిల్వలు, విద్యుత్ శాఖ మౌలిక సదుపాయాలు, వైద్య ఆరోగ్య శాఖ నేషనల్ హెల్త్ మిషన్, విద్యాశాఖ సర్వ శిక్ష అభియాన్, పీఎం శ్రీ, మధ్యాహ్న భోజన పథకం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్, ఉద్యానవన, అటవీ, గిరిజన సంక్షేమ, క్రీడలు,




పౌర సరఫరాలు, బీఎస్ఎన్ఎల్, నేషనల్ హైవే, లీడ్ బ్యాంక్ తదితర శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి శాఖ పనితీరును విడివిడిగా సమీక్షించి సమస్యలకు తక్షణ పరిష్కారాలు చూపాలని, అభివృద్ధి పనులు జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ కింద అర్హులైన ప్రతి జాబ్‌కార్డు దారుకు ఉపాధి కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు, అటవీ ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని, రేషన్ బియ్యం పారదర్శకంగా పంపిణీ చేయాలని తెలిపారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఉపాధి హామీ పనుల్లో సమాన పనిదినాలు, సమాన వేతనం అమలు చేయాలని, అనుమతులు లభించిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. యూరియా సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, రైతులకు యూరియా యాప్ వినియోగంపై క్షేత్రస్థాయిలో సహాయం అందించాలని పేర్కొన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అటవీ అనుమతుల సమస్యలు ఉన్నచోట పరిష్కారం చూపాలని, నిర్మాణాల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, భైంసా సమీప జాతీయ రహదారిపై ప్రమాదకర బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని, బాసర వంతెనను ప్రమాదరహితంగా తీర్చిదిద్దాలని కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రెవెన్యూ మ్యాప్‌లు లేని 14 గ్రామాల్లో సర్వేలు, 70 గ్రామాల్లో రీ-సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు. శాఖల వారీగా అధికారులు తమ పురోగతిని వివరించారు. జిల్లాలో 1.74 లక్షల జాబ్‌కార్డుదారులకు ఉపాధి కల్పిస్తున్నట్లు, ఇందిరమ్మ ఇండ్ల కింద 2,136 గృహాలు పూర్తిచేసి రూ.146 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకానికి రూ.17.74 కోట్లు వ్యయం చేసినట్లు, 20 పీఎం శ్రీ పాఠశాలలకు రూ.1.34 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. జిల్లాలో 2.49 లక్షల రేషన్ కార్డుల ద్వారా ప్రతి నెల ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు, 41,950 కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు వివరించారు. పీఎం కిసాన్ పథకం కింద 53 వేల మంది రైతులకు రూ.32 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ అంకం మౌనిక, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాద్రి, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఎఫ్‌వో సుశాంత్ సుఖదేవ్ బోబడే, డీఆర్‌వో రాథోడ్ రమేష్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కాపాస్ కాంతి పథకాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి

## -ఎమ్మెల్యే విజయుడు

వడ్డేపల్లి జూలై 03 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండల కేంద్రంలో పత్తి సాగులో ఉత్పాదకతను పెంచి రైతుల ఆదాయాన్ని మెరుగుపర్చే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ (కాపాస్ కాంతి) 2026 ' 2031' కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ముఖ్య అతిథిగా హాజరైనారు. రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఆధునిక వ్యవసాయ సాంకేతికతను అవలంబించడం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడంతో పాటు నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేయవచ్చని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'కాపాస్ కాంతి' పథకాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో మరింత అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు హై డెన్సిటీ ప్లాంటింగ్ సిస్టమ్ (ఎచ్ డి పి




ఎస్), క్లోజర్ స్పేసింగ్, ఇంటిగ్రేటెడ్ క్రాప్ మేనేజ్‌మెంట్ (ఐసిఎం) వంటి ఆధునిక పత్తి సాగు విధానాలను వివరించారు. శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా పంట దిగుబడితో పాటు నాణ్యత కూడా మెరుగుపడుతుందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు జాతీయ స్థాయి ఛాంపియన్లుగా నిలువడం అభినందనీయం

## -పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్
## -అబాకస్, వేదిక్ మ్యాథ్స్ లో అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన సత్యశోధక్ విద్యార్థులను అభినంధించిన ఎంపి

నిజామాబాద్ జులై 03( విజన్ ఆంధ్ర)విద్యార్థులు గ్రామీణ ప్రాంతంలో చదువుతూ జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో రాణించి అంతర్జాతీయ స్థాయికి ఎంపికకావడం అభినందనీయమని, విజ్ఞానం, విలువలను పెంపొందించుకొంటూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ సూచించారు.గురువారం తన కార్యాలయంలో సత్యశోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థులువి. సాద్వి, కె. రుగ్వేదా, జి. అద్వైత్ రెడ్డి లు అబాకస్, వేదిక్ మ్యాథ్స్ లో జాతీయస్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి ఛాంపియన్స్ గా నిలిచి అంతర్జాతీయ స్థాయికి ఎంపికైనందునహెూఎం. పి. అరవింద్ తన చేతుల మీదుగా అవార్డులు, సర్టిఫికెట్లు



మరియు నగదు ప్రోత్సాహాన్ని అందజేసి విద్యార్థులను అభినందించారు.హా విద్యార్థులు ఇలాగే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య, ఉపాధ్యాయులు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపొందేలా కృషి చేయాలి

## -కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్, జూలై 03 :( విజన్ ఆంధ్ర) నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపొందేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. క్షేత్రస్థాయిలో రైతులను ప్రోత్సహిస్తూ జిల్లాలో ఈ సీజన్ లో 2 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని లక్ష్యంగా నిర్దేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో శుక్రవారం వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో, ఆయిల్ పామ్ నర్సరీని నిర్వహిస్తున్న ప్రీ-యునిక్ కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయిల్ పామ్ సాగు పురోగతిపై క్లస్టర్ల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం నందిపేట మండలం లక్కంపల్లి సెజ్ ప్రాంతంలో గుర్తించిన స్థలం అనుకూలతపై చర్చించారు. భవిష్యత్తులో ఇదే ప్రాంతంలో రిఫైనరీ ఏర్పాటుకు సైతం స్థలం అందుబాటులో ఉండడం, పొరుగు జిల్లాలకు సెంటర్ పాయింట్ కావడంతో లక్కంపల్లి సెజ్ స్థలం ఫాక్టరీ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అయితే ఆయిల్ పామ్ పంటను సేకరించే కలెక్షన్ సెంటర్లను రైతులకు అనువైన ప్రాంతాలలో అందుబాటులో ఉంచాలని ప్రీ-యునిక్ కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. ఎంతో లాభదాయకమైన ఆయిల్ పామ్ పంట సాగును చేపట్టి రైతులు ఆర్థిక అభ్యున్నతి సాధించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. ముఖ్యంగా మాక్లూర్, డొంకేశ్వర్, బాల్కొండ, ముప్కాల్, మెండోరా, సిరికొండ మండలాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఒక్కో మండలంలో కనీసం 100 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా చూడాలన్నారు. వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు




దిశగా రైతులను ప్రోత్సహించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులను కలుస్తూ, ఈ పంట వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాలన్నారు. పై మండలాలలోని రైతు వేదికలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ, ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, మద్దతు ధర, సుదీర్ఘ కాలం పాటు ఏటేటా సమకూరే రాబడి, అంతర పంటల సాగుకు గల అవకాశాలు తదితర అంశాలను వివరించాలని, ఆదర్శ రైతులు ఈ పంటను సాగు చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చేలా అంకిత భావంతో కృషి చేయాలన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు కోసం సరిపడా మొక్కలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఎంతో లాభదాయకమైనందున ఈ పంట సాగు దిశగా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున తోడ్పాటును అందిస్తోందని, ఈ అవకాశాన్ని జిల్లా రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి, ప్రీ యునిక్ కంపెనీ ఏరియా మేనేజర్ సాయి కిరణ్, ఉద్యానవన, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు

# కుకీ దొంగలించాడంటూ.. ఉద్యోగి తొలగింపు

వాషింగ్టన్,జూలై3: చాక్లెట్ కుకీ దొంగలించాడనే ఆరోపణలపై ప్రముఖ వాహన తయారీ సంస్థ ఫోర్డ్ రూ.1.9 కోట్ల జీతం తీసుకునే ఓ ఉద్యోగిని తొలగించింది. ఈ ఘటన అమెరికాలో వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కెంటకీలోని లూయిస్‌విల్లేలో ఉన్న ఫోర్డ్ ట్రక్ ఫ్యాక్టరీలో.. 60ఏళ్ల కర్ట్ క్రోమ్ 11 ఏళ్లుగా పని చేస్తున్నాడు. ఎంతో విధేయతగా సగటున వారానికి 60 గంటలు పనిచేసేవాడినని.. అయినప్పటికీ తప్పుడు ఆరోపణలతో తనను ఉద్యోగం నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను కంపెనీలో రూ. 1.9 కోట్లు సంపాదిస్తున్నానని.. గతేడాది ఆఫీస్ క్యాంటీన్‌లో సుమారు రూ. 1.14 లక్షలు ఖర్చు చేశానని తెలిపాడు. ఇటీవల కంపెనీలో ఉన్న సమయంలో షుగర్ లెవల్స్ పడిపోతున్నట్లు అనిపించడంతో ఓ చాక్లెట్ కుకీ కుకీని కొనుగోలు చేశానని పేర్కొన్నాడు. కొద్ది రోజుల అనంతరం సూపర్‌వైజర్ తనను పిలిచి ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు చెప్పాడని.. కారణమేంటని అడగ్గా కుకీని దొంగలించినందుకు జాబ్ నుంచి తీసేస్తున్నట్లు పేర్కొన్నాడని వెల్లడించాడు. తాను కుకీని దొంగలించలేదని.. దానిని కొనుగోలు చేసినట్లు తన వద్ద బిల్లు ఉందని చెప్పినప్పటికీబలవంతంగా ఫ్యాక్టరీ ప్రాంగణం నుంచి బయటకు పంపేశారని ఆరోపించాడు. ఆ బిల్లు స్క్రీన్‌షాట్ పంపించిన అనంతరం తాను నిర్దోషిగా తేలడంతో ఉద్యోగానికి తిరిగి రావాలని యూనియన్ ప్రతినిధి పిలిచారని బాధితుడు వెల్లడించాడు.

# సత్తుపల్లిలో 15 వేల మందితో భారీ వనమహోత్సవ ర్యాలీ



సత్తుపల్లి జూలై 03(విజన్ ఆంధ్ర ) పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం పెంపొందించే లక్ష్యంతో ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్తుపల్లి పట్టణంలో శుక్రవారం రాష్ట్రంలోనే తొలిసారిగా సుమారు 15 వేల మందితో భారీ వనమహోత్సవ ర్యాలీ నిర్వహించారు. జేవీఆర్ కళాశాల మైదానంలో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఖమ్మంజిల్లా కలెక్టర్ దివాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జేవీఆర్ కళాశాల నుంచి పాత సెంటర్ వరకు సాగిన ర్యాలీలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన వేలాది మంది విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. జానపద కళాకారుల ప్రదర్శనలు ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ, ఇంత భారీ స్థాయిలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గం సామాజిక చైతన్యంలో ముందంజలో ఉందని ఈ వనమహోత్సవ ర్యాలీ రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో: సబ్ కలెక్టర్,డీఎఫ్‌వో, ఖమ్మంజిల్లా డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# నగర నడిబొడ్డునా ఎండు గంజాయి విక్రయాలు

## ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ బృందం మెరుపు దాడి 200 గ్రాముల గంజాయితోపాటు ఇద్దరి అరెస్ట్

నిజామాబాద్ జూలై03:(విజన్ ఆంధ్ర) నిజామాబాద్ నగర నడిబొడ్డున కొంతకాలంగా సాగుతున్న ఎండు గంజాయి విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు ఉక్కు పాదం మోపారు. పక్కా సమాచారంతో రెండు వేరు వేరు ప్రాంతాలలో మెరుపు దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎన్ఫోర్స్మెంట్ సీఐ వెంకటేశం వెల్లడించారు. ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ సీఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం ఎనిమిది గంటలకు రాత్రి ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ దాడులలో 200 గ్రాముల ఎండు గంజాయి పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎ. వెంకటేష్ తెలిపారు. ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ కమీషనర్ అరుణ్ కుమార్ ఆదేశాల ప్రకారం మంగళవారం రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో ఎన్ఫోర్స్మెంట్ బృందం, ముందస్తు సమాచారం మేరకు నగరంలోని పులాంగ్ చౌరస్తా, బోధన్ బస్టాండ్ ఏరియాలో దాడులు



నిర్వహించి, ఎండుగంజాయి అమ్ముతున్న షేక్ సమీర్,మహ్మద్ రిజ్వాన్ అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్దనుండి రెండు వందల గ్రాముల ఎండు గంజాయి, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో తనతోపాటు ఎస్ఐ రామ్ కుమార్, సిబ్బంది భూమన్న, విఠల్,లక్ష్మీ నర్సయ్య, శివకుమార్, సాయి కుమార్, శ్యామ్ సుందర్, ప్రకాశ్ లు పాల్గొన్నారని వెల్లడించారు.

# నమ్మకాన్ని వమ్ముచేసి లక్షలు కాజేసి

## -స్కానింగ్ సెంటర్ యజమానికి 70 లక్షలకు పైగా టోకరా వేసిన ఉద్యోగులు
## -ముగ్గురిపై వన్ టౌన్ పిఎస్ లో కేసు నమోదు. ఒకరి అరెస్ట్.

నిజామాబాద్, జులై03:(విజన్ ఆంధ్ర)స్కానింగ్ సెంటర్ యజమానికి నమ్మకంగా ఉంటూ లక్షల్లో దోచుకున్న ఉద్యోగి ఉదంతం ఒకటి వెలుగులోకి వచ్చింది. ఆలస్యంగా గుర్తించిన యజమాని వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించడంతో అతని బాగోతం బయటపడింది. లోతుగా విచారణ జరిపిన వన్ టౌన్ పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసి, ఒకరిని అరెస్టు చేయగా మరో ఇద్దరిలో పరారి లో ఉన్నట్లు తెలిసింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కానింగ్ కేంద్రంలో పనిచేసిన ఇద్దరు ఉద్యోగులు గుండారం సత్యనారాయణ, మీనా నకిలీ నగదు రసీదులు తయారు చేసి, సంస్థ యాజమాన్యాన్ని మోసం చేసి రూ.70 లక్షలకు పైగా నగదును కాజేశారనే ఆరోపణలపై ఒకటవ టౌన్ పోలీసులు బాధితుని ఫిర్యాదు మేరకు ముగ్గురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం జరిగిందని వన్ టౌన్ ఎస్ హెచ్ ఓ రఘుపతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రధాన స్కానింగ్ కేంద్రం 2009 సంవత్సరం నుంచి సేవలు అందిస్తోంది.ఈ కేంద్రంలో సూపర్ వైజర్ గా పనిచేస్తున్న గుండారం సత్యనారాయణ,, టి. మీనా లు కలిసి పథకం ప్రకారం సంస్థను మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు.ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, రోగులకు ఇచ్చే అసలు నగదు రసీదుల్లో కార్బన్ పేపరు తొలగించి, అనంతరం అదే బిల్లు నంబర్ పరీక్షల వివరాల మొత్తాలను తక్కువగా చూపిస్తూ నకిలీ రికార్డులు తయారు చేసినట్లు ఫిర్యాదులో వెల్లడించడం జరిగిందన్నారు. రోగులకు అసలు మొత్తంతో కూడిన రసీదు ఇచ్చిన తర్వాత, కార్యాలయ రికార్డుల్లో మాత్రం పరీక్షల



వివరాలు, ఫీజులను మార్చి నమోదు చేయడం ద్వారా రోజువారీ నగదును దుర్వినియోగం చేసినట్లు పేర్కొన్నారు.ఈ విధానం సుమారు ఆరు సంవత్సరాలుగా కొనసాగిందని, ఈ కాలంలో రూ.70 లక్షలకు పైగా సంస్థకు నష్టం వాటిల్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.. అంతేకాకుండా, ఈ అక్రమాల గురించి ఇతర ఉద్యోగులు వెల్లడించకుండా వారిని బెదిరించడం, కొన్ని ఆధారాలను మాయం చేయడానికి ప్రయత్నించినట్లు తెలిపారు.. ఇందుకు సంబంధించి 2025 జనవరి నుంచి జూలై వరకు ఉన్న కొన్ని నగదు రసీదుల ప్రతులను పోలీసులకు సమర్పించినట్లు ఫిర్యాదులో వివరించారన్నారు.ఫిర్యాదు స్వీకరించిన ఒకటవ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. అక్రమంగా యజమానికి టోకరా వేసిన డబ్బులతో గుండారం సత్యనారాయణ తన భార్య పేరిట భారీగా ఆస్తులు కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఇందులో భాగంగా ఆర్థిక లావాదేవీలు, నగదు రసీదులు, సంబంధిత రికార్డులు, ఇతర ఆధారాలను పరిశీలించి గుండారం సత్యనారాయణ తో పాటు మీనా, సత్యనారాయణ భార్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ హెచ్ ఓ రఘుపతి వెల్లడించారు. శుక్రవారం మాణిక్ బండారు గ్రామంలో గుండారం సత్యనారాయణ అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పేర్కొన్నారు. మరో ఇద్దరు మహిళలు పరారి లో ఉన్నారని వారికోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ హెచ్ ఓ రఘుపతి తెలిపారు.

## సంచార లోక్ అదాలత్ వాహనాన్ని ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



వనపర్తి జిల్లా ప్రతినిధి జులై 03 (విజన్ ఆంధ్ర) జిల్లాలోని ప్రజలకు ఉచిత న్యాయ సేవలు, న్యాయ సలహాలు అందించేందుకు సంచార లోక్ అదాలత్ వాహనాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాక రాజు శ్రీనివాస్ రావు శుక్రవారం ప్రారంభించారు. జిల్లా ప్రధాన న్యాయస్థాన ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 3వ తేదీ నుంచి నెలరోజుల పాటు ఈ వాహనం జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలకు సేవలు అందిస్తుందని తెలిపారు. రాజీపడేందుకు సిద్ధంగా ఉన్న కక్షిదారులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే వారి గ్రామాలకే చేరుకొని కేసులను రాజీ చేస్తామని వివరించారు. జిల్లాలోని కక్షిదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చట్టాలపై ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ రూపొందించిన లఘు చిత్రాలను వాహనంపై ఏర్పాటు చేసిన తెరపై ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. కళార్చన, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కే. కవిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి టి. కార్తీక్ రెడ్డి, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి. శ్రీలత, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్. అశ్విని, బార్ సెక్రటరీ వెంకట రమణ పాల్గొన్నారు

# ఆరోపణలు కాదు దమ్ముంటే రాజీనామా చెయ్

### -నీపైన పోటీకి మా పార్టీ కార్యకర్త చాలు గెలుపు ఎవరిదో చూపిస్తాం

### -ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి జిల్లా కాంగ్రెస్ నాయకుల సవాల్

నిజామాబాద్, జులై03:( విజన్ ఆంధ్ర)ఆరోపణలు కాదు దమ్ముంటే రాజీనామా చెయాలని,నీపైన పోటీకి మా పార్టీ కార్యకర్త చాలని గెలుపు ఎవరిదో చూపిస్తామని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి సవాల్ విసిరారు.శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నగేష్ రెడ్డి మాట్లాడుతూ గురువారం ఆర్మూర్ శాసనసభ్యులు రాకేష్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పైన పసలేని ఆరోపణలు చేశాడని ఎద్దేవాచేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్ గా అధికారంలో వచ్చిన తర్వాత రాష్ట్ర అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ ప్రజల పక్షాన ప్రజా సమస్యల పైన నిరంతరం పోరాడుతున్న వ్యక్తులలో ఒకరన్నారు.రాకేష్ రెడ్డి ఉదయం పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కలిసి పనులు



చక్కబెట్టుకోవడం సాయంత్రం ప్రెస్ మీట్ పెట్టి కాంగ్రెస్ పార్టీ గురించి తప్పుడు ప్రచారం చేయడం అలవాటుగా మార్చుకున్నాన్నారు.నేను రాజీనామా చేస్తా పిసిసి అధ్యక్షులు రాజీనామా చేసి ఇద్దరం పోటీ చేద్దామన్నావు నీపైన పోటీకి పిసిసి అధ్యక్షుల వరకు ఎందుకు ఈ జిల్లాలో చాలామంది నాయకులు, కార్యకర్తలు ఉన్నారన్నారు . నీకే అవకాశం ఇస్తున్నామని ఏ నాయకుడి పైన కార్యకర్త పైన గెలుస్తా అనుకుంటావో ఆ పేరు చెబితే అతనితో నిన్ను ఒడగొట్టించే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందన్నారు.ఒకవేళ నీవు పిసిసి ప్రెసిడెంట్ తో పోటీ చేస్తే డిపాజిట్లు కూడా రావన్నారు. నీకు దమ్ము ధైర్యం ఉంటే సవాల్ విసిరేటప్పుడు గుర్తుంచుకోవాలని,రాజీనామా చేయాలనుకుంటే రాజీనామా చెయ్ నీ పైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలవకుంటే మేము రాజకీయ సన్యాసం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్ మాట్లాడుతూ రాజకీయాల్లో సవాలు ఉండాలి కానీ పిసిసిని రాజీనామా చేయమను ముఖ్యమంత్రి రాజీనామా చేయమనడం కాదు మీకు నిజంగా శక్తి ఉంటే ఆర్మూర్ నియోజవర్గ ప్రజలు గెలిపించిన రెండున్నర సంవత్సరాల లో వాళ్లకి అన్ని రకాల సేవలు అందించానని నీకు నమ్మకం ఉంటే వెంటనే రాజీనామా చెయ్ నిన్ను ఓడ గొట్టి చూపించకపోతే మేం కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వాళ్ళమే కాదని ఒప్పుకుంటామన్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి ఏ. బి. చిన్నా మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లర్ పైడి రాకేష్ రెడ్డి ఎలక్షన్స్ ముందు సొంత డబ్బులతో ఇల్లు కట్టిస్తా అని అబద్దాలతో ప్రజల్ని మభ్యపెట్టి గెలిచిన నువ్వు ఈరోజు మా నాయకుడు మహేష్ పై మాట్లాడడం, ముఖ్యమంత్రి రెండు రోజుల్లో దిగిపోతాడనడం నీ రాజకీయ పరిణితి ఏంటో ప్రజలు గమనిస్తున్నారన్నారు.ముఖ్యమంత్రి గురించి ఈ రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమాల గురించి అభివృద్ధి గురించి కేంద్ర ప్రభుత్వంలో ఉన్నటువంటి బిజెపి మంత్రులే పొగుడుతుంటే నీవు పిచ్చోడిలా మాట్లాడుతున్నవన్నారు. ఆర్మూర్ జంబి హనుమాన్ సాక్షిగా రేపు రాజీనామా చేసి చూపాలని సవాల్ విసిరారు.దమ్ముంటే రాజీనామా చేసిరా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను పెట్టి నిన్ను ఓడించకుంటే కాంగ్రెస్ పార్టీకి మేమంతా రాజీనామా చేస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, భక్తవత్సలం, పుప్పాల రవినాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధికి నాంది

### జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్రాజెక్టు పనులకు శ్రీకారం

### రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి చేతుల మీదుగా ప్రారంభం

### రూ.16,350 కోట్ల పెట్టుబడి తో రెండు దశల్లో 20 లక్షల టన్నుల సామర్థ్యంతో నిర్మాణం కానున్న ఉక్కు కర్మాగారం

జమ్మల మడుగు,జేఎస్ డబ్ల్యూ ఇండస్ట్రీయల్ పార్క్, జూలై 3 (విజన్ ఆంధ్ర: ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థ. వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లె వద్ద. రాయలసీమ సమీకృత ఉక్కు కర్మాగారం నిర్మాణ పనులను నాంది పలికింది.శుక్రవారం గౌ.రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు జమ్మల మడుగు మండలం సున్నపు రాళ్ళ పల్లె వద్ద ఈ బృహత్తరమైన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కుపరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ,జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్ జిందాల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ & సీఈఓ జయంత్ ఆచార్య,జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీమతి ఎస్.సవిత,రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టి పాటి రవికుమార్,రాష్ట్ర పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డా. యువరాజ్,జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి,రాష్ట్ర ప్రభుత్వ విప్,జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి,ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.రెండు దశల్లో రూ. 16,350 కోట్ల పెట్టుబడిజేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పూర్తిగా అనుబంధ సంస్థగా ఈ ప్రాజెక్టు అమలవుతోంది. మొత్తం 20 లక్షల టన్నుల (2 మీూూ) వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో కర్మాగారాన్ని రెండు దశల్లో నిర్మించనున్నారు.మొదటి దశలో రూ. 4,500




కోట్ల పెట్టుబడితో సంవత్సరానికి 10 లక్షల టన్నుల సామర్థ్యమున్న సమీకృత ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తారు.రెండో దశలో మరో రూ. 11,850 కోట్ల పెట్టుబడితో సామర్థ్యాన్ని 20 లక్షల టన్నులకు పెంచనున్నారు.దీంతో మొత్తం పెట్టుబడి వ్యయం రూ. 16,350 కోట్లకు చేరనుంది.అత్యాధునిక సాంకేతికతతో పర్యావరణహిత ఉత్పత్తి.ఈ ప్రాజెక్టులో అత్యాధునిక ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్ (జూూఖీ) సాంకేతికతను వినియోగించనున్నారు. పునర్వినియోగ ఉక్కు స్క్రాప్, డైరెక్ట్ రిడ్యూస్డ్ ఐరన్ (ఐ=×)ను ముడి పదార్థాలుగా ఉపయోగించి తక్కువ కార్బన్ ఉద్గారాలతో అత్యుత్తమ నిర్మాణ ఉక్కును తయారు చేయనున్నారు. పునరుత్పాదక విద్యుత్ వినియోగం, ఇంధన పొదుపు సాంకేతికతలు, వనరుల సమర్థ వినియోగం ద్వారా దేశంలోనే అత్యంత సుస్థిర ఉక్కు తయారీ కేంద్రాల్లో ఒకటిగా ఈ కర్మాగారాన్ని తీర్చిదిద్దనున్నారు.రాయలసీమకు పారిశ్రామికంగా భారీ ఊతంఈ ప్రాజెక్టు ద్వారా రహదారి, రైల్వే, విద్యుత్, నీటి వసతులు మరింత అభివృద్ధి చెందనున్నాయి. అనుబంధ పరిశ్రమలు, లాజిస్టిక్స్ రంగం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. రాయలసీమను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది. రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఇది బలమైన పునాదిగా మారనుంది.రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం పై జేఎస్‌డబ్ల్యూ ప్రశంసలు.రాయలసీమ స్టీల్ ప్రాజెక్టు ప్రారంభం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక భవిష్యత్తుపై జేఎస్‌డబ్ల్యూ నమ్మకానికి నిదర్శనమని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్ జిందాల్ ప్రశంసించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో తయారీ రంగం, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడుతోందని కొనియాడారు. ప్రపంచ స్థాయి పారిశ్రామిక సామర్థ్యాల నిర్మాణంలో భాగస్వాములు కావడం తమకు గర్వకారణమని తెలిపారు.దేశ ఉక్కు రంగానికి కొత్త బలంతయారీ, మౌలిక సదుపాయాల విస్తరణలో భారతదేశం కీలక దశలో ఉందని, ఆంధ్రప్రదేశ్ ఈ అభివృద్ధికి కేంద్రబిందువుగా మారుతోందని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ & సీఈఓ జయంత్ ఆచార్య పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు దేశీయ ఉక్కు తయారీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రాయలసీమ ప్రాంత ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.జేఎస్‌డబ్ల్యూ లక్ష్యం · సుస్థిర అభివృద్ధి.2030 నాటికి ఉక్కు తయారీ కేంద్రాల్లో కార్బన్ ఉద్గారాలను 42 శాతం తగ్గించడం, 2050 నాటికి నికర కార్బన్ తటస్థత సాధించడం జేఎస్‌డబ్ల్యూ లక్ష్యంగా పెట్టుకుంది. జీవవైవిధ్య పరిరక్షణ, నీటి వినియోగ నియంత్రణ, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ వంటి పర్యావరణ ప్రమాణాలను ఈ ప్రాజెక్టులో అమలు చేయనుంది.రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో మరో మైలురాయిరాయలసీమ స్టీల్ ప్రాజెక్టు ప్రారంభం కేవలం ఒక కర్మాగార నిర్మాణానికి మాత్రమే కాకుండా, రాయలసీమను జాతీయ పారిశ్రామిక పటంలో మరింత బలంగా నిలబెట్టే కీలక అడుగుగా నిలవనుంది.భారీ పెట్టుబడులు, ఆధునిక సాంకేతికత, పర్యావరణహిత ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు, అనుబంధ పరిశ్రమల అభివృద్ధితో ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక పురోగతిలో ఒక మైలురాయిగా నిలుస్తుందనడంలో.ఈ శంకుస్థాపన ఘట్టం ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది.ఈ కార్యక్రమంలో డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్,జేసీ డా. నిధీమీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, కమలాపురం,మైదుకూరు ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్,నాయకులు పి వి ఎన్ మాధవ్,భూపేష్ రెడ్డి సంబందిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థినులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

### - ఎస్వీఎస్ సంస్థ సహకారంతో వసతుల కల్పన

### - హైదరాబాద్ ఆర్జేడీ ఎం. సోమిరెడ్డి పిలుపు




మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి , జూలై 3(విజన్ ఆంధ్ర):గ్రామీణ మరియు నిరుపేద కుటుంబాలకు చెందిన బాలికల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ) పనిచేస్తున్నాయని హైదరాబాద్ ప్రాంతీయ విద్యాశాఖ సంచాలకులు (ఆర్జేడీ) ఎం. సోమిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యావకాశాలను సద్వినియోగం చేసుకుని, ప్రతి విద్యార్థిని నీట్ (చీజుజు), ఎంసెట్ వంటి ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చాటి డాక్టర్లు, ఇంజనీర్లు, సివిల్ సర్వెంట్లుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.మహబూబ్‌నగర్ పట్టణంలోని అర్బన్ కేజీబీవీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆర్జేడీ సోమిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్జేడీ ప్రత్యేక చొరవతో ఎస్వీఎస్ ఆసుపత్రి సంస్థ తమ సీఎస్ఆర్ నిధుల నుంచి సుమారు రూ. లక్ష విలువైన ఆధునిక పరికరాలను విద్యార్థినుల వసతి కోసం విరాళంగా అందించింది.విద్యార్థినులకు అందిన పరికరాలు:ఈ సందర్భంగా 25 లీటర్ల సామర్థ్యం కలిగిన 3 వేడి నీటి గీజర్లు, 15 కేజీల సామర్థ్యం గల రోటీ మేకింగ్ మిషన్, 16 కేజీల స్టీల్ కుక్కర్ మరియు 20 లీటర్ల సామర్థ్యం కలిగిన 8 కూల్ వాటర్ బాటిళ్లను కేజీబీవీ ప్రత్యేక అధికారి శంకరమ్మకు అందజేశారు.ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు:ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ, ప్రభుత్వం కేజీబీవీల్లో నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం, డిజిటల్ విద్య, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ వంటి సౌకర్యాలను ఉచితంగా కల్పిస్తోందని తెలిపారు. “ఒక బాలిక చదువుకుంటే ఒక కుటుంబమే కాదు, భావితరాల భవిష్యత్తు మారుతుంది“ అని ఆయన ఉద్ఘాటించారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుతూ, ఉపాధ్యాయుల సూచనలను పాటిస్తే జాతీయ స్థాయిలో రాణించగలరని ధీమా వ్యక్తం చేశారు.అభినందనలు:ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చిన ఎస్వీఎస్ సంస్థను ఆర్జేడీ ప్రత్యేకంగా అభినందించారు. ఇతర సంస్థలు కూడా ఇటువంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఐ. విజయ్‌కుమారి మాట్లాడుతూ, విద్యార్థినులు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం అధికారులు విద్యార్థినులతో ముచ్చటించి, వారి విద్యాభ్యాస అనుభవాలను, పోటీ పరీక్షల సన్నద్ధతను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డీఈఓ ఐ. విజయ్‌కుమారి, జీసీడీవో అస్త్రఖాద్రి, కేజీబీవీ ప్రత్యేక అధికారి శంకరమ్మ, ఎస్వీఎస్ సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## బాసర ఆలయ పునర్నిర్మాణ ముహూర్తం ఖరార్



బాసర :జూలై 03:విజన్ ఆంధ్రనిర్మల్ జిల్లా: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి క్షేత్రంలో 5వ తేదీ ఆదివారం నుండి ప్రధాన ఆలయంతో పాటు మహంకాళి ఆలయంలో జరగనున్న పునర్నిర్మాణ పనులపై ఆలయ ఈఓ అంజనాదేవి పత్రిక సమావేశం నిర్వహించారు. పునర్నిర్మాణ దాత సురభనేని సునంద ప్రారంభ దశలో 31 కోట్ల నిధులతో పనులను ప్రారంభించనున్నారు అదనంగా ఏమైనా ఎస్టిమేషన్ పెరిగిన దాత భరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు రేపు ఉదయం 9 గంటల నుండి శృంగేరి పీఠాధిపతుల ఆదేశానుసారం వారి శిష్య బృందం పునర్నిర్మాణ పనుల నేపథ్యంలో అమ్మవారి ఆలయంలో కళాపకర్షణ పూజలు నిర్వహించనున్నారు రేపు యథావిధిగా భక్తులకు అమ్మవారి దర్శనానికి అనుమతిస్తామని ఎల్లుండి అనగా ఆదివారం మధ్యాహ్నం నుండి భక్తులకు అమ్మవారి దర్శనాలను నిలిపివేసి బాలాలయంలో యథావిధిగా పూజలు కొనసాగిస్తామని ఆలయ ఈఓ అంజనాదేవి వెల్లడించారు ప్రధాన ఆలయాలలో జరిగే నిత్య పూజలు ఆర్జిత సేవలు బాలాలయంలో భక్తులకు అందుబాటులో ఉంటాయని ఆలయ ఈఓ తెలిపారు

## స్కూల్ బస్సులో మంటలు,విద్యార్థులు సురక్షితం

పల్నాడు రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామంలో శుక్రవారం ఉదయం స్కూల్ బస్సులో ప్రమాదం తప్పింది. నరసరావుపేటకు చెందిన కే-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ బస్సు కర్లకుంట గ్రామానికి విద్యార్థులను తీసుకురావడానికి వెళ్లి తిరిగి వస్తుండగా, బస్సులోని ఇంజిన్ భాగం నుంచి అకస్మాత్తుగా దట్టమైన పొగతో పాటు మంటలు చెలరేగాయి.అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే బస్సును ఆపి, అందులో ఉన్న విద్యార్థులను సురక్షితంగా కిందికి దించాడు. అనంతరం స్థానికుల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

### కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు..

### పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అధికారులు

### త్వరలోనే కొండగట్టు మాస్టర్ ప్లాన్ అమలు: మహేష్ కుమార్ గౌడ్

మల్యాల, జూలై 03 (విజన్ ఆంధ్ర):జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మహేష్ కుమార్ గౌడ్ దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.ఎఅనంతరం ఆలయ గర్భాలయంలో అర్చకులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి, మహేష్ కుమార్ గౌడ్ కుటుంబానికి ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, టీపీసీసీ అధ్యక్షుడిని శాలువాతో ఘనంగా సత్కరించారు.ఎదర్శనానంతరం మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల ప్రజల ఆరాధ్యదైవమైన కొండగట్టు అంజన్నను తాను ఎన్నోసార్లు దర్శించుకున్నానని గుర్తుచేసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నరేళ్లుగా పేద ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, అద్భుతమైన పాలన అందిస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో సాగుతున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాలు



మరింత విజయవంతంగా ముందుకు సాగాలని, రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఎకొండగట్టు ఆలయ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ అంశాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నిరంతరం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ ప్రశంసించారు. త్వరలోనే ఈ మాస్టర్ ప్లాన్ అమలులోకి రాబోతుందని, దీని ద్వారా ఆలయ రూపురేఖలు మారి అభివృద్ధి పనులు మరింత వేగవంతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఎఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, ప్రముఖ నాయకులు నరేందర్ రెడ్డిలతో పాటు ఆలయ ఈఓ ఎస్. అంజనారెడ్డి, సూపరింటెండెంట్ సునీల్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్ మరియు కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## రసాభాసగా మారిన తెలుగుదేశం నాయకుల సమావేశం

### పోటాపోటీగా వచ్చిన ఇరువర్గాల నాయకులు

### రితీష్ రెడ్డి వర్గీయుల కు సీరియస్ వార్నింగ్ ఇచ్చిన మంత్రి సవిత

### జగన్ కే భయపడలేదు మీరు ఎంత! అన్న మంత్రి సవిత

బద్వేలు, జూలై 3: (విజన్ ఆంధ్ర)బద్వేల్ పట్టణంలోని రాఘవేంద్ర కళ్యాణ్ మండపంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీకి సంబంధించిన నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, భూపేష్ రెడ్డి, బద్వేల్ నియోజకవర్గ పరిశీలకులు తుగ్గలి నాగేంద్ర, పెళ్ళకూరి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. సమావేశమ ఆరంభం కాకముందే కొంతమంది రితీష్ రెడ్డి వర్గీయులు మద్యం సేవించి అల్లర్లకు పాల్పడడంతో మంత్రి సవిత ఆగ్రహించి అల్లర్లకు పాల్పడిన వారిపై తీవ్రంగా వార్నింగ్ ఇచ్చారు, అనంతరం మధ్యలోనే మంత్రి సవిత వెళ్లిపోయారు.సవ్యంగా జరగాల్సిన సమావేశం రసాభాసగా మారడంతో నాయకులకు కార్యకర్తలకు అయోమయంలో పడి నిరుత్సాహంగా తిరిగి వెళ్లిపోయారు. నియోజకవర్గ ఇన్చార్జిని ప్రకటిస్తారని ముందస్తు సమాచారం మేరకు ఇరు వర్గాలకు చెందిన నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో సమావేశానికి హాజరయ్యారు కానీ ఇక్కడ పరిస్థితి ఏమి జరుగుతుందో నాయకులకు కార్యకర్తలకు తెలియక అయోమయ పరిస్థితిలో ఉన్నారు. తిరిగి పరిశీలకులు మండలాల వారీగా నియోజకవర్గంలోని నాయకులను పిలిచి వారి అభిప్రాయాలను రాతపూర్వకంగా సేకరించారు ఈ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు

# రైతు భరోసా దరఖాస్తుకు జూలై 5 చివరి తేదీ

### మహబూబ్‌నగర్ జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు ఖ. గోవింద్ నాయక్ వెల్లడి

మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి జూలై 3 (విజన్ ఆంధ్ర)::రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'రైతు భరోసా' పథకం కోసం దరఖాస్తు చేసుకునే గడువును జూలై 5, 2026 వరకు పొడిగించినట్లు జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు (జీణూ) ఖ. గోవింద్ నాయక్ తెలిపారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ 15, 2026 నాటికి 'భూ భారతి' (ధరణి) పోర్టల్‌లో పట్టాదారు పాస్‌బుక్ కలిగి ఉండి, ఇప్పటివరకు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోని రైతులందరూ నిర్ణీత గడువులోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తు చేసుకోవాల్సిన విధానం:అర్హులైన రైతులు, అటవీ హక్కుల (=శీఖీ=) పట్టాదారులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (ూజూూ) లేదా మండల వ్యవసాయ అధికారి (పీూూ) కార్యాలయాలను సంప్రదించి దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది.దరఖాస్తుకు కావలసిన పత్రాలు:రైతులు దరఖాస్తు చేసుకునేటప్పుడు



ఈ క్రింది పత్రాలను వెంట ఉంచుకోవాలని అధికారులు సూచించారు: పట్టాదారు పాస్‌బుక్ (ఖీఖుఖుతీ ౹ఖుంంఎశీశిఎ)ఆధార్ కార్డు బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ కాపీ నిర్ణీత నమూనాలోని రైతు భరోసా దరఖాస్తు పత్రంప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, ఒక్క అర్హులైన రైతు కూడా ఈ పథకానికి దూరం కాకూడదని జేడీఏ పేర్కొన్నారు. నిర్ణీత గడువు జూలై 5వ తేదీ లోపు తప్పనిసరిగా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన జిల్లాలోని రైతులకు విజ్ఞప్తి చేశారు.

## ఐకార్ హైడ్రాలిక్ లిఫ్ట్ వ్యవస్థను ప్రారంభించిన ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్, జూలై 03 (విజన్ ఆంధ్ర): జిల్లా పోలీసు శాఖలో వాహనాల నిర్వహణను మరింత ఆధునికంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏఆర్ హెడ్క్వార్టర్స్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం వద్ద ఏర్పాటు చేసిన నూతన కార్ హైడ్రాలిక్ లిఫ్ట్ వ్యవస్థను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శాస్త్రోక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగాన్ని పరిశీలించి, వాహనాల మరమ్మతులకు అవసరమైన విడిభాగాలు, మెకానిక్ పనిచేసే గదిని తనిఖీ చేశారు. పోలీసు వాహనాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహిస్తూ, అత్యవసర విధులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. నూతన హైడ్రాలిక్ వ్యవస్థతో వాహనాల మరమ్మతులు వేగవంతంగా, నాణ్యతతో నిర్వహించేందుకు వీలుకలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) పి. మౌనిక ఐపీఎస్, డీఎస్పీ కమటం ఇంద్రవర్ధన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు టి. మురళి, ఎన్. చంద్రశేఖర్ మరియు రిజర్వ్ సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు మాజీ కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్



మల్కాజిగిరి, జూలై 3,(విజన్ ఆంధ్ర):డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నాననిఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్మాజీ కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన, కాలనీ వాసులతో కలిసి ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వ ర నగర్ లో రూ 10 లక్షల అంచనా వ్యయంతో నూత నంగా నిర్మించబోయే ఆర్ సీసీ పైప్ లైన్ పనుల ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...వర్షా కాలం దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై తాను ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కాలనీలలో ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకుని వస్తే వెంటనే పరిష్కరిస్తానని ఆయన, స్థానికులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి,సయ్యద్ అబ్దుల్లా, యాదయ్య, రమణ,శ్రీధర్, రవి,జోగారావు, సుందర్ లాల్,అనీష్, హైమద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబు, సత్య నారాయణ, సంపత్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు

## గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

### –కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి జులై 03 (విజన్ ఆంధ్ర) ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, మెరుగైన వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడి వైద్య సేవలను పరిశీలించారు. గర్భిణీలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి ప్రతి గర్భిణికి తప్పనిసరిగా రక్తహీనత పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. హీమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉన్న గర్భిణులకు అవసరమైన మందులు, పోషకాహార సలహాలు అందించి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ప్రసవ గదిని పరిశీలించి అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ప్రసవాలకు వచ్చే గర్భిణులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని, పరిశుభ్రత పాటిస్తూ నాణ్యమైన వైద్యం అందించాలని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ పరిమళ, ఇతర వైద్య అధికారులు ఉన్నారు.

## టీడీపీ నినాదమా...

శ్రీకాకుళం, జూలై 2,తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన చింతకాయల విజయ్ తాజాగా ఘాటైన వ్యాఖ్యలు చేశారు. నర్సీపట్నంలో తనకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ ని దమ్మున్న నాయకుడిగా కొనియాడారు. లోకేష్ తనది కాని నియోజకవర్గంలో టీడీపీకి అంతగా విజయావకాశాలు లేని సీట్లో గెలిచి చూపించారు అని విజయ్ గుర్తు చేశారు. మంగళగిరిలో ఒకసారి ఓటమి పాలు అయినా పట్టు వీడకుండా లోకేష్ మళ్లీ అదే స్థానం నుంచి గెలిచారు అంటే అదే లోకేష్ సత్తా అని అన్నారు. కానీ విపక్ష నేత జగన్ మాత్రం పులివెందుల దాటి బయటకు వచ్చి ఎక్కడైనా పోటీ చేసే సత్తా ఉందా అని విజయ్ ప్రశ్నించారు. జగన్ పులివెందులకు మాత్రమే పరిమితం అని విజయ్ ఎద్దేవా చేసారు. తెలుగుదేశం పార్టీకి సమర్థుడు అయిన నాయకుడు నారా లోకేష్ అని అన్నారు. ఆయన చేతుల్లోనే టీడీపీకి మంచి భవిష్యత్తు ఉందని విజయ్ అన్నారు. లోకేష్ నాయకత్వాన్ని ప్రతీ కార్యకర్త పూర్తి స్థాయిలో బలపరుస్తున్నారని కూడా విజయ్ చెప్పారు. లోకేష్ తన కుటుంబంగానే పార్టీలోని అందరినీ చూసుకుంటారు అని ఆయన తమ కుటుంబం మీద చూపించే అభిమానం ఆప్యాయతలు ఎంతో గొప్పవని అని విజయ్ చెప్పారు. ఇందుకు గానూ తాను లోకేష్ కి రుణపడి ఉంటాను అని విజయ్ చెప్పారు.టీడీపీ అధినేత చంద్రబాబు గురించి విజయ్ చెబుతూ ఆయనను నమ్ముకుంటే చాలు అందరికీ న్యాయం తప్పకుండా జరుగుతుందని అన్నారు.

## ఫ్రైడే – డ్రైడే ను తప్పనిసరిగా పాటించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, జూలై 03 (విజన్ ఆంధ్ర): వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా ప్రజలందరూ తమ ఇళ్లలో తప్పనిసరిగా ప్రతి శుక్రవారం 'ఫ్రైడే – డ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కెఆర్కె కాలనీలో డెంగ్యూ వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో మున్సిపల్, వైద్య సిబ్బందితో కలిసి ఆయన ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఇళ్లలో నీటిని ఎక్కువగా నిల్వ ఉంచడం వల్ల అందులోనే దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అందుకే అవసరమైన మేరకే నీటిని నిల్వ చేసుకోవాలని, పాత్రలపై తప్పనిసరిగా మూతలు పెట్టాలని సూచించారు. డెంగ్యూ వస్తే ప్లేట్‌లెట్స్ పడిపోయి నెల రోజుల పాటు కోలుకోలేరని, కాబట్టి అనవసరమైన నీటిని నిల్వ ఉంచకుండా వెంటనే పారబోయాలని సూచించారు. కాలనీల్లో శానిటేషన్, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఇద్దరు జిల్లా అధికారులను నియమించామని, అవసరమైతే అదనపు వాహనాలతో శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. అలాగే, కె.ఆర్.కె కాలనీ అభివృద్ధికి, ముఖ్యంగా డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి సుమారు రూ. 6 నుండి 7 కోట్ల నిధులు ఇప్పటికే మంజూరయ్యాయని, త్వరలోనే ఈ పనులను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఇంటింటి సర్వే లో పాల్గొని ఫ్రైడే డ్రైడే పాటించాలని పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.సాధన, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, కౌన్సిలర్ నాక్సేన్, ఆశాలు, కాలనీ ప్రజలు, మున్సిపల్, వైద్య, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన 'అడుగుల భజన'




హైదరాబాద్ జులై 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ. విశ్వనాథ్) : తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజాకళ 99 రోజుల కళా మహోత్సవంలో భాగంగా 93వ రోజు గురువారం రవీంద్రభారతి, పాల్కురికి సోమన్న మూల వేదికపై మరోసారి జానపద కళల వైభవానికి నిలయంగా మారింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల సౌరభాన్ని ప్రతిబింబించే అడుగుల భజన ప్రేక్షకులను విశేషంగా అలరించింది. వికారాబాద్ జిల్లా బాపురం శ్రీకాంత్ బృందం అద్భుతమైన ప్రతిభ మంత్రముగ్ధులను చేసింది. కళాకారులు శ్రీకాంత్, కృష్ణ, మణికంఠ, వినయ్, గణేష్, కిరణ్, సాయికుమార్, రాంచరణ్, శ్రీశైలం, అర్జున్, సందీప్, మహేష్, విష్ణు, సాయిరాం, వినోద్, వినయ్ ఈ అడుగుల భజనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్. ఏనుగు నర్సింహా రెడ్డి, సహాయ సంచాలకుడు పి. నర్సింలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి. విజయ్ కుమార్ కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు. సాంస్కృతిక సలహా మండలి సభ్యులు ముచర్ల దినకర్, పల్లె నర్సింహ్మా కార్యక్రమంలో పాల్గొని కళాకారులను ప్రశంశించారు. ప్రధాన కార్యక్రమానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు "ప్రభాత బేరి" గీతాలతో పాటు జానపద, సామాజిక చైతన్య గీతాలను ఆలపించి సభను ఉత్తేజ పరిచారు. కార్యక్రమానికి విద్యానందాచారి, శ్రీనివాస రాజులు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

## రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత

### దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి జులై 03 (విజన్ ఆంధ్ర)రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, త్వరలోనే ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని అమలు చేయనుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కొత్తకోట మండలం రాయినిపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన కిచెన్ షెడ్‌ను ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రారంభించారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రస్తుతం అధిక డిమాండ్ ఉందని, భవిష్యత్తులో ప్రవేశ పరీక్ష నిర్వహించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు పోషకాహారం అందించి ఆరోగ్యంతో పాటు విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాయినిపేట పాఠశాల అభివృద్ధికి కలెక్టర్ తన నిధుల నుంచి రూ.23.80 లక్షలు మంజూరు చేయడం అభినందనీయమని కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే కృత్రిమ మేధ (ఏఐ) విద్యను ప్రవేశపెట్టే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, రాయినిపేట పాఠశాలలో సమర్థవంతమైన ఉపాధ్యాయ బృందం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, సర్పంచ్ భాగ్యలక్ష్మి, డీఎస్వో శ్రీనివాస్, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నీటిపారుదల ప్రాజెక్టులపనులు వేగవంతం చేయాలి

### –వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 03 (విజన్ ఆంధ్ర)నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సాగునీరు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నీటిపారుదల శాఖ జిల్లా కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని రిజర్వాయర్లు, కాలువలు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, ఆయకట్టు విస్తరణ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా డి–5, డి–8 కాలువల విస్తరణ పనులు పూర్తయితే అనేక గ్రామాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. గొల్లపల్లి రిజర్వాయర్‌కు సంబంధించిన వివరణాత్మక ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని, గోపాల్పేట రిజర్వాయర్ ప్రతిపాదనల పురోగతిని వేగవంతం చేయాలని ఆదేశించారు. బుద్ధారం స్టేజ్–2 ఆన్‌లైన్ రిజర్వాయర్ పనులు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, ఖిల్లా ఘణపురం మండలం గణపసముద్రం రిజర్వాయర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పెద్దమందడి మండలం గట్ల ఖానాపూర్‌లో నిర్మించనున్న రిజర్వాయర్ నివేదికలు సిద్ధం చేయాలన్నారు. రేవల్లి మండలం తలుపునూరు, తలుపునూరు తండాల్లో దాదాపు 2000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని, ఏదుల, అనంతపూర్ గ్రామాల ఆయకట్టు విస్తరణకు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. భీమా కెనాల్ సామర్థ్యాన్ని పెంచాలని, మహబూపాల సముద్రం రిజర్వాయర్ సుందరీకరణ చేపట్టి పర్యాటకాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కర్నే తండా లిఫ్ట్ ఇరిగేషన్‌లో మిగిలిన పనులు పూర్తి చేయాలని, బుద్ధారం రైట్ కెనాల్ ఆయకట్టును స్థిరీకరించాలని అధికారులను ఆదేశించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పెండింగ్‌లో ఉన్న ప్రతి నీటిపారుదల పనిని దశలవారీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సీఈ, డీసీ, ఎస్ఈ, ఈఈ, డీఈ, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల సొంతింటి కల సాకారం

### –ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం తాటిపాముల గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలు శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశాలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు లబ్ధిదారులు రాధా–రాజా గౌడ్మాధవి–బాలచందర్ నాయుడు గజ్జలయ్య లక్ష్మిలకు నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.కొత్త ఇంట్లో కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని మీరూ గారు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు భావోద్వేగానికి లోనై తమ అనుభవాలను పంచుకున్నారు. గత పది సంవత్సరాల పాలనలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పి ఎన్నోసార్లు అధికారుల చుట్టూ, రాజకీయ నాయకుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు అద్దె ఇళ్లలో, పాడుబడిన గుడిసెల్లో ఎన్నో కష్టాలు పడుతూ జీవించామని, సొంతింటి కోసం ఎన్నో సంవత్సరాలు ఎదురుచూశామని తెలిపారు.అయితే నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి మాన్యశ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో, వనపర్తి ఎమ్మెల్యే శ్రీ తూడి మేఘారెడ్డి గారి ప్రత్యేక చొరవతో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరై తమ జీవితాల్లో వెలుగులు నింపాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు ప్రభుత్వం అందించిన రూ.5 లక్షల సహాయంతో తమ కలల ఇంటిని నిర్మించుకొని నేడు గృహప్రవేశం చేసుకోవడం జీవితంలో మరచిపోలేని ఘట్టమని పేర్కొన్నారు."సొంతింటి కల నెరవేరుతుందని ఎప్పుడూ ఊహించలేదు. మా బాధలను అర్థం చేసుకొని ఇల్లు మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, మా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గారికి జీవితాంతం రుణపడి ఉంటాం" అని లబ్ధిదారులు కృతజ్ఞతాభావంతో తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తోందన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు అందేలా కృషి చేస్తామని, గ్రామీణ ప్రాంతాల్లో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.

## హక రైతు సేవా కేంద్రం ను ప్రారంభించిన ఎంపీ డికె.అరుణమ్మ




కె.టి దొడ్డి జులై 03 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా కె.టి దొడ్డి మండలం కొండ పురం గ్రామంలో హక రైతు సేవా కేంద్రం ను మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డికె.అరుణమ్మ ప్రారంభించారు.ముందుగా ఎంపీ డికె.అరుణమ్మ ని శాలువా తో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎంపీ డికె. అరుణమ్మ మాట్లాడుతూరైతులకు అవసరమైన సేవలు ఒకే చోట అందుబాటులో ఉండేందుకు రైతు సేవ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. హక రైతు సేవా కేంద్రాలను వినియోగించుకొని వ్యవసాయ సేవలను పొందాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మేంబర్ బండల వెంకట రాములు,జిల్లా కోశాధికారి మిర్జాపురం రామచంద్ర రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు దరూర్ కిష్టన్న ,మండల అధ్యక్షుడు శ్రీపాద రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు అనిమిరెడ్డి, ఉప సర్పంచ్ బీమ్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు రజక నరసింహ, దేవేందర్ రెడ్డి,రఘు గౌడ్, తిమ్మప్ప, సూర్యకాంతరెడ్డి, మంగ్లీ వీరేశ్,హనుమంతు,రంగ రెడ్డి,కొండా పురం గ్రామ నాయకులు తదితరులు పాల్గోన్నారు.

## ఈవీఎంల గోదాము వద్ద కట్టుదిట్టమైన భద్రత

### –కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 03 (విజన్ ఆంధ్ర) జిల్లా కేంద్రంలో ఈవీఎంలు భద్రపరిచిన గోదాము కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వెనుక ఉన్న ఈవీఎం గోదామును నెలవారీ తనిఖీల్లో భాగంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా గోదాము వద్ద భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నామన్నారు. నెలవారీ తనిఖీల్లో భాగంగానే శుక్రవారం పరిశీలించామని వివరించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్లు రమేష్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు ఉన్నారు.

## కొంకలపల్లి ముంపు బాధితులకు ఊరట

### రూ.2.34 కోట్ల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 03 (విజన్ ఆంధ్ర)ఏదుల రిజర్వాయర్ నిర్మాణంలో ముంపుకు గురైన కొంకలపల్లి గ్రామానికి చెందిన 47 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.34 కోట్ల చెక్కులను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. వనపర్తి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో రిజర్వాయర్ నిర్మాణంతో పొలాలు, ఇళ్లు కోల్పోయి పునరావాస కేంద్రాలకు వెళ్లామని, ఎన్నో ఇబ్బందులు పడినా అప్పటి పాలకులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తమ కష్టాలను గుర్తించి నష్టపరిహారం అందజేయడంతో న్యాయం జరుగుతోందనే నమ్మకం కలిగిందన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ, ముంపు బాధితుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, పొలాలు, ఇళ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందేలా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, గోపాల్పేట మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు సత్య శీలా రెడ్డి, రేవల్లి మండల అధ్యక్షులు సుల్తాన్, సర్పంచ్ బాలనాగయ్య, ఆర్డీవో, ఎంఆర్వో, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ పెంచాలి

## -కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి జులై 03 (విజన్ ఆంధ్ర)ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు, మౌలిక సౌకర్యాల కల్పనపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్యతో కలిసి మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెచ్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్రోల్మెంట్ తగ్గకుండా పెంచేందుకు ప్రతి గ్రామంలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ హాజరును పక్కాగా నమోదు చేయాలని, ఎంఈఓలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్యాస్ కనెక్షన్లు సహా ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, గ్యాస్ కనెక్షన్ ఉండి కట్టెల పొయ్యిపై వండితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూ-డైస్ పోర్టల్లో పూర్తి వివరాలు నమోదు చేసి పాఠశాలల మౌలిక వసతుల సమాచారాన్ని అప్డేట్ చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో బాలబాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, లేని చోట వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులకు గణితం, సైన్స్, ఇంగ్లీష్లో ప్రత్యేక తరగతులు ప్రారంభించాలని, గతేడాది గణితంలో రూపొందించినట్లుగా ఈ ఏడాది సైన్స్, ఇంగ్లీష్లో ప్రత్యేక పుస్తకాలు సిద్ధం చేసి మెరుగైన బోధన అందించాలని సూచించారు. నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భారత్‌లో హై-కెపాసిటీ క్రేన్ల తయారీకి ఏస్-కాటో జాయింట్ వెంచర్




హైదరాబాద్, జులై 03 (విజన్ ఆంధ్ర) : భారత నిర్మాణ పరికరాల తయారీ సంస్థ యాక్షన్ కన్స్ట్రక్షన్ ఎక్విప్మెంట్ లిమిటెడ్(ఏస్), జపాన్‌కు చెందిన కాటో వర్క్స్ కంపెనీ లిమిటెడ్ సంయుక్తంగా 50:50 భాగస్వామ్యంతో ఏస్ కాటో ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో కొత్త జాయింట్ వెంచర్‌ను ప్రకటించినట్లు ఏస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోరబ్ అగర్వాల్ శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ హర్యానాలో 11 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్‌లో ట్రక్ క్రేన్లు, క్రాలర్ క్రేన్లు, రఫ్ టెరైన్ క్రేన్లను తయారు చేయనుండగా, భవిష్యత్‌లో మరిన్ని క్రేన్ మోడళ్లను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. దేశీయ మార్కెట్‌తో పాటు ప్రపంచ మార్కెట్లకు కూడా ఉత్పత్తులను సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయని తెలిపారు. జపనీస్ సాంకేతికతను భారత తయారీ సామర్థ్యాలతో మేళవించి అధిక సామర్థ్యం గల క్రేన్ తయారీకి ప్రపంచ స్థాయి వేదికను రూపొందిస్తున్నామని తెలిపారు. కాటో వర్క్స్ డైరెక్టర్ టోమోయసు కాటో మాట్లాడుతూ ఏస్ యొక్క తయారీ సామర్థ్యాలు, సరఫరాదారుల వ్యవస్థ, మార్కెట్ నెట్‌వర్క్‌తో కలిసి భారతదేశాన్ని కీలక క్రేన్ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

# తిర్యాణి విచ్చేసిన జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్‌కు ఘన సన్మానం

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని వినతి



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 3 (విజన్ ఆంధ్ర)కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా తిర్యాణి మండలానికి విచ్చేసిన అనిల్‌ను ఆసిఫాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు నైతం రామచందర్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో రామచందర్ శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు, నిరుద్యోగ యువతకు గ్రంథాలయాలే జ్ఞాన దేవాలయాలని తిర్యాణి శాఖా గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు, డిజిటల్ లైబ్రరీ, రీడింగ్ రూమ్ సౌకర్యాలు కల్పించాలని5,000 పుస్తకాలతో కొత్త భవనం అవసరం అని చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన చైర్మన్ అనిల్, లైబ్రరీ ఫౌండేషన్ నిధులు, జిల్లా గ్రంథాలయ సెస్ ద్వారా దశలవారీగా అభివృద్ధి చేస్తాంమని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మంగ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బుద్ధ విజయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లం వెంకన్న, మాజీ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బుర్ర రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అంకం గౌరయ్య కూన సురేష్ ముత్య రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోవాలి

## బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్



వనపర్తి జిల్లా ప్రతినిధి జులై 03 (విజన్ ఆంధ్ర)వనపర్తి జిల్లా కేంద్రంలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్ డిమాండ్ చేశారు. శ్రీ చైతన్య, నారాయణ, రాక్‌వుడ్ ఢిల్లీ వరల్డ్ స్కూల్ తదితర కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలలు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారాలు, ఇతర విద్యా సామగ్రిని తమ పాఠశాలల ద్వారానే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నాయని పేర్కొన్నారు. ట్యూషన్ ఫీజులతో పాటు వివిధ పేర్లతో అదనపు ఫీజులు వసూలు చేయడం వల్ల తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందన్నారు. ఈ పరిస్థితులపై జిల్లా విద్యాశాఖ అధికారులు, సంబంధిత యంత్రాంగం నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీ, పుస్తకాల బలవంతపు విక్రయాలు, ఇతర అక్రమ వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని గజరాజుల తిరుమలేష్ డిమాండ్ చేశారు.

# వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిద్దాం

## -వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 03 (విజన్ ఆంధ్ర)వచ్చే ఏడాది మార్చి నెలలో వనపర్తి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలను కనీవినీ ఎరుగని రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయంలో దాదాపు రూ.7 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. బ్రహ్మోత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలుగానే కాకుండా, వనపర్తి పట్టణ ప్రతిష్టను చాటిచెప్పే మహోత్సవాలుగా నిలిచేలా అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో నిర్వహిస్తామన్నారు. భక్తి భావం, సేవా తత్పరత కలిగిన పెద్దలు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, ప్రముఖులు, ఉద్యోగులు, అధికారులు, యువత, మహిళలు సహా ప్రతి ఒక్కరూ ఈ మహోత్సవాల్లో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు హాజరయ్యే అవకాశముందని తెలిపారు. ఇప్పటికే ఆలయ అభివృద్ధి కోసం రూ.6 కోట్లకు పైగా నిధులతో పనులు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. మార్చిలో బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏడు నెలల సమయం ఉన్నందున ప్రతి నెలా సమీక్షా సమావేశం నిర్వహిస్తూ, కార్యక్రమాలను దశలవారీగా అమలు చేస్తామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా "న భూతో న భవిష్యతి" అన్న స్థాయిలో ఈ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. భక్తి, సంప్రదాయం, సంస్కృతి, సామూహిక సేవా భావాలకు ప్రతీకగా నిలిచే ఈ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రఘునాథచార్యులు, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కదిరే రాములు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ మాజీ శాసనసభ్యు కూన శ్రీశైలం గౌడ్



కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ మాజీ శాసనసభ్యు కూన శ్రీశైలం గౌడ్ : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జులై 3 (విజన్ ఆంధ్ర ప్రతినిధి):కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్ ఈరోజు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంలోని మేడిపల్లి, భీమారం మండలాల ముఖ్య నాయకుల సమావేశంతో పాటు సర్ కార్యక్రమంపై అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని వల్లంపల్లి గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్, పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రజల్లో విస్తృత ప్రచారం, కార్యకర్తల సమన్వయం, రానున్న కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణపై నాయకులకు దిశానిర్దేశం చేస్తూ, అవగాహన కల్పించారు. పార్టీ శ్రేణులు గ్రామస్థాయిలో మరింత చురుకుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారితో కలిసి కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం కార్యకర్తలకు అందుబాటులో ఉండే వేదికగా, ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్రబిందువుగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నందన్న గారు, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం



హైదరాబాద్, జూలై 03 (విజన్ ఆంధ్ర) : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గల్ఫ్ కార్మికుడు యెల్ల శ్రీనివాస్ గంగపుత్ర కుటుంబానికి గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం, సహాయనిధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. దుబాయ్ నుంచి ఇటీవల సెలవులపై వచ్చిన శ్రీనివాస్ ప్రమాదంలో మరణించడంతో ఆయన భార్యకు సంఘం ప్రతినిధులు నగదు అందజేసి పరామర్శించారు. గల్ఫ్ దేశాల్లో, స్వదేశంలో ఉన్న కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చినా సంఘం అండగా ఉంటుందని ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయనిధి ఫౌండేషన్ అధ్యక్షుడు తోకల శంకర్, మాజీ అధ్యక్షుడు సముద్రాల తిరుపతి, తెలంగాణ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మూల పవన్, రాష్ట్ర కన్వీనర్ గుమ్ముల అంజయ్య, జగిత్యాల జిల్లా చైర్మన్ కల్లెడ నరసింహరాజు, తోకల పెద్ద నరసయ్య, తోకల లచ్చయ్య, దేశవేని మురళీధర్, పల్లికొండ శ్రీనివాస్, ఆర్మూరి గంగాధర్, కోరుట్ల చంద్రయ్య, ఎల్లా చిన్న నరసయ్య, ఎల్లా దశరథం, సంఘ ఉపాధ్యక్షుడు బింగి రాజు గంగపుత్ర, ప్రధాన కార్యదర్శి పల్లికొండ గంగ నరసన్న గంగపుత్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ సముద్రాల నరేష్, కార్యదర్శి బింగి నరసయ్య, సహాయ కార్యదర్శి కొండూరు శ్రీనివాస్, ఫైనాన్స్ కంట్రోలర్లు మేడి రమేష్, నెన్నల రాజేష్, కోశాధికారి బోరి కిషన్, బింగి పోచన్న, కొండ్ర నారాయణ, బోరే ఇందయ్య, గౌరవ సలహాదారులు పుట్టి రాజు గంగపుత్ర, ఉట్నూరి రాజనర్సయ్య, ఉట్నూరి కమలాకర్, పందిరి రాజన్న, మేడి మహేష్, గుమ్ముల శ్రీనివాస్ తదితరులు సహకరించారు.

# ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా జనరల్ సెక్రెటరీగా మల్లేపల్లి రాజనర్సయ్య



కాగజ్‌నగర్:జులై 3 (విజన్ ఆంధ్ర) కొమరం భీం జిల్లా కాగజ్నగర్ పట్టణంలో ఎస్సీ సంక్షేమ సంఘం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జనరల్ సెక్రటరీగా కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన మల్లెపల్లి రాజనర్సయ్య నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షులు తీగల అశోక్ కుమార్ ఆమోదంతో జిల్లా అధ్యక్షులు డాక్టర్ జాడి దిలీప్ కుమార్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు దాసరి రవికుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. సంస్థ విస్తరణ, బలోపేతం, అలాగే షెడ్యూల్డ్ కులాల సంక్షేమ లక్ష్యాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలనే ఉద్దేశంతో ఈ నియామకం చేపట్టినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మల్లెపల్లి రాజనర్సయ్య మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి సంఘం నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తానని పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. విద్యాభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి చేస్తానని తెలిపారు. దళితుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను చేపడతానన్నారు. సామాజిక న్యాయం సాధనలో సంఘం ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని చెప్పారు. జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలో సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తానని తెలిపారు. ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రతి కార్యకర్తను కలుపుకొని సంఘ అభివృద్ధికి పనిచేస్తానని పేర్కొన్నారు. మల్లెపల్లి రాజనర్సయ్య నియామకాన్ని సంఘం నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో జిల్లా వ్యాప్తంగా సంఘం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన జిల్లా జనరల్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన మల్లెపల్లి రాజనర్సయ్యకు సంఘం నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేసి, దళితుల సంక్షేమానికి విశేష సేవలందించాలని ఆకాంక్షించారు.


# మైనంపల్లి హనుమంతరావు సహకారంతో

## కింది బస్తీలో కొత్తగా మరో మూడు వీధి పాల ఏర్పాటు చేశాం : తుడిమెళ్ల మల్లికార్జున్




మల్కాజిగిరి, జూలై 3,(విజన్ ఆంధ్ర): మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో యాప్రాల్ డివిజన్‌లోని కింది బస్తిలో శుక్రవారం మరో మూడు కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేశామని కాంగ్రెస్ పార్టీమల్కాజిగిరి నియోజకవర్గ సీనియర్ నాయకుడు తుడిమెళ్ల మల్లికార్జున్ అన్నారు. "మిషన్ బ్రైట్ కౌకూర్" కార్యక్రమం ద్వారా ప్రతి వీధిని వెలుగులతో నింపి ప్రజలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. ప్రజల ఇబ్బందులు గుర్తించి వారి అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నా మని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యాప్రాల్ డివిజన్ జనరల్ సెక్రటరీ శివరాజ్, అల్లి మల్లేష్, అల్లి పండు, ఆకుల సతీష్, అల్లి సత్యనారాయ ణ, అల్లి శ్రీకాంత్, వెంకట్, రాజ్‌కు మార్, స్ట్రీట్ లైట్ విభాగానికి చెందిన రాజు, నాని తదితరులు పాల్గొన్నారు.

# టీజీ-20 లీగ్‌లో 'గేమ్ ఛేంజర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డులు అందజేస్తున్న బీబీజీ




హైదరాబాద్, జూలై 03 (విజన్ ఆంధ్ర) : శ్రీనిధి యూనివర్సిటీ టీజీ-20 లీగ్-2026కు అసోసియేట్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న బీబీజీ, ప్రతి మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రభావం చూపిన ఆటగాడికి 'గేమ్ ఛేంజర్ ఆఫ్ ది మ్యాచ్' పురస్కారాన్ని అందజేస్తోందని బీబీజీ చైర్మన్, ఎండీ మల్లికార్జున రెడ్డి శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మ్యాచ్ ఫలితాన్ని మలుపుతిప్పే ఇన్నింగ్స్, కీలక బౌలింగ్ లేదా సమగ్ర ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లను ఈ అవార్డుకు ఎంపిక చేస్తున్నట్లు చెప్పారు. యువ క్రికెటర్లను ప్రోత్సహించి, తెలంగాణ క్రికెట్‌లో ప్రతిభను వెలికితీయడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. అత్యుత్తమ ప్రతిభను గుర్తించి గౌరవించడం సంస్థ లక్ష్యమని, టీజీ20 లీగ్‌తో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు.

# రైలు కిందపడి దంపతులు ఆత్మహత్య



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జులై 3 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): రైలు కిందపడి దంపతులు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఘట్కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది, ఆర్థిక ఇబ్బందులు తాళలేక, కట్టుకున్న భార్యతో కలిసి ఓ భర్త రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది, క్షణికావేశంలో వారు తీసుకున్న ఈ నిర్ణయం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసుల కథనం ప్రకారం,వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్య పేట గ్రామానికి చెందిన రవికుమార్ (32), శిరీష (28) దంపతులు. గత కొంతకాలంగా వీరు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. అప్పుల భారం పెరగడం, వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో జీవితంపై విరక్తి చెందారు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి మేడ్చల్ జిల్లా ఘట్ కేసర్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పైకి చేరుకుని, వేగంగా వస్తున్న రైలు కింద పడి ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాలను పరిశీలిం చారు. మృతుల వద్ద లభించిన ఆధారాల ఆధారంగా వారు వరంగల్ జిల్లాకు చెందిన దంపతులు గా గుర్తించి, సమా చారాన్ని వారి కుటుంబ సభ్యులకు అందించారు. ప్రాథమిక విచారణ లో ఆర్థిక ఇబ్బందు లే ఈ ఘోరానికి ప్రధాన కారణంగా భావిస్తున్నట్లు పోలీ సులు తెలిపారు.

# ట్రాఫిక్ మేనేజ్మెంట్‌లోకి 'మేఘా' గ్రూప్

హైదరాబాద్, జూలై 3, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ , అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజం అనలాగ్ సంస్థతో కలిసి సాంకేతిక రంగంలోకి సంచలన ఎంట్రీ ఇచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం.. ఈ రెండు సంస్థలు కలిపి 50:50 భాగస్వామ్యంతో ఒక సరికొత్త జాయింట్ వెంచర్ ను ఏర్పాటు చేశాయి. భారతదేశంలోనే మొదటిసారిగా 'ఫిజికల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను తీసుకురావడానికి రాబోయే 3 నుండి 5 ఏళ్లలో దాదాపు రూ. 2,500 కోట్ల నుండి రూ. 4,000 కోట్లు భారీ పెట్టుబడి పెట్టనున్నట్లు మేఘా ఎండీ పి. వి. కృష్ణా రెడ్డి అధికారికంగా ప్రకటించారు. హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ రద్దీకి, ముఖ్యంగా భారీ వర్షాల సమయంలో తలెత్తే రోడ్డు దిగ్బంధనాలకు చెక్ పెట్టేందుకు మేఘా–అనలాగ్ సంయుక్త భాగస్వామ్యం ఒక పక్కా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్ట్‌లో మేఘా పాత్ర అత్యంత కీలకం కానుంది. నగరంలోని సుమారుగా అన్ని ప్రధాన ట్రాఫిక్ జంక్షన్లను ఒకే తాటిపైకి తెస్తూ యూనిఫైడ్ ఇంటెలిజెంట్ సిస్టమ్ నెట్‌వర్క్‌ను క్షేత్రస్థాయిలో మేఘా గ్రూప్ నిర్మించనుంది. అనలాగ్ సంస్థ అందించే ఏఐ సాఫ్ట్‌వేర్, హైవ్ ప్లాట్‌ఫామ్ ఆధారంగా.. రోడ్లపై రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ సిగ్నల్ టైమింగ్స్‌ను డైనమిక్‌గా మార్చే అత్యాధునిక హార్డ్‌వేర్, సెన్సార్లు, కెమెరాల గ్రిడ్‌ను హైదరాబాద్ వ్యాప్తంగా మేఘా తన ఇంజనీరింగ్ నైపుణ్యంతో ఇన్స్టాల్ చేయనుందిఈ సరికొత్త ఏఐ సాంకేతికత పనితీరును పరీక్షించడానికి మేఘా–అనలాగ్ ఇప్పటికే హైదరాబాద్ నగరంలో క్షేత్రస్థాయి ట్రయల్స్ ప్రారంభించింది. తెలంగాణ సచివాలయం చుట్టూ ఉన్న 5 కిలోమీటర్ల పరిధిలోని అత్యంత కీలకమైన అంతర్గత మార్గాలలో ఒక పైలట్ ప్రాజెక్ట్‌ను మేఘా గ్రూప్ రన్ చేస్తోంది. ఈ పరిధిలో ఏఐ అడాప్టివ్ ట్రాఫిక్ సిగ్నల్స్ ఎలా స్పందిస్తున్నాయి? వర్షాలు పడినప్పుడు నీటి నిల్వలను సెన్సార్లు ఎంత త్వరగా గుర్తిస్తున్నాయి? అనే అంశాలపై డేటాను సేకరిస్తున్నారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం కావడంతో, దీనిని పూర్తిస్థాయిలో గ్రేటర్ హైదరాబాద్ పరిధి అంతటా విస్తరించడానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీని ద్వారా అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజన్ల కోసం ఆటోమేటిక్ 'గ్రీన్ కారిడార్' రూట్ క్లియరెన్స్ సిస్టమ్‌ను కూడా మేఘా అందుబాటులోకి తేనుంది. ఈ భారీ భాగస్వామ్యం కేవలం హైదరాబాద్ రోడ్లపై ట్రాఫిక్ సిగ్నల్స్ మార్చడానికే పరిమితం కావడం లేదు. తాము దేశవ్యాప్తంగా నిర్మిస్తున్న పవర్ గ్రిడ్స్, భారీ ఇరిగేషన్ ప్రాజెక్టుల మెయింటెనెన్స్, వాటర్ సప్లై సిస్టమ్స్‌లో కూడా ఈ ఫిజికల్ ఇంటెలిజెన్స్ ను వాడుతామని మేఘా సంస్థ వెల్లడించింది. నగరాల్లో భూగర్భ తాగునీటి పైప్‌లైన్లలో జరిగే లీకేజీలను ముందే గుర్తించడం, విద్యుత్ లోడ్‌ను బట్టి పంపిణీని ఆప్టిమైజ్ చేయడం, అలాగే తాము తయారు చేస్తున్న ఓలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను కూడా ఈ ఏఐ నెట్‌వర్క్‌తో అనుసంధానించనున్నారు.

# మావిగన్ అయితే విశాఖ సంగతేంటీ

విశాఖపట్టణం జూలై 3, విశాఖ మన రాజధాని అని వైసీపీ అధినేత జగన్ గతంలో చెప్పారు. తాను 2024లో మరోసారి గెలిస్తే విశాఖ నుంచే ప్రమాణం చేస్తాను అని కూడా చెప్పారు. విశాఖలో అన్నీ ఉన్నాయి అది సహజసిద్ధమైన రాజధాని అని వైసీపీ నేతలు పలు మార్లు చెప్పుకొచ్చారు. అయితే 2024 ఎన్నికల్లో చేదు ఫలితాలు దక్కిన తరువాత కానీ వైసీపీ నేతలకు తత్వం బోధపడలేదని అంటున్నారు. అందుకే కొన్నాళ్ళ పాటు సైలెంట్ గా ఉండి ఇపుడు దాదాపుగా టీడీపీ రూట్లోనే వెళ్తున్నారు అని అంటున్నారు. టీడీపీ కూడా అమరావతి రాజధాని అన్నది. విజయవాడ గుంటూరులకు దూరంగా కొత్త నగరం నిర్మించే పనిలో టీడీపీ ఉంది. అయితే వైసీపీ మాత్రం రెడీ మేడ్ గా మావిగన్ అని అంటోంది. అంటే విశాఖకు బదులుగా మావిగన్ తెచ్చినా రెడీ మేడ్ సిటీ విషయంలో మాత్రం వైసీపీ పక్కకు జరగలేదు అన్నది స్పష్టం అవుతోంది. ఇక విశాఖ రాజధాని అన్నారు. బీచ్ రోడ్డులో రుషికొండ మీద టూరిజం రిసార్ట్స్ ని తొలగించి అక్కడ సీఎం క్యాంప్ ఆఫీసు అని నివాసం అని దాని పేరుతో భారీ భవనాలు కట్టారు. నాలుగు వందల కోట్ల రూపాయలు దాని కోసం ఖర్చు చేశారు. విశాఖలో సముద్రం ఉంది, రైల్ రోడ్డు ఎయిర్ కనెక్టివిటీ ఉందని కూడా చెప్పారు. ఉత్తరాంధ్రా వెనకబాటుతనం అంతా పోయేలా విశాఖ క్యాపిటల్ ద్వారా అభివృద్ధి సాగుతుందని కూడా ప్రకటించారు. కానీ ఇపుడు విశాఖను వెనక్కి తీసుకున్నారు. ఆశ పెట్టి తగ్గిపోయారు అని అంటున్నారు. మరి దీని మీద ఉత్తరాంధ్రా వైసీపీ నేతల రియాక్షన్ ఎలా ఉంటుంది అన్నది కూడా చర్చకు వస్తోంది. ఇక విశాఖ రాజధాని అన్నపుడు మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు వంటి వారు గట్టిగా సమర్ధించారు. మా ప్రాంతం బాగు పడవద్దా అని కూడా ప్రశ్నించారు. మాకు రాజధాని వస్తూంటే టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు అని కూడా విమర్శించారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అలాగే బొత్స సత్యనారాయణ వంటి వారు కూడా విశాఖ రాజధానికి జై కొట్టారు. మరి ఇపుడు వైసీపీ అయితే మావిగన్ అని తన రూట్ మార్చి ప్లేట్ తిప్పేసింది. దాంతో ఈ మాజీ మంత్రులు ఇంకా వైసీపీలోని కీలక నేతలు సీనియర్ నేతలు ఏమంటారు అని ప్రశ్నలు వస్తున్నాయి. అలాగే విశాఖ రాజధాని అని వైసీపీ నేతలు ఎంత గట్టిగా చెప్పినా మరెంత ఆర్భాటం చేసినా జనాల మద్దతు అయితే ఏ కోశానా లేదని తేలిపోయింది. విశాఖ రాజధాని అన్న తరువాతనే 2023లో ఉత్తరాంధ్రా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగితే ప్రజలు యువత ఉద్యోగులు విద్యావంతులు అంతా కలసి టీడీపీకే ఓటేశారు. ఆ తరువాత 2024లో విశాఖ జిల్లా మొత్తం ఒక్క సీటూ వైసీపీకి లేకుండా చేశారు. ఇంతే కాదు గత అయిదేళ్లలో వైసీపీ విశాఖ రాజధాని అని ఎంతగా చెప్పినా జనాల నుంచి పాజిటివ్ రియాక్షన్ అయితే పెద్దగా రాలేదని గుర్తు చేస్తున్నారు. అందుకే వైసీపీ కూడా తన నిర్ణయం మార్చేసుకుంది అని అంటున్నారు. అయితే చెప్పుకోవడానికి ఈ రీజన్ బాగుంది కానె విశాఖ సహా ఉత్తరాంధ్రా అభివృద్ధి మీద వైసీపీ చిత్తశుద్ధి ఇంతేనా అన్న చర్చ కూడా మరో వైపు సాగుతోంది. మరి వైసీపీ ఏ విధంగా దీని మీద జనాలకు చెప్పుకుంటుందో చూడాల్సి ఉంది.

# సొంత రాష్ట్రంలోనే పట్టు కోల్పయిన సంతోష్

బెంగళూరు, జూలై 3, భారతీయ జనతా పార్టీ లో అత్యంత శక్తివంతమైన జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి నుండి బీఎల్ సంతోష్ ను తప్పించి, తిరిగి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కు పంపాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్ణయించారని ప్రచారం జరుగుతోంది. సుదీర్ఘ కాలంగా పార్టీ అంతర్గత చక్రం తిప్పిన సంతోష్, ఇటీవల కాలంలో మోదీ–షాల నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారనే టాక్ బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా కీలక ఎన్నికల్లో ఆయన అనుసరించిన ఏకపక్ష వ్యూహాలు పార్టీకి భారీ నష్టాన్ని చేకూర్చడమే కాకుండా, శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీయడం వల్లే ఈ నిర్ణయమని అంటున్నారు. బీఎల్ సంతోష్‌పై మోదీ–షాలకు నమ్మకం సడలడానికి ప్రధాన కారణం ఆయన సొంత రాష్ట్రమైన కర్ణాటక. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో బలమైన మాస్ లీడర్, లింగాయత్ దిగ్గజం బీఎస్ యడియూరప్ప ప్రభావాన్ని తగ్గించేందుకు సంతోష్ గట్టిగా ప్రయత్నించడం. టికెట్ల కేటాయింపులో యడియూరప్ప వర్గాన్ని పక్కనబెట్టి, కేవలం సిద్ధాంతాల ప్రాతిపదికన కొత్తవారికి సీట్లు ఇవ్వాలనే సంతోష్ పట్టుదల కారణంగా పార్టీ అక్కడ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. క్షేత్రస్థాయి రియాలిటీని కాదని, కేవలం తన ఇగో కోసమే సంతోష్ తీసుకున్న నిర్ణయాలు దక్షిణ భారతదేశంలో బీజేపీ ఏకైక కోటను కూల్చేశాయని, దీనిని మోదీ–షాలు ఇప్పటికీ క్షమించలేకపోతున్నారని అంటున్నారు. బీఎల్ సంతోష్ సంస్థాగత కార్యదర్శిగా ఉన్నప్పటికీ, మాతృ సంస్థ అయిన ఆరెస్సెస్‌కు, బీజేపీ అధినాయకత్వానికి మధ్య సరైన సఖ్యత ఏర్పాటు చేయలేకపోయారన్న విమర్శలు కూడా ఉన్నాయి. జాతీయ స్థాయిలో ఆరెస్సెస్ గ్రౌండ్ క్యాడర్‌తో సమన్వయం చేసుకోవడంలో ఆయన విఫలమయ్యారని, పైగా పార్టీలో తన పట్టును నిలుపుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని నివేదికలు చెబుతున్నాయి. దీనివల్ల గత సార్వత్రిక ఎన్నికల్లో చాలా చోట్ల ఆరెస్సెస్ కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయలేదు, ఫలితంగా బీజేపీ సొంతంగా మ్యాజిక్ ఫిగర్ సాధించలేక కూటమిపై ఆధారపడాల్సి వచ్చింది. ఈ తీవ్రమైన సమన్వయ లోపం నేరుగా ప్రధాని మోదీ గ్రాఫ్‌పైనే ప్రభావం చూపడంతో, ఆరెస్సెస్ అగ్రనాయకత్వం కూడా సంతోష్‌ను మార్చడమే శ్రేయస్కరమని ఢిల్లీ పెద్దలకు సూచించినట్లు టాక్. బీఎల్ సంతోష్ వర్కింగ్ స్టైల్ చాలా కఠినంగా, రాష్ట్ర స్థాయి నాయకులను అణచివేసేలా ఉంటుందనే ఫిర్యాదులు మోదీ, అమిత్ షాల వద్దకు వెల్లువలా చేరాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జ్‌ల నియామకాల్లో కానీ, స్థానిక వ్యూహాల అమలులో కానీ ఆయన స్థానిక నేతలకు కనీస ప్రాధాన్యత ఇవ్వలేదనే వాదన ఉంది. అధికారం కేంద్రీకృతం కావడం వల్ల కొత్త నాయకత్వం ఎదగకుండా పోతోందని అధిష్ఠానం గుర్తించింది. ప్రధాని మోదీ 3.0 హయాంలో పార్టీని మరింత ఆధునికంగా, అందరినీ కలుపుపోయేలా తీర్చిదిద్దే క్రమంలో.. వివాదాలకు కేంద్రబిందువుగా మారిన బీఎల్ సంతోష్ శకానికి స్వస్తి పలకడమే ఉత్తమమని మోదీ–షాల ద్వయం భావించి, ఆయనను సున్నితంగా సంఘ్‌కు పంపేందుకు రోడ్ మ్యాప్ సిద్ధం చేసిందని అంటున్నారు.

# పీక్స్ కు చేరిన వార్

హైదరాబాద్, జూలై 3,తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య వార్ పీక్స్ కు చేరుకుంటుంది. ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తున్న విపక్షాన్ని కట్టడి చేసేందుకు అధికార పక్షం చర్చకు సవాల్ విసురుతుంది. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు వీధి పోరాటాలకు దిగుతున్నట్లున్నాయి. దీంతో తెలంగాణలో రణరంగాన్ని తలపిస్తుంది. పోలీసులకు తలనొప్పిగా మారుతోంది. ఇరుపార్టీల నేతలు, కార్యకర్తలు రోడ్లపైకి వస్తుండటంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా ఒకరిపై ఒకరు ఛాలెంజ్ లు విసురుకుంటుండటంతో పాటు చర్చకు సిద్ధమంటూ బయటకు వస్తుండటంతో పోలీసులు విపక్ష నేతలను అరెస్ట్ చేయాల్సి వస్తుంది. తెలంగాణలో మంత్రులు వర్సెస్ మాజీ మంత్రుల మధ్య మాటల యుద్ధం మొదలయింది. గురుకులాల టెండర్లలో అవినీతి ఆరోపణలపై సవాళ్లు, ప్రతిసవాళ్లు ఒకరినొకరు విసరుకున్నారు. ఉదయం గన్‌పార్క్‌కు మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, అజరుద్దీన్ లు చేరుకున్నారు. తాము గురుకులాల టెండర్లలో అవినీతి ఆరోపణలపై చర్చించేందుకు సిద్ధమని ప్రకటించారు. కేటీఆర్, హరీశ్ రావు చర్చకు రావాలని మంత్రులు పిలుపు నిచ్చారు. అయితే తెలంగాణ భవన్ వద్ద మాజీ మంత్రి హరీశ్ రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గన్ పార్క్ వద్దకు చర్చించడానికి బయలుదేరిన హరీశ్ రావును పోలీసులు అడ్డుకున్నారు. చివరకు హరీశ్ రావును అదుపులోకి తీసుకున్నారు. హరీశ్ రావుతో పాటు బీఆర్ఎస్ నేతలను కూడా అరెస్ట్ చేశారు.. అయితే దీనిపై బీజేపీ నేతలు వ్యంగాస్త్రాలు విసిరారు. ఇద్దరూ నాటకాలను కట్టిపెట్టండంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇద్దరూ కావాలని సమస్యలను పక్కదోవపట్టించేందుకు ఈ రకమైన డ్రామాలకు తెరతీస్తున్నారని బీజేపీ నేతలు అంటున్నారు. ఇద్దరూ కలసి చర్చించాల్సి వస్తే తామే వేదికను ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు. మరొకవైపు అసెంబ్లీ వేదికగా చర్చించాల్సిన సమస్యలను వీధుల్లో చర్చించడమేంటన్న ప్రశ్న ప్రజల నుంచి ఎదురవుతుంది. శాసనసభ సమావేశాల్లో ఇరు పార్టీల నేతలు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవచ్చని, కానీ దానికి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించడం సబబు కాదని హితవు పలుకుతున్నారు. మొత్తం మీద ఎన్నికలకు రెండున్నరేళ్ల ముందే కాంగ్రెస్, బీఆర్ఎస్ ల మధ్య యుద్ధం వీధుల్లో మొదలయింది.

# ఇంకా రాజధాని లొల్లే

విజయవాడ, జూలై 3, రాజకీయాల్లో ఎపుడూ దూకుడు అవసరమే. అదే సమయంలో ప్రజలను దృష్టిలో పెట్టుకుని ప్రతీ అడుగూ పడాలి. ఇక చెప్పాలీ అంటే విపక్షంలో ఉన్న వారికి బోలెడు అడ్వాంటేజెస్ ఉంటాయి. వారు ఏమైనా చెప్పవచ్చు. తాము అధికారంలోకి వస్తే కొండ మీద కోతిని అయినా తీసుకుని వస్తామని అనవచ్చు. అయితే ఇలాంటి వాటికి హద్దులు లేకపోయినా కొన్ని కీలక పాలసీల విషయంలో మాత్రం పరిమితంగానే చేయాల్సి ఉంటుంది. అలాగే కొన్ని సెంటిమెంట్ల విషయంలో ఆచీ తూచీ ముందుకు సాగాల్సి ఉంటుంది. అంటే సంక్షేమ పథకాల విషయంలో కానీ కొన్ని నూతన నిర్ణయాల విషయంలో కానీ జనాలను తమ వైపునకు తిప్పుకునేందుకు విపక్షానికి అధికార పక్షానికి లేని వెసులుబాటు ఉంటుంది కానీ అదే సమయంలో విధానపరమైన నిర్ణయాల విషయంలో మాత్రం అంతగా అవకాశం ఉండదు అని అంటున్నారు. ఎప్పటి రాజధాని చర్చ, రాజకీయ రచ్చగా అదెప్పటికి తీరెను అన్నది జనంలో ఉన్న వేదన. అయితే వైసీపీ మాత్రం అమరావతి విషయంలో ప్రతీ ఎన్నికలోనూ తన విధానాలను మార్చేసుకుని ముందుకు పోతోంది. 2014 ఎన్నికల్లో జగన్ బ్రహ్మాండమైన రాజధాని అని హామీతో జనం ముందుకు వచ్చారు. బహుశా వైసీపీకి ఆనాడు ఆలోచనలు ఒంగోలు జిల్లా సమీప ప్రాంతంలో కోస్తాకు గ్రేటర్ రాయలసీమ జిల్లాలకు మధ్య రాజధాని నిర్మాణం చేద్దామని అయి ఉండొచ్చు. దొనకొండ వద్ద రాజధాని అని కూడా అప్పట్లో వైసీపీ చాయిస్ గా వినిపించింది. కానీ తొలి చాన్స్ మాత్రం టీడీపీకి దక్కింది. దాంతో అమరావతి పేరుతో టీడీపీ ప్రభుత్వం తన ప్రతిపాదనలను ఆచరణలో పెట్టేందుకు వీలు కలిగింది. ఇక దాని మీద విపక్ష నేతగా అసెంబ్లీలో జగన్ అమరావతికి మద్దతు ప్రకటించారు. అయితే పూర్తిగా ప్రభుత్వ భూములలోనే అన్న కండిషన్ తమ మద్దతులో అని తరువాత చెప్పారు వైసీపీ నేతలుఇక 2019 కి వచ్చేసరికి అమరావతి రాజధానిగా గుర్తిస్తున్నట్లుగా వైసీపీ నేతలు ప్రకటించారు. జగన్ ఏకంగా అక్కడ ఇల్లు కట్టుకున్నారని వారంతా గట్టిగానే చెప్పారు. దాంతో టీడీపీ హయంలో మందగమనంలో సాగుతున్న రాజధాని జగన్ హయాంలో పుంజుకుంటుంది అని భావించే ఆయనకు మద్దతుగా రాజధాని ప్రాంతంతో సహా అంతా ఓటెత్తారు అని విశ్లేషణ ఉంది. అందుకే 151 సీట్లు దక్కాయని కూడా చెబుతారు. ఇక 2019 నుంచి 2024 మధ్యలో అయిదేళ్ల కాలమంతా మూడు రాజధానుల నినాదంతో గడిపారు. ఇక 2024 ఎన్నికల వేళ వైసీపీ మూడు రాజధానులకు జనాలు వ్యతిరేకమని స్పష్టం అయింది అన్నట్లుగా తీర్పు వెలువరించింది. దాంతో మూడు రాజధానులు అనడం వైసీపీ తగ్గించింది. కానీ దానికి ఆల్టర్నేషన్ ని చూసుకోవడానికి వైసీపీకి రెండేళ్ళ కాలం పట్టింది. 2026 ఏప్రిల్ 1న జగన్ ప్రెస్ మీట్ పెట్టి మావిగన్ పేరుతో ఒక సంచలన ప్రకటన చేశారు. దాంతో ఇది పెద్ద చర్చగా మారింది. ఇక 2029 ఎన్నికలకు జగన్ మావిగన్ రాజధానిగా తాము జనంలోకి వెళ్తామని అంటున్నారు. పైగా ఎన్నికల మేనిఫెస్టోలో దానిని పెడతామని ఆయన అంటున్నారు. అమరావతికి వ్యతిరేకం కాదంటూనే కొత్త ఆల్టర్నేషన్ ని తీసుకుని వచ్చారు. దాంతో వైసీపీ రాజధాని స్టాండ్ ఏంటి అన్న ప్రశ్నకు క్లియర్ గా జవాబు వచ్చినట్లు అయింది. అది కూడా ఎన్నికలకు మూడేళ్ళ సమయం ఉండగానే. ఒక విధంగా వైసీపీ ఈ విషయంలో రిస్క్ చేస్తోందా అన్న చర్చ కూడా సాగుతోంది. ఎందుకంటే ముందే చెప్పుకున్నట్లుగా రాజధాని అన్నది ఒక సెంటిమెంట్. ఇక 2024 లో కూటమి అధికారంలోకి వచ్చాక అమరావతి కేంద్రంగా నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. అక్కడ అవినీతి అక్రమాలు జరిగాయి అంటే వాటి మీద వైసీపీ పోరాడవచ్చు, అంతే కాదు ఏపీలో కొత్తగా తాము ఇతర నగరాలను అభివృద్ధి చేస్తామని కూడా వైసీపీ చెప్పుకోవచ్చు. కానీ రాజధాని అంటూ మావిగన్ ని తీసుకుని రావడం మాత్రం సాహసంతో కూడిన అంశంగానే చూస్తున్నారు. ఇది టీడీపీతో వైసీపీ రాజకీయ సమరం అనే దాని కంటే ప్రజల రాజధాని సెంటిమెంట్ మీదనే వైసీపీ కొత్త చాన్స్ తీసుకుంటున్నట్లుగా విశ్లేషిస్తున్నారు. బహుశా వైసీపీకి ఇంతకంటే ఆల్టర్నేషన్ లేదని అనుకోవాలా అన్నది కూడా ఉంది. మరి దీని మీద టీడీపీ మాత్రమే కాదు న్యూట్రల్ జనాలు ఏ విధంగా రియాక్ట్ అవుతారు అన్న దాని మీదనే వైసీపీ మావిగన్ ఇష్యూ ఆధారపడి ఉంటుంది.

# టీచర్లకు బ్రేక్ ఫాస్ట్ లంచ్

హైదరాబాద్, జూలై 3తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో పనిచేసే ఉపాధ్యాయులు, సిబ్బందికి కూడా బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటివరకు విద్యార్థులకు మాత్రమే ఈ టిఫిన్స్, లంచ్ ఉచితంగా అందిస్తుండగా.. ఇక నుంచి టీచర్లు, లెక్చరర్లకు కూడా అందించనున్నారు. సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయానికి తాజాగా మంత్రివర్గం కూడా ఆమోద ముద్ర వేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు.. ఆకలితో అలమటించకుండా ఉండేందుకు గత ప్రభుత్వాలు.. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కూడా తీసుకువచ్చింది. అంతేకాకుండా ఇంటర్ విద్యార్థులకు కూడా ఈ బ్రేక్‌ఫాస్ట్, మిడ్ డే మీల్స్ పథకాలను ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేస్తోంది. దీంతో ప్రభుత్వ పాఠశాలలతోపాటు కాలేజీల్లో చదివే విద్యార్థులకు రెండు పూటలా పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా రేవంత్ రెడ్డి సర్కార్ మరో కీలక నిర్ణయానికి తెరతీసింది. ఇక నుంచి విద్యార్థులకు మాత్రమే కాకుండా స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో పిల్లలకు చదువు చెప్పే ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి కూడా ఈ మధ్యాహ్న భోజన పథకంతోపాటు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న తెలంగాణ తొలి ఈ–కేబినెట్ భేటీలో విద్యా రంగానికి సంబంధించి ఈ చారిత్రాత్మక నిర్ణయానికి శ్రీకారం చుట్టారు. ఈ నిర్ణయంతో ఇప్పటినుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు.. జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బంది అందరికీ ఫ్రీగా ఉదయం అల్పాహారం.. మధ్యాహ్న భోజనం అందించనున్నారు. ఇప్పటివరకు గవర్నమెంట్ స్కూళ్లలో కేవలం విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజన పథకం.. కొన్నిచోట్ల సీఎం అల్పాహార పథకం అమలు అవుతుండగా.. దాన్ని ఉపాధ్యాయులకు కూడా విస్తరించనున్నారు. తెలంగాణ కేబినెట్ తీసుకున్న తాజా నిర్ణయంతో విద్యాసంస్థల్లో టీచర్లు, లెక్చరర్లు మరికొంత ఎక్కువ సమయం గడపడానికి.. విద్యార్థులకు మరింత అందుబాటులో ఉండేందుకు వీలు కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు, విద్యా రంగ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణలో రీవెంజ్ పాలిట్రిక్స్

హైదరాబాద్, జూలై 3,తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న పరిపాలనాపరమైన బదిలీల నిర్ణయాలపైనా రాజకీయం చేస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సతీమణి, సీనియర్ ప్రభుత్వ అధికారిణి లక్ష్మీబాయిని ప్రభుత్వం వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ పోస్టు నుండి సహకార శాఖ పరిధిలోని హౌసింగ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీ నేరుగా ముఖ్యమంత్రి చేయించారని? కనీసం వాహన సౌకర్యం కూడా లేకుండా చేయాలనే కుట్రతోనే అప్రాధాన్య పోస్టుకు పంపారంటూ విమర్శలు ప్రారంభఇంచారు. ఇప్పటికే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యక్తిగత సిబ్బందితో పాటు కారు సౌకర్యాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవడంపై ఆయన హైకోర్టును ఆశ్రయించి పాక్షిక ఉపశమనం పొందారు. అక్కడ రిలీఫ్ దక్కడంతో తట్టుకోలేకే, ప్రభుత్వం తనపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా భార్యను టార్గెట్ చేసిందని, రేవంత్ రెడ్డి హిట్లర్‌లా వ్యవహరిస్తూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆర్ఎస్పీ అంటున్నారు. అయితే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భార్య అయినంత మాత్రాన ఆమెకు ఎప్పుడూ లూప్‌లైన్ కాకుండా కేవలం ప్రాధాన్యత కలిగిన పోస్టులనే కేటాయించాలా అనే ప్రశ్న ఇతరుల నుంచి వస్తోంది. ఒక ప్రభుత్వ అధికారిగా నియమితులైనప్పుడు ఏ శాఖలోనైనా, ఏ బాధ్యతలనైనా నిర్వహించాల్సి ఉంటుంది. ఆమె భర్త బీఆర్ఎస్‌లో ఉన్నారని చెప్పి, గతంలో అనుభవించిన అన్ని లగ్జరీలు, వాహన సౌకర్యాలు ఎప్పటికీ అలాగే ఉండాలని కోరుకోవడం.. బదిలీ చేస్తేనే భయపడి వేధించినట్లు కలరింగ్ ఇవ్వడం విడ్డూరంగా ఉందనే కామెంట్లు వస్తున్నాయి. లక్ష్మీబాయిని ఉద్యోగం నుంచి తొలగించలేదు కదా, కేవలం ఒక విభాగం నుండి మరో విభాగానికి బదిలీ చేసిన దానికి ప్రభుత్వం భయపడిపోయింది అంటూ సింపతీ నరేటివ్ బిల్డ్ చేయడం హాస్యాస్పదంగా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విధమైన మైండ్ గేమ్స్ , కక్షసాధింపు కార్డ్ ప్లే చేయడం ద్వారా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా ఏం సాధిస్తారో కానీ.. పరిపాలనలో బదిలీలు అనేవి ప్రభుత్వాల విచక్షణాధికారాలనే ప్రాథమిక నిజాన్ని వారు ముందుగా తెలుసుకోవాలని పెదవి విరుస్తున్నారు. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ బదిలీలు చేస్తోందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. కానీ.. తాము అన్నింటికీ తెగించిన తర్వాతే రాజకీయాల్లోకి అడుగు పెట్టామని ఆయన తేల్చి చెప్పారు. రాజకీయంగా తమను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే మొదట తన సెక్యూరిటీని తగ్గించారని.. ఇప్పుడు తన భార్యను ట్రాన్స్‌ఫర్ చేశారని విమర్శించారు. తనకు భద్రతను తగ్గించడంపై తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా.. అక్కడ తనకు పాక్షికంగా ఉపశమనం లభించిందని గుర్తు చేశారు. హైకోర్టులో తనకు రిలీఫ్ రావడంతో దాన్ని జీర్ణించుకోలేక.. రేవంత్ రెడ్డి సర్కార్.. తన సతీమణిని అన్యాయంగా టార్గెట్ చేసుకున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. తన భార్యకు అసలే సంబంధం లేని వేరే డిపార్ట్‌మెంట్‌కు ఆమెను ట్రాన్స్‌ఫర్ చేశారని మండిపడ్డారు. బెదిరింపులు, కక్షసాధింపు చర్యలకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదని.. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడి నిత్యం పోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. విపక్షంలో ఉన్నప్పుడు ప్రతీ చిన్న అడ్మినిస్ట్రేటివ్ ఆర్డర్‌ను కూడా రాజకీయ కోణంలోనే చూస్తూ, హిట్లర్ పాలన అంటూ పెద్ద పెద్ద పదాలతో బురదజల్లడం చూస్తుంటే.. ప్రభుత్వ పనితీరుపై అవగాహన లేమితో పాటు కేవలం పొలిటికల్ మైలేజ్ కోసమే ఈ రకమైన రచ్చ చేస్తున్నారని కాంగ్రెస్ వర్గాలంటున్నాయి.

# సెంటిమెంట్ నమ్ముకుంటున్న పార్టీలు

హైదరాబాద్, జూలై 3,తెలంగాణ సమాజం ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాలం నాటి ఉద్వేగాలను దాటి పుష్కరం దాటిపోయింది. గ్లోబల్ సిటీగా మారిన హైదరాబాద్ అభివృద్ధిని అందుకోవడం, నిరుద్యోగ నివారణ, ఉపాధి అవకాశాల సృష్టి, ఆర్థిక స్వావలంబన వంటివి నేటి తరం ఓటర్ల అసలు సిసలైన ప్రాధాన్యతలు. కానీ, దురదృష్టవశాత్తూ రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు మాత్రం నేటికీ పాత చింతకాయ పచ్చడి లాంటి 'తెలంగాణ సెంటిమెంట్' అస్త్రాన్నే నమ్ముకుని రాజకీయం చేయాలని చూడటం ఒక విచిత్రమైన అజెండా సంక్షోభాన్ని కళ్ళకు కడుతోంది. క్షేత్రస్థాయిలో ప్రజలను ఆకట్టుకునే బలమైన సామాజిక, ఆర్థిక అజెండాలు లేదా భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించడంలో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే పార్టీలు మళ్లీ ప్రాంతీయ విభేదాలను రాజేస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ పార్టీల సెంటిమెంట్ పిచ్చి ఏ స్థాయికి చేరిందో చెప్పడానికి నటుడు ప్రియదర్శి కథానాయకుడిగా వస్తున్న 'ఇడుపు కాయితం' సినిమా వివాదమే ఒక తాజా ఉదాహరణ. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్ర టైటిల్‌పై సోషల్ మీడియాలో ఎవరో ఇద్దరు నెటిజన్లు "దీనికి ఆంధ్రాలో తెలుగు డబ్బింగ్ అవసరమా?" అంటూ అజ్ఞానంతో, వ్యంగ్యంగా కామెంట్లు చేశారు. నిజానికి తెలంగాణ యాసలో 'ఇడుపు కాయితం' అంటే విడాకుల దరఖాస్తు లేదా భార్యాభర్తలు విడిపోయేటప్పుడు రాసుకునే అంగీకార పత్రం అని అర్థం. కొందరు నెటిజన్ల వెకిలి చేష్టలను, అజ్ఞానపు ట్రోల్స్‌ను పట్టుకుని.. ఇక్కడి రాజకీయ పార్టీలు, మేధావుల బృందాలు దానిని ఏకంగా తెలంగాణ అస్థిత్వంపై, యాసపై ఆంధ్రా వాళ్ళు చేస్తున్న దాడిగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం హాస్యాస్పదం. ఒక సినిమా టైటిల్ లేదా యూట్యూబర్ వ్యాఖ్యల చుట్టూ ఇంత పెద్ద పొలిటికల్ డ్రామా నడపడం కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని సగటు ఓటరు సులభంగానే గ్రహిస్తున్నాడు. ఉద్యమ సమయంలో 'ఆంధ్రా పాలకులు ? వలసవాదం' అనే నినాదం ప్రజలను విపరీతంగా కదిలించింది. ఎందుకంటే నాడు అధికారం, నిధులు, నియామకాలు అన్నీ ఇతరుల చేతుల్లో ఉండేవి. కానీ రాష్ట్రం ఏర్పడి పుష్కరం ముగిసిన ఈ తరుణంలో ఇక్కడి సీఎం, మంత్రులు, అధికార యంత్రాంగం అంతా స్వచ్ఛమైన తెలంగాణ బిడ్డలే. తెలంగాణలో జరుగుతున్న తప్పులకు లేదా పాలనా వైఫల్యాలకు ఇక్కడి పాలకులదే పూర్తి బాధ్యత తప్ప.. ప్రతి చిన్న విషయానికి ఆంధ్రా ప్రాంతాన్ని లాగడం ఏ రకంగానూ సమర్థనీయం కాదు. ఒకప్పుడు ఇక్కడ చక్రం తిప్పిన తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ వంటి పార్టీలు ఇప్పుడు కనీసం ఉనికిలో లేవు.

# దుర్గగుడిలో అర్చకులకు అడుగడుగునా అవమానం

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఏఈవో తీరుపై అర్చకస్వాములు, వేద పండితులు తీవ్ర ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి కారణం లేకుండా ఏఈవో చంద్ర శేఖర్ తమను అసభ్యకరంగా దూషించి బెదిరిస్తున్నాడని వారు ఆరోపిస్తున్నారు. తీరు మార్చుకోకపోతే దేవస్థానంలో విధులు బహిష్కరిస్తామని అర్చకులు, వేదపండితులు హెచ్చరించారు... ఈ మేరకు ఏఈవోపై ఈవో క్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దేవస్థానంలో పొన్నపల్లి సత్యనారాయణమూర్తి అర్చక విభాగంలో కేర్‌టేకర్‌గా, వివిధ ఉత్సవాలలో, వేద పాఠశాలలో పనిచేస్తున్నారు. ఆలయ వైదిక కమిటీ, ఈవో ఆదేశాల మేరకు ఇటీవల ఆయన్ను పోరంకిలోని వేద పాఠశాల నుంచి ఆలయంలో కుంకుమార్చన, పల్లకీసేవ, దర్బార్‌సేవలకు బదిలీచేశారు. జూన్ 30న సత్యనారాయణమూర్తి ఆలయంలో విధుల్లో ఉండగా ఏఈవో చంద్రశేఖర్ అతడి వద్దకు వెళ్లి ఇక్కడున్నావేంటి.. ఆర్డర్ ఉందా.. ఎవరిచ్చారు? అంటూ ప్రశ్నించడంతో సత్యనారాయణమూర్తి దేవస్థానం వైదిక కమిటీ, ఈవో ఇచ్చిన ఆర్డర్‌ను ఏఈవోకు చూపించాడు.

# ప్రభుత్వ మెడికల్ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా బాధ్యతలుస్వీకరించిన డాక్టర్ లకావత్ వెంకట్.



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి,జులై 3 (విజన్ ఆంధ్ర) : కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల నూతన ప్రిన్సిపల్ గా డాక్టర్ లకావత్ వెంకట్ (శీతీప్తశీ) బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల అవుట్సోర్సింగ్ సిబ్బంది నూతన ప్రిన్సిపల్ కు పుష్ప గుచ్చం అందజేసి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ సిబ్బంది ల్యాబ్ క్నేషియన్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఆఫీస్ సంబార్డినెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## 'బయో ఇన్ఫ్యూజన్స్'ను ప్రారంభించిన వాటిక




హైదరాబాద్, జూలై 03 (విజన్ ఆంధ్ర) : డాబర్ ఇండియా హెయిర్ కేర్ బ్రాండ్ వాటికా, భారతదేశపు తొలి 'ఉప్పు కలపని' షాంపూ శ్రేణి 'బయో ఇన్ఫ్యూజన్స్'ను ప్రారంభించిందని డాబర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ ప్రొడక్ట్ మేనేజర్ గుర్దాతర్ సింగ్ రియాత్ శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాబర్ ఇండియా లిమిటెడ్ కేటగరీ హెడ్-షాంపూస్, పోస్ట్ వాష్ అవతేజ్ సాప్నీ తోకలసి అయన మాట్లాడుతూ ఈ శ్రేణిలో టస్కన్ రోజ్ మేరీ, జిన్సెంగ్, స్పానిష్ ఆలివ్స్, మొరాకన్ ఆర్గాన్ వంటి సహజ పదార్థాలతో పాటు ప్లాంట్ బయోటిన్ కాంప్లెక్స్, కొల్లాజెన్, హైలురోనిక్ యాసిడ్ వంటి ఆధునిక క్రియాశీల పదార్థాలను ఉపయోగించారని తెలిపారు. ప్రకృతి, విజ్ఞానం, పారదర్శకతను సమన్వయం చేసిన ఈ ప్రారంభం వాటికా వృద్ధి ప్రయాణంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. ఈ ప్రచారంలో నటి అయేషా ఖాన్, పరుల్ గులాటి, ఇషా మాల్వీయాతో పాటు 300 మందికిపైగా ఇన్ఫ్లుయెన్సర్లు పాల్గొన్నట్లు చెప్పారు.

## వినియోగదారుల మన్ననలు పొందాలి..



సూర్యాపేట టౌన్, జూలై 03:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట పట్టణంలోని మమత రెస్టారెంట్ పక్కన ఇమ్మడి సందీప్ ఈజీ డిజిటల్స్ రంగు సాయిల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ బాలాజీ మెమెంటోస్ గిఫ్ట్ ఆర్టికల్స్ దుకాణాన్ని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి , మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత,రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ లు ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా వారు నిర్వాహకులు ఇమ్మడి సందీప్, రంగు సాయికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రప్రథమంగా డిజిటల్ గిఫ్ట్ షాప్ ఏర్పాటు చేసినందుకు శుభాకాంక్షలు తెలియజేస్తు వ్యాపారంలో నిరంతర అభివృద్ధి సాధించి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం దుకాణాన్ని పరిశీలించి, నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, జిల్లా కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, కౌన్సిలర్ లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, నాయకులు వీరన్న నాయక్, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, అబ్దుల్ రహీం, పారుక్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు, నాయకులు కలకోట లక్ష్మయ్య, రాచకొండ శ్రీనివాస్, బిక్కుమల్ల కృష్ణ, కక్కిరేణి ప్రసాద్, దోగుపర్తి ప్రవీణ్, కందిబండ ఉమామహేశ్వరరావు, సోమ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ లో అడ్మిషన్లు కొరకు కృషి చేయాలి

- 10వ తరగతిలో 900 ఇంటర్మీడియట్లో 600 అడ్మిషన్లు పొందేటట్లు కృషి చేయాలి - అడిషనల్ కలెక్టర్ ఎల్ విజయలక్ష్మి.



భూపాలపల్లి జిల్లా 03 జులై (విజన్ ఆంధ్ర) : తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం హైదరాబాద్ (ఓపెన్ స్కూల్ సొసైటీ) ద్వారా 10వ తరగతి మరియు ఇంటర్మీడియట్ లలో ప్రవేశముల కొరకు వయోజన విద్య మరియు డిఆర్డిఏ, స్వయం సహాయక బృందం, టాస్ అధ్యయన కేంద్రాల అధికారులతో సమీక్ష సమావేశాన్ని అడిషనల్ కలెక్టర్ ఎల్ విజయలక్ష్మి నిర్వహించారు. 10వ తరగతిలో 900 ఇంటర్మీడియట్లో 600 అడ్మిషన్లు పొందేటట్లు కృషి చేయాలి అన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిరక్షరాశులను అక్షరాస్యులుగా మార్చే క్రమంలో డిఆర్డిఏ మరియు స్వయం సహాయక బృందాలు నిరక్షరాస్యలను గుర్తించి సెప్టెంబర్ లో జరగబోయే జాతీయ సార్వత్రిక విద్యాసంస్థ నిర్వహించే పరీక్షకు సన్నద్ధులు చేయవలసిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యం. రాజేందర్ మరియు ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి సామల రమేష్ , వయోజన విద్య ఉపసంచాలకులు వేణుగోపాల్, డి ఆర్ డి ఏ అధికారి బాలకృష్ణ,స్వయం సహాయక బృందాల అధికారి రాజేశ్వరి, ఓపెన్ స్కూల్ సొసైటీ అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లు, పరీక్షల సహాయకులు కుసుమ కృష్ణమోహన్, చల్ల కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు కురవాలని పేటలో భజన చేస్తున్న రైతులు



నారాయణపేట, జూలై 3 (విజన్ ఆంధ్ర) : వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న చినుకు వాన రాకపోవడంతో నారాయణపేట భక్త మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలను శుక్రవారం ప్రారంభించారు. స్థానిక గొడుగు గేరి అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించి భజన కార్యక్రమాలను ప్రారంభించారు. అక్కడ నుండి పాదయాత్రగా బయలుదేరి సింగర్ బేస్ తదితర ఆలయాలలో పూజా కార్యక్రమాలను నిర్వహించి పట్టణంలోని వివిధ ఆలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రైతులు పంట పొలాలను చదును చేసుకుని విత్తనాలు వేయడంతో చినుకు వాన కోసం ఎదురుచూస్తున్నారు. వారి బాధలు తీరాలని భక్త భజన మండలి ఆధ్వర్యంలో ఆలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్త భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాల పనులు గడువులోగా పూర్తి చేయాలి..

- పూర్తయిన పనులకు రాజకీయ ప్రమేయం లేకుండా వెంటనే బిల్లులు చెల్లించాలి
- కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను పూర్తి స్థాయిలో వినియోగించాలి
- డార్క్ స్పాట్స్ తొలగింపునకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల...
- పనులు ప్రారంభం చేయని కేంద్ర ప్రభుత్వ ఆర్&బి శాఖ
- అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా ప్రజల మన్ననలు పొందే విధంగా పనిచేయాలి
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఎవరి కోసం వేచి ఉండి వాయిదా వేయొద్దు
- జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో ఎంపీ ధర్మపురి అరవింద్




జగిత్యాల, జూలై-3 (విజన్ ఆంధ్ర జిల్లా బ్యూరో): అమృత్ 2.0, స్వచ్ఛ భారత్ మిషన్, , 15వ ఆర్థిక సంఘం, జాతీయ ఆరోగ్య మిషన్, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, పీఎం శ్రీ, పీఎం కుసుమ్, జాతీయ రహదారులు తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల కింద చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జగిత్యాల సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, అదనపు ఎస్పీ చేతన్ నితిన్, అదనపు కలెక్టర్ రాజ గౌడ్ లతో కలిసి నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో వివిధ శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు పురోగతిని సంబంధిత శాఖ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా లిఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ,లి అమృత్ 2.0 కింద చేపట్టిన తాగునీటి సరఫరా పనులను క్షేత్ర స్థాయిలో మరింత వేగవంతం చేయాలని సూచించారు. గత దిశా సమావేశంలో పెండింగ్ పనులు జూన్-2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ పనులు ఆశించిన స్థాయిలో పూర్తికాలేదన్నారు. ఇకపై ప్రతి సమావేశంలో ప్రాజెక్టు వారీగా భౌతిక, ఆర్థిక పురోగతి, వ్యయ వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను ఇకపై మరింత కాలం పొడిగించేందుకు అవకాశం ఉండదన్నారు. పనులు చేపడుతున్న ఏజెన్సీలతో అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఏజెన్సీలకు వెంటనే నోటీసులు జారీ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వచ్ఛ భారత్ మిషన్, యూ.ఐ.డీ.ఎఫ్.15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిచిపోకూడదన్నారు. కాంట్రాక్టర్లపై అధికారులు సమర్థవంతమైన పర్యవేక్షణ కొనసాగించాలని, గడువులోగా పనులు పూర్తి కాకపోతే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు ప్రయోజనం చేకూరేలా చూడాలని సూచించారు. సకాలంలో పనులు పూర్తి చేయకపోతే కేంద్ర నిధులు కోల్పోయే ప్రమాదం ఉందని, తద్వారా జిల్లా అభివృద్ధి దెబ్బతింటుందని అన్నారు. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. పనులు పూర్తయినప్పటికీ రాజకీయ కారణాలతో బిల్లులు పెండింగ్‌లో ఉంచుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొంటూ, పూర్తయిన పనులకు రాజకీయ ప్రమేయం లేకుండా వెంటనే బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు. అనవసర ఒత్తిళ్లు తీసుకువచ్చే వారిని చట్టబద్ధమైన విధానాల గురించి స్పష్టంగా అవగాహన కల్పించాలని, ప్రతి నిర్ణయంలో ప్రజా ప్రయోజనమే ప్రధానంగా ఉండాలని అన్నారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఏ ప్రజాప్రతినిధి లేదా వ్యక్తి కోసం ఎదురుచూస్తూ వాయిదా వేయరాదని స్పష్టం చేశారు. అన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రభుత్వ ప్రోటోకాల్‌ను కచ్చితంగా పాటిస్తూ, ప్రజలకు ఉపయోగపడే పనులను సకాలంలో ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో 14 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు హెచ్.పీ.వీ. టీకాల కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని అన్నారు. 10 వేల మంది బాలికలకు టీకాలు వేయాలనే లక్ష్యం ఉండగా ఇప్పటివరకు 3,300 మందికి మాత్రమే టీకాలు అందినట్లు పేర్కొంటూ ప్రత్యేక కార్యాచరణతో లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. మంజూరైన అన్ని ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని సూచించారు. ఆర్మూర్‌జగిత్యాలనిజామాబాద్ నాలుగు లేన్ల జాతీయ రహదారికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, కాంట్రాక్టర్ ఎంపిక ప్రక్రియ తుది దశలో ఉందన్నారు. మరో రెండు నెలల్లో పనులు ప్రారంభమయ్యే అవకాశమున్నందున అప్పటిలోగా పెండింగ్‌లో ఉన్న సుమారు 1,200 ఎకరాల భూసేకరణ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల భూసేకరణ పరిహార చెల్లింపులను త్వరితగతిన పూర్తి చేసి, సేకరించిన భూమిని వెంటనే సంబంధిత శాఖకు అప్పగించాలని సూచించారు. జాతీయ రహదారుల పై ప్రమాదకర ప్రాంతాల (డార్క్ స్పాట్స్) తొలగింపునకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదని, కేంద్ర ప్రభుత్వ ఆర్ అండ్ బి శాఖ పనితీరు పేలవంగా, అసంతృప్తిగా ఉందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి రోడ్లు-భవనాల శాఖ అధికారులు చురుకుగా సమన్వయం చేసి వెంటనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జగిత్యాలలో కేంద్ర విద్యాలయం ఏర్పాటుకు తప్పనిసరిగా 10 ఎకరాల భూమిని కేటాయించాలని సూచించారు. అంతకంటే తక్కువ విస్తీర్ణంలో కే.వి. స్కూల్ నిర్వహించడం ఇబ్బంది గా ఉంటుందని తెలిపారు. పీఎం కుసుమ్, పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకాలపై విస్తృత అవగాహన కల్పించి ఎక్కువ మంది లబ్ధిదారులు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ,లి అమృత్ 2.0 పథకం కింద జగిత్యాలలో రూ.38.60 కోట్లు, కోరుట్లలో రూ.41.50 కోట్లు, మెట్‌పల్లిలో రూ.19.40 కోట్లు, రాయకల్‌లో రూ.15.20 కోట్లు, ధర్మపురిలో రూ.23 కోట్ల వ్యయంతో తాగునీటి సరఫరా పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9 ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, సుమారు 165 కిలోమీటర్ల పైప్‌లైన్, గృహ నీటి కనెక్షన్ల పనులు పురోగతిలో ఉన్నాయని, ప్రభుత్వం గడువును డిసెంబర్-2026 వరకు పొడిగించిందని, అప్పటిలోగా అన్ని పనులు పూర్తి చేస్తామని తెలిపారు. అమృత్ 2.0 కింద పట్టణ స్థానిక సంస్థల్లో రూ.18.80 కోట్ల వ్యయంతో ఆరు చెరువుల పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు, వాటిని జూన్-2027 నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద జగిత్యాలలో రూ.20 లక్షలతో ఆస్పిరేషనల్ టాయిలెట్ బ్లాక్, కోరుట్లలో రూ.2.17 కోట్లతో టాయిలెట్ బ్లాక్, యంత్రాల కొనుగోలు, మెట్‌పల్లిలో రూ.3.30 కోట్లతో వివిధ పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నట్లు వివరించారు. యూ.ఐ.డీ.ఎఫ్. కింద జగిత్యాలకు రూ.6.25 కోట్లు, కోరుట్లకు రూ.18.70 కోట్లు, మెట్‌పల్లికి రూ.18.70 కోట్లు, రాయకల్‌కు రూ.91.30 లక్షలు, ధర్మపురికి రూ.72.40 లక్షల విలువైన అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలు పూర్తయ్యాయని, మరో మూడు చివరి దశలో ఉండి ఆగస్టు-2026 నాటికి పూర్తవుతాయని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో మంజూరైన 16 ఉపకేంద్రాల్లో 11 పూర్తయ్యాయని, ఐదు పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ఎన్.హెచ్.ఎం. కింద మంజూరైన 103 ఉపకేంద్రాల్లో 10 పూర్తికాగా, 33 నిర్మాణ దశలో ఉండగా, మరో 60 పనులు ప్రారంభం కావాల్సి ఉందన్నారు. జగిత్యాలకరీంనగర్ మధ్య 58 కిలోమీటర్ల నాలుగు లేన్ల జాతీయ రహదారి-563 పనులు రూ.2,400 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నట్లు తెలిపారు. భూసేకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రూ.38.65 కోట్లతో 12 రోడ్డు పనులు, రూ.20.70 కోట్లతో ఐదు వంతెనల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పీఎం శ్రీ పథకం కింద 31 పనులు చేపట్టగా, 16 పూర్తయ్యాయని, 97 శాతం నిధులు వినియోగించామని వివరించారు. పీఎం కుసుమ్ పథకం కింద 22 మంది రైతులతో 24 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏలు) పూర్తయ్యాయని, ఈ పథకం ద్వారా రైతులు 25 సంవత్సరాల పాటు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. అదనపు ఎస్పీ చేతన్ నితిన్ మాట్లాడుతూ,లి మాదక ద్రవ్యాల నియంత్రణకు జిల్లా పోలీసు శాఖ అత్యంత కఠిన చర్యలు చేపడుతోందని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రత్యేక నిఘా, దాడులు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని వివరించారు. ఈ సమావేశంలో దిశ కమిటీ సభ్యులు ఏ.భిక్యా నాయక్ , పాత రమేష్, వడ్డేపల్లి శ్రీనివాస్, ఎర్ర లక్ష్మీ, డీఆర్‌డీఓ రఘువరన్, జిల్లా పరిషత్ సీఈఓ గౌతమ్ రెడ్డి, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అర్హులు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలి

- ఎస్ఐఆర్ విజయవంతానికి సమష్టి కృషి చేయాలి
- డిప్యూటీ కమిషనర్ ఏ.శైలజ
- బిఎల్ ఓలు,బిఎల్‌ఏలకు బోడుప్పల్ డిప్యూటీ కమిషనర్ దిశానిర్దేశం



బోడుప్పల్,జూలై 03(విజన్ ఆంధ్ర): ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితానే పునాది అని, ఒక్క అర్హులైన ఓటరు కూడా జాబితాకు దూరం కాకుండా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)2027 కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఏ శైలజ అధికారులను ఆదేశించారు. కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో బూత్ లెవల్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏ)తో నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ప్రతి ఇంటిని సందర్శించి సంబంధిత ఓటర్లను గుర్తించాలని, ప్రతి ఓటరికి ధృవీకరణ ఫారాన్ని అందజేసి, వారు పూర్తి చేసిన ఫారాలను తప్పనిసరిగా తిరిగి సేకరించాలని సూచించారు. ఫారాలు సమర్పించని ఓటర్ల పేర్లు ముసాయిదా ఓటర్ల జాబితాలో ప్రతిబింబించకపోయే అవకాశం ఉన్నందున ఈ ప్రక్రియను అత్యంత బాధ్యతతో నిర్వహించాలని తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఎవరైనా ఓటరు ధృవీకరణ ఫారం అందుకోకపోయినా, కార్యక్రమానికి సంబంధించి సందేహాలు, సమస్యలు ఎదురైనా బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. హెల్ప్ డెస్క్‌కు సంబంధించిన వివరాల కోసం వార్డు అధికారి పి. రాజేష్ ను 9059688915 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

## వరంగల్ మెత్రాసన నూతన పీఠ కాపరికి ఎమ్మెల్యే నాయిని శుభాకాంక్షలు



హనుమకొండ, జిల్లా ప్రతినిధి జూలై 3 ( విజన్ ఆంధ్ర ): వరంగల్ మెత్రాసన నియమిత పీఠ కాపరి దుర్గంపుడి విజయపాల్ పీఠాధిపత్య అభిషేక మహోత్సవానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి వర్ధన్నపేట శాసన సభ్యులు కేఆర్ నాగరాజు , డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన పీఠ కాపరి దుర్గంపుడి విజయపాల్ ను శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన పీఠాధిపత్యంలో వరంగల్ మెత్రాసనం ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి, సమాజానికి శాంతి, సామరస్యం, మానవతా విలువలను చాటిచెప్పేలా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, క్రైస్తవ మత విశ్వాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

# శివాజీ విగ్రహ నిర్మాణానికి భారీ విరాళం

- రూ. 1 లక్ష అందజేసిన ఆదిత్యపారశ్రీ గురువులు



నారాయణపేట, జూలై 3 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట పట్టణంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ నిర్మాణం, స్మృతివన అభివృద్ధి పనులకు భారీ మద్దతు లభించింది. బుధవారం ఉట్కూరు మండల పరిధిలోని బిజ్వార్ గ్రామానికి చెందిన అంబాత్ర్యా క్షేత్ర వ్యవస్థాపకులు పరమపూజ్య శ్రీ ఆదిత్యపారశ్రీ గురువులు విగ్రహ ఏర్పాటు కోసం రూ. 1 లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పరమపూజ్య గురువులను యోజనా సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీపాద మాట్లాడుతూ ప్రాజెక్టు పురోగతిని, విగ్రహ ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశ్యాలను గురువులకు వివరించారు. ఈ సందర్భంగా పరమపూజ్య గురువులు మాట్లాడుతూ సంస్కృతిని, చరిత్ర స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు నారాయణపేటలో స్మృతివనం నిర్మించడం అభినందనీయం. దేశానికే ఆదర్శంగా నిలిచే ఈ మహత్తర యజ్ఞానికి నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు తొలి విడతగా రూ. 1,00,000 ఆర్థిక సహాయాన్ని అందించినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యోజనా సంఘం గౌరవాధ్యక్షులు కురుమన్న, అధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి శ్రీపాద, ఉపాధ్యక్షులు వెంకటేష్ గౌడ్, పల్లా రఘు, మహాదేవ్, నవీన్, గోపీకృష్ణ, జిత్తూ పటేల్, అప్పి, బాలరాజు, కేంద్ర ప్రభుత్వ న్యాయవాది, బీజేపీ సీనియర్ నాయకులు రఘువీర్ యాదవ్, మహిళా కమిటీ అధ్యక్షురాలు సాయి తదితరులు పాల్గొన్నారు.

## స్టేట్ సెకండ్ మార్క్ సాధించిన మరో జయ స్కూల్ విద్యార్థిని దేవిప్రియ..




సూర్యాపేట జూలై 03:(విజన్ ఆంధ్ర) : ఎస్ఎస్సి 2026 పరీక్ష ఫలితాలలో జయ స్కూల్ మరో విద్యార్థిని దేవిప్రియ రివాల్యుయేషన్ నందు స్టేట్ సెకండ్ మార్క్ 596 మార్కులు సాధించిందని పాఠశాల కరస్పాండెంట్ జయవేణుగోపాల్ తెలిపారు. దేవిప్రియ గతంలో 594 మార్కులు పొందగా రివాల్యుయేషన్ నందు 2 మార్కులు కలవగా మొత్తం 596 మార్కులు సాధించడం జరిగింది. దేవిప్రియతో పాటు జయ స్కూల్ విద్యార్థిని డి. రిత్విక 596 మార్కులు సాధించడం జరిగింది జయ స్కూల్ నుండి ఇద్దరు విద్యార్థులు స్టేట్ సెకండ్ మార్క్ 596 సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జయ స్కూల్ నందు జరిగే పటిష్ఠమైన ప్రణాళిక ప్రోగ్రామ్ ద్వారా ఈ అద్భుత ఫలితాలు సాధించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా స్టేట్ సెకండ్ మార్క్ సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ జయవేణుగోపాల్ మరియు డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.

## భారత్‌లో హై-కెపాసిటీ క్రేన్ల తయారీకి ఏస్-కాటో జాయింట్ వెంచర్

హైదరాబాద్, జులై 03 (విజన్ ఆంధ్ర) : భారత నిర్మాణ పరికరాల తయారీ సంస్థ యాక్షన్ కన్స్ ట్రక్షన్ ఎక్విప్మెంట్ లిమిటెడ్(ఏస్), జపాన్‌కు చెందిన కాటో వర్క్స్ కంపెనీ లిమిటెడ్ సంయుక్తంగా 50:50 భాగస్వామ్యంతో ఏస్ కాటో ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో కొత్త జాయింట్ వెంచర్‌ను ప్రకటించినట్లు ఏస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోరబ్ అగర్వాల్ శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ హర్యానాలో 11 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్‌లో ట్రక్ క్రేన్లు, క్రాలర్ క్రేన్లు, రఫ్ టెర్రైన్ క్రేన్లను తయారు చేయనుండగా, భవిష్యత్‌లో మరిన్ని క్రేన్ మోడళ్లను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. దేశీయ మార్కెట్‌తో పాటు ప్రపంచ మార్కెట్లకు కూడా ఉత్పత్తులను సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయని తెలిపారు. జపనీస్ సాంకేతికతను భారత తయారీ సామర్థ్యాలతో మేళవించి అధిక సామర్థ్యం గల క్రేన్ తయారీకి ప్రపంచ స్థాయి వేదికను రూపొందిస్తున్నామని తెలిపారు. కాటో వర్క్స్ డైరెక్టర్ టోమోయసు కాటో మాట్లాడుతూ ఏస్ యొక్క తయారీ సామర్థ్యాలు, సరఫరాదారుల వ్యవస్థ, మార్కెట్ నెట్‌వర్క్‌తో కలిసి భారతదేశాన్ని కీలక క్రేన్ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.



## అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకుంటూ,రైతులకు సరిపడ యూరియా బస్తాలు అందివ్వాలి-సీపీఐ.

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 3(విజన్ ఆంధ్ర): భారత కమ్యూనిస్టు పార్టీ ఆసిఫాబాద్ మండల సమితి ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ మండలంలోని వ్యవసాయ కార్యాలయంలో లివ్యవసాయ విస్తరణ అధికారి ఏ చిరంజీవి కి మెమోరండం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా లిసిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి మాట్లాడుతూలి వానాకాలం సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో కుమురం భీం అసిఫాబాద్ జిల్లాలో రైతులు యూరియా ఎరువుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటల సాగు అత్యంత కీలక దశలో ఉన్నప్పటికీ యూరియా కొరత, ఆన్లైన్ యాప్ బుకింగ్‌లో నెలకొన్న గందరగోళం, కొంతమంది ఎరువుల దుకాణదారుల ఇష్టారాజ్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలలో నిలబడాల్సి వస్తుండగా, ఆన్లైన్ బుకింగ్ వ్యవస్థ సక్రమంగా పనిచేయక చాలామంది రైతులు ఎరువులు పొందలేకపోతున్నారు అని అన్నారు. మరోవైపు కొంతమంది ఎరువుల వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. కొన్ని చోట్ల రైతులను అవసరం లేని ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు, పంటలకు అవసరమైన సమయంలో ఎరువులు అందక దిగుబడులపై కూడా తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అందువల్ల భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తరపున మండలంలోని లిఅన్ని ఎరువుల దుకాణాల్లో యూరియా నిల్వలు మరియు విక్రయాలపై



ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని,ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర (ఎమ్ఆర్‌పి) కంటే అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై ఎరువుల (నియంత్రణ) ఉత్తర్వులు మరియు ఇతర వర్తించే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉంచాలని,ఆన్లైన్ యాప్ బుకింగ్‌లో ఉన్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా రైతులకు ఎరువులు అందించాలని, ఎరువులతో పాటు ఇతర వస్తువులను బలవంతంగా కొనుగోలు చేయించాలని ఒత్తిడి చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని,ప్రతి ఎరువుల దుకాణంలో ధరల జాబితా, నిల్వల వివరాలు మరియు ఫిర్యాదు నంబర్లను తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని,రైతుల ఫిర్యాదులను స్వీకరించి వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు పిడుగు శంకర్, తాళ్లపల్లి దివాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఉపాధ్యాయులకు వెంటనే పిఆర్సి ప్రకటించాలి

**- పి ఆర్ టి యు టీఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి జనార్దన్ రెడ్డి.**

నారాయణపేట, జులై 3 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వం ఉపాధ్యాయులకు వెంటనే పిఆర్సి ప్రకటించాలని నారాయణపేట పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి జనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండల పరిధిలోని భూనేడు జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో రాష్ట్ర కార్యదర్శి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పి ఆర్ టి యు 2026 – 2027 విద్యా సంవత్సరం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు సాధించబడ్డ సమస్యలన్నీ కేవలం పి అర్ టి యు సంఘము ద్వారానే సాధించబడ్డాయని, భవిష్యత్తులోనూ అపరిష్కృత సమస్యలు సంఘము ద్వారానే సాధ్యమవుతుందని అందువల్ల ఉపాధ్యాయులు బేషజాలకు పోకుండా స్వచ్ఛందంగా సంఘంలో సభ్యత్వం చేసి సంఘమును బలోపేతం చేయాలని కోరారు. ఇప్పటివరకు ప్రభుత్వమునకు ఉపాధ్యాయ లోకం అన్ని విషయాలలో సహకరిస్తుందని గుర్తించి ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలు ఇంకా ఆలస్యం చేయకుండా వెంటనే పిఆర్సి



పెండింగ్,డి ఎ లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యోగ ఉపాధ్యాయులు సహనం కోల్పోయి రోడ్డెక్కి ప్రమాదం ఉందని అన్నారు. ముఖ్యమంత్రి మేనిఫెస్టోలో సూచించిన విధంగా వెంటనే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని కోరారు. హెల్త్ కార్డుల విషయంలో ఉపాధ్యాయులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని త్వరలోనే అమలు అవుతాయని మార్గదర్శకాలు మనము కోరుకున్నట్లే ఉంటాయని ఉపాధ్యాయులకు మార్గదర్శనం చేశారు. ఉపాధ్యాయులు ఆలోచించి సభ్యత్వం చేసి ఉపాధ్యాయుల ఉనికిని కాపాడుకోవాలని సూచించారు. కొంతమంది మాటలతో మభ్యపెడుతూ సంఘాలకు కొత్త బాష్యం చెప్పుతూ ఉపాధ్యాయుల ఉనికిని కాలరాస్తున్నారని అలాంటి వారి మాయలో పడి ఇప్పటికే చాలా నష్టాన్ని మనం పొందామని అది గుర్తుఎరిగి సభ్యత్వం చేయాలనీ సూచించారు. పి అర్ టి యు సంఘం పెన్షన్ తెస్తే పెన్షన్ తీసివేసిన పార్టీల వెంబడి ఉండే సంఘాలు ఇవాళ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేస్తా మని చెప్పడం దివాలు కోరుతనానికి నిదర్శనమని వారు దుయ్యబట్టారు. ఆలస్యమైనప్పటికీ త్వరలోనే సమస్యల పరిష్కారానికి రాష్ట్ర నాయకత్వం కృషి చేస్తుందని లేనిపక్షంలో ఉద్యమ బాట పడుతుందని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయ బృందం స్వచ్ఛందంగా పి ఆర్టీయూలో సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదుకు జిహెచ్ఎం నీలిమ ఆహ్వానించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆర్ ఆంజనేయులు కొత్తపల్లి మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ప్రధాన కార్యదర్శి భీమేష్,నారాయణ పేట మండలం అధ్యక్షులు ఎం.రఘువీర్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శేఖర్ రెడ్డి సీనియర్ సభ్యులు చెన్నకేశవరెడ్డి,సనత్ రెడ్డి,భాను ప్రకాష్ రెడ్డి,తిమ్మారెడ్డి, నర్సింలు, శివాజీ, హైమద్ అలీ,రాణి బాయి,శ్రీలత,కవిత,వెంకటేష్,కిషోర్,అనిత, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం మాకెందుకు?

**- పిఆర్సి, డిఏలు ఇవ్వండి**
**- తపస్ జిల్లా అధ్యక్షులు నరసింహ**

నారాయణపేట, జులై 3 (విజన్ ఆంధ్ర) : ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం టిఫిన్ ఇవ్వాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అభ్యంతరకరమని ఉపాధ్యాయులు ఎవరు ఇది కోరుకోలేదని తపస్ జిల్లా అధ్యక్షులు నరసింహ, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి అన్నారు. కొత్తపల్లి మండలంలో నగేష్ ఆధ్వర్యంలో సభ్యత్వ అభియాన్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ నాణ్యమైన మధ్యాహ్న భోజనం పాఠశాల విద్యార్థులకు అందిస్తే సరిపోతుంది అన్నారు.ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పిఆర్సి డిఏలు ఇవ్వకుండా జాప్యం చేస్తూ ఉపాధ్యాయులకు ఆర్థిక నష్టం కలిగిస్తున్నారని వాపోయారు. కోరినవి ఇవ్వకుండా



కోరనివి అవసరం లేనివి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం విడ్డూరంగా ఉందని అన్నారు. భాగంగా దుప్పటి గట్టు, గోకుల్ నగర్, అల్లిపూర్,ఎక్కమేడ్, మన్నాపూర్, కొత్తపల్లి, నిర్జింత, భూనేడు గ్రామాలలో ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో తపస్ మండల ప్రధాన కార్యదర్శి శేఖర్, నాయకులు విజయరెడ్డి భీమ్సేన్ రాజు నరసింహులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో పేదల ఇండ్ల కూల్చివేతలా

**- పేదలు గూడు కోసం ఉద్యమించేది కమ్యూనిస్టులే**
**- గుండ్ల సింగారం వంటా వార్పులో పాల్గొన్న చాడ, తక్కళ్ళపల్లి**

హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 03 ( విజన్ ఆంధ్ర ) : పేదలకు ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి రాగానే వారి గూడును కూల్చివేయడం దుర్మార్గమని, ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల ఇండ్ల కూల్చివేతలేనా అని సీపీఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర సహయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం హనుమకొండ జిల్లా పరిధిలోని గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లో ఇండ్ల కూల్చివేత జరిగిన విశ్రమించకుండా ఇండ్ల స్థలాలు, గూడు కోసం పేదలు చేపట్టిన భూపోరాటంలో వంటా–వార్పు కార్యక్రమానికి సీపీఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర సహయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి, తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా



పేదలకు భూములు, గృహ వసతి కోసం కమ్యూనిస్టులే నిరంతరం పోరాడుతున్నారని గుర్తుచేశారు. నిరుపేదలు ఎంతో ఆశతో కాంగ్రెస్‌కు ఓట్లేసి గెలిపిస్తే, నేడు వారి ఇండ్లను కూల్చి రోడ్డున పడేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. నిరుపేదలు నిర్మించుకున్న ఇండ్ల కూల్చివేతలను ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని అన్నారు.హనుమకొండ గుండ్ల సింగారంలో సర్వే నెంబర్లు 174,175లలో నేడు చెరువు శిఖం భూమి లేనే లేదని, గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పేదలకు 1360 మందికి ఇంటి స్థలాలు ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్ళుగా అక్కడ పేదలు సిపిఐ ఆధ్వర్యంలో భూ పోరాటం నిర్వహించి గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని అన్నారు. గుండ్ల సింగారంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇండ్ల స్థలాలు కేటాయించి, పట్టాలు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం మొండివైఖరి వీడకపోతే కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భూపోరాటాలను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యురాలు మండ సదాలక్ష్మి, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, సిపిఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు వుట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, గ్రామ పెద్దలు గాదె మొగిలి, జన్ను కృష్ణ, సిపిఐ నాయకులు మాలోత్ శంకర్ నాయక్, గుంటి రాజేందర్, పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, మామునూరి దామోదర్, పూజారి నరేందర్, కేతపాక ప్రసాద్, తాటికొండ ప్రశాంత్, మాలోత్ మంగ, నలువాల సంధ్య, తాటికంటి మమత, గుంటి రజిత, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భూపోరాట కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో గేదె మృతి.. రైతుకు రూ. లక్ష నష్టం

ఊట్కూర్, జులై 3 ( విజన్ ఆంధ్ర) : ఊట్కూర్ మండల పరిధిలోని అవుసలోనిపల్లి గ్రామంలో విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ఘటనతో బాధిత రైతుకు సుమారు రూ. లక్ష మేర ఆర్థిక నష్టం వాటిల్లింది.బాధిత రైతు గుడిసె బాల్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం ప్రతిరోజులాగే తన గేదెను మేత కోసం పొలానికి వదిలారు. మేత మేస్తూ వెళ్లిన గేదె ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో తీవ్ర విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె మృతి చెందడంతో రైతు లబోదిబోమని మొత్తుకున్నాడు. మృతి చెందిన గేదె విలువ సుమారు



రూ. లక్ష వరకు ఉంటుందని విలేకరులకు తెలిపారు.ఒక్కసారిగా గేదెను కోల్పోవడంతో తనకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు.స్థానికులు ఘటనపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విచారణ చేపట్టి, బాధిత రైతుకు తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి

**హౌసింగ్, సెర్ఫ్, పీఆర్ శాఖల అధికారులతో సమీక్ష జరిపిన జిల్లా కలెక్టర్.**

నారాయణపేట, జులై 3 (విజన్ ఆంధ్ర) : శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో హౌసింగ్, డీఆర్డీఏ ( సెర్ఫ్), పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయించాలన్నారు. జిల్లాలో ఇంకా 767 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ప్రారంభించాల్సి ఉందన్నారు. ఇండ్లను ఎందుకు నిర్మించుకోలేక పోతున్నారో లబ్ధిదారులతో కారణం రాయించుకుని వాటిని రద్దు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం ఇండ్ల నిర్మాణాలకు 5 లక్షలు ఇస్తున్నా, ఇంకా ఎందుకు నిర్మించుకోవడం లేదని ఆమె విస్మయం వ్యక్తం చేశారు. మండలాల వారీగా మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు, వివిధ దశల్లో ఉన్న ఇండ్ల నిర్మాణాల పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ ఏఈ లకు ఇచ్చిన టార్గెట్ ను రెండు వారాల్లో పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. జిల్లాలో గుడిసెల లెక్కింపు సర్వే పూర్తి చేయాలన్నారు. గుడిసె ఉన్న ప్రతీ ఒక్కరు ఇందిరమ్మ ఇంటికి అర్హులు కాదని, గుడిసెలోనే వంట చేసుకుని



జీవిస్తున్న వారికి ఇండ్లను మంజూరు చేయాల్సి ఉంటుందన్నారు. కొన్ని గ్రామాల్లో కొంతమంది సొంత ఇల్లు ఉన్నా.. పక్కన ఖాళీ స్థలంలో గుడిసె వేసుకుని ఉంటారని, అలాంటి వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయవద్దని తేల్చి చెప్పారు. రెండు వారాల తర్వాత మళ్ళీ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షిస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో జిల్లాలో కొనసాగుతున్న పనుల గురించి చర్చించిన కలెక్టర్ గ్రామాలకు మంజూరైన వీ వో బిల్డింగ్ ల నిర్మాణాలు ఎంత వరకు వచ్చాయని ఏ ఈ లను ప్రశ్నించారు. జిల్లాకు ఇది వరకే 39 వీ వో బిల్డింగ్ లు మంజూరు కాగా వాటిలో ఒక్క బిల్డింగ్ కూడా పూర్తి కాకపోవడం దురదృష్టకరం అని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పుడు కొత్తగా మళ్ళీ 180 వీ వో బిల్డింగ్ లు మంజూరు అయ్యాయని, జిల్లాలోని అన్ని గ్రామాలలో వీ వో బిల్డింగ్ ల నిర్మాణాలను ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖ ఏఈల దినచర్య (డ్యూటీ చార్ట్) నివేదికను ఇవ్వాలని పీ ఆర్ ఈ ఈ అశోక్ కుమార్ కు ఆమె సూచించారు. అలాగే కొడంగల్ నియోజక వర్గ పరిధిలోని కోస్గి,మద్దూరు, గుండు మల్, కొత్త పల్లి మండలాలలో ఎంపీడీవోలు, ఏఈ లు వీ వో బిల్డింగ్ ల నిర్మాణానికి స్థల సేకరణ చేసి వెంటనే నిర్మాణాలను ప్రారంభింప చేయించాలని ఆదేశించారు. అన్ని గ్రామాలలో వీవో బిల్డింగ్ లు ఉండాలని ఆమె స్పష్టం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలు పెట్టి పూర్తి చేయించాలని పేమెంట్ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావు లేదని, తప్పకుండా వస్తాయని ఆమె హామీ ఇచ్చారు. మహిళా సంఘాల సభ్యులకు మంజూరైన గిడ్డంగుల నిర్మాణాల గురించి అడిగి తెలుసుకొని వాటి నిర్మాణాలను వేగంగా చేపట్టాలన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులను కూలీల సంఖ్య పెంచి వేగంగా చేయించాలన్నారు. ఉపాధి హామీ పనులపై ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నెలకోసారి జరిగే మండల మహిళా సమాఖ్య సభ్యుల సమావేశానికి ఎంపీడీవోలు తప్పని సరిగా హాజరు కావాలని, ఆ సమావేశాల ద్వారా సెర్ఫ్ కార్యకలాపాల గురించి తెలుస్తుందన్నారు. సెర్ఫ్ వింగ్ కు సంబంధించి మండలాల వారీగా ఎస్ హెచ్ జి గ్రూపుల వివరాలు, బ్యాంకు లింకేజీ టార్గెట్లు, స్త్రీ నిధి రికవరీ, ఎన్ పీ ఏ, ఎంటర్ ప్రైజెస్, స్కూల్ యూనిఫామ్స్ స్టిచ్చింగ్, కిషోర బాలికల సంఘాల ఏర్పాటు, యూడీఐడీ సర్టిఫికెట్ల గురించి కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమీక్షా సమావేశంలో డీ ఆర్డీ ఏ వెంకట్ రాములు, ఇన్ ఛార్జ్ డీ ఎల్ పీ వో ఉదయ్ కుమార్, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవో లు, పీఆర్ ఏ ఈ లు, డీపీఎంలు, ఏ పీ వో లు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదామును తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ రెవెన్యూ డి.శ్రీనివాస్ రెడ్డి

కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూలై 03..కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాశీను శుక్రవారం అదనపు కలెక్టర్ రెవెన్యూ డి.శ్రీనివాస్ రెడ్డి రాజకీయ పార్టీ ప్రతినిధిలతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ డి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాశీ వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈవియం గదుల వి వి ప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ



కార్యక్రమంలో అర్బన్ తహసిల్దార్ రాజేష్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్, బి జె పి పార్టీ ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్ బిఆర్ ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్ , ఎంఐఎం పార్టీ ప్రతినిది మజీద్ హుమైన్, సయ్యద్ ఇబ్రహీం,టిడిపి పార్టీ ప్రతినిది ఎర్రవెల్లి రవీందర్ , సి పి యం పార్టీ ప్రతినిధి నరేష్ బి ఎస్ పి పార్టీ ప్రతినిధి సిరిసిల్ల అంజయ్య ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమర్ధవంతమైన పోలీసింగ్, క్రమశిక్షణ, ప్రజలకు జవాబుదారీతనం పెంపుపై డీజీపీ దిశానిర్దేశం

**- వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న పేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

నారాయణపేట , జూలై 3 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలో



సమర్ధవంతమైన పోలీసింగ్ ప్రమాణాల అమలు, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం, పోలీసు వ్యవస్థలో క్రమశిక్షణ, జవాబుదారీతనం పెంపు లక్ష్యంగా రాష్ట్ర డీజీపీ ఆనంద్ నిర్వహించిన రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ జిల్లా పోలీసు అధికారులతో కలిసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ పోలీసు అధికారులు ప్రజలకు మరింత నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, బాధ్యతాయుత వైఖరి పాటించాలని, పాత విధానాలను వదిలి ఆధునిక పోలీసింగ్‌కు అనుగుణంగా మారాలని ఆదేశించారు. అలాగే రాష్ట్రంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ, రోడ్డు భద్రత, మహిళలు మరియు చిన్నారుల రక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, భరోసా కేంద్రాలు, షీ టీమ్స్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. నేరాల నియంత్రణలో సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తూ ప్రజలకు సత్వర సేవలు అందించాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తో పాటు జిల్లాలోని అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు మహేష్ , నల్లపు లింగయ్య, సీఐలు, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# అత్యంత ప్రతిష్టాత్మకంగా బిషప్ దుగ్గింపూడి విజయపాల్ పట్టాభిషేక మహోత్సవం

హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 03 ( విజన్ ఆంధ్ర ) : వరంగల్ 4వ బిషప్ గా దుగ్గింపూడి విజయ్ పాల్ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం కాజీపేట లోని కేథడ్రిల్ చర్చ్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమం వందలాది మంది కేథలిక్ విశ్వాసుల మధ్య వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఢిల్లీ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బళ్లారి సహా వివిధ ప్రాంతాల నుంచి బిషప్ లు విచ్చేశారు. వారి మధ్య బిషప్ గా దుగ్గింపూడి విజయ్ పాల్ పట్టాభిషేకం పొందారు. అంతకుముందు నూతన బిషప్ హౌస్ ను ప్రారంభించారు. కాగా ఇంతకాలం వరంగల్ డయాసిస్ బిషప్ గా సేవలందించిన ఉడుముల బాల స్థానంలో ఈ ఏడాది మే 9న 14వ లియో పోప్ విజయ్ పాల్ ను నూతనంగా నియమించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్చ్ బిషప్ అంటోనీ పూల, విశాఖపట్నం అర్చ్ బిషప్ ఉడుముల బాల, శ్రీకాకుళం బిషప్ రాయరాల విజయ్ కుమార్, ఏలూరు బిషప్ జయరావు పొలిమేర, ఇతర బిషప్ ల సమక్షంలో విజయ్ పాల్ కు ఉంగరం, కిరీటం, దండం ను అందించారు. 14వ లియో పోప్ నుంచి వచ్చిన అధికార నియామక పత్రాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ డయాసిస్ ను నూతన బిషప్ విజయ్ పాల్ విశ్వాసం, ఐక్యత దిశగా



నడిపించాలన్నారు. ఓరుగల్లు అంటేనే విప్లవాత్మకమైన ఉక్కు సంకల్పం గల ప్రాంతమని అన్నారు. ఓరుగల్లు పీఠం సంగర్వంగా ఉండేందుకు ఉడుముల బాల కృషి చేశారన్నారు. వరంగల్ పీఠాధిపతిగా నమ్మకంగా సేవ చేస్తానని, తనపై ఉంచిన విశ్వాసాన్ని జీవితాంతం వరకు నిలబెట్టుకుంటానని వరంగల్ బిషప్ దుగ్గింపూడి విజయ్ పాల్ అన్నారు. పట్టాభిషేకం అనంతరం ఆయన మాట్లాడుతూ అనంతమైన ప్రేమ గల దేవుడికి కృతజ్ఞతగా ఉండాలనేది తన ధ్యేయం అని పేర్కొన్నారు. తనను వరంగల్ డయాసిస్ 4వ పీఠాధిపతిగా ఎన్నిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది తన ప్రతిభకు గుర్తింపు కాదన్నారు. వరంగల్ పీఠం అనంతమైన అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. క్రీస్తు తన విజయంగా, సువార్త ధ్యేయంగా ముందుకు సాగుతామని చెప్పారు. యాజకులు, విశ్వాసులు, మఠవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. నూతన బిషప్ విజయ్ పాల్ ను ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే లు సన్మానించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు, కుడా చైర్మన్, కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఏనుమాముల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎర్ర



ప్రియాంకఅనిల్, మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన పీఠాధిపత్యంలో వరంగల్ మెత్రాసనం ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి, సమాజానికి శాంతి, సామరస్యం, మానవతా విలువలను చాటిచెప్పేలా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# వరదను అడ్డుకునేందుకు స్ట్రాంగ్ వాటర్ డ్రైన్ నిర్మాణం..



సూర్యాపేట జూలై 03:(విజన్ ఆంధ్ర) : వర్షాకాలంలో వచ్చే వరద ప్రవాహంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వరదని సాఫీగా పారేందుకు స్ట్రం వాటర్ డ్రైన్ నిర్మాణం చేస్తున్నట్లు ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ మోరిశెట్టి నివేదిత అన్నారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు వెనుక అలుగు ప్రాంతంలో యుఐడిఎఫ్ నిధులు 8.30 కోట్లతో ఎస్ఆర్ఎన్ ఫంక్షన్ హాల్ నుంచి నూతన జిల్లా ఎస్పీ కార్యాలయం కు వెళ్లే దారి వరకు గల నాళాలో స్ట్రాంగ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రతి వర్షాకాలంలో పట్టణంలోని 27,29వ వార్డుల ప్రజల ఇండ్లలోకి నీళ్లు రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వరద నీటి నుంచి వారికి ఉపశమనం కలిగించేందుకు నాళాలో స్ట్రామ్ వాటర్ డ్రై నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులు మ్యాప్ ప్రకారం ప్రణాళిక బద్ధంగా పనులు నిర్వహించాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సర్వోత్తం బాబు చూపు ఎవరి వైపు..?

- పట్టణ కాంగ్రెస్‌కు కొత్త నాయకుడు ఎవరు..?
- పట్టణ అధ్యక్ష పదవిపై ఉత్కంఠ..!
- కాంగ్రెస్‌లో పట్టణ అధ్యక్ష పదవి రేసు హీటెక్కింది..
- సీనియర్లకు న్యాయం చేస్తారా..?
- కష్టపడ్డ వారికి నాయకత్వం ప్రాధాన్యం ఇస్తుందా..?
- లేక కొత్త సమీకరణాలకు పెద్దపీట వేస్తుందా..?
- పట్టణ అధ్యక్ష పదవిపై కార్యకర్తల ఎదురుచూపులు..!





సూర్యాపేట ప్రతినిధి, జూలై 03:(విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు రాంరెడ్డి సర్వోత్తమ్ బాబు చూపు ఎవరి వైపు పడనుందో అని కార్యకర్తలు వేచి చూస్తున్నారు. పట్టణ అధ్యక్ష పదవులు అన్ని నియోజకవర్గాల్లో నియమాకాలు కావడంతో సూర్యాపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్ష పదవి నియామకం చుట్టూ పార్టీ శ్రేణుల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది.పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడి పనిచేసిన నాయకులు,కార్యకర్తలకే పట్టణ అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని క్షేత్రస్థాయి శ్రేణులు కోరుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోయిన రోజుల్లో కూడా పార్టీ జెండాను భుజాన వేసుకుని ప్రజా సమస్యలపై పోరాడిన వారిని విస్మరించకుండా నాయకత్వం నిర్ణయం తీసుకోవాలని కార్యకర్తలు అభిప్రాయాలు వెలువెత్తుతున్నాయి.సీనియర్ నాయకులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఉన్న నాటి నుండి పార్టీని నమ్ముకొని ఏండ్లుగా ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ, కష్టకాలంలోనూ పార్టీతోనే నిలిచిన వారిని విస్మరించకుండా నాయకత్వం నిర్ణయం తీసుకోవాలని వారు అభిప్రాయపడుతున్నారు.పూటకోక పార్టీలు మారి కొంతమంది కేవలం పదవి కోసం చివరి నిమిషంలో చేరిన వారికి కాకుండా, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన వారికి అవకాశం కల్పిస్తే కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నెలకొంటుందని అంటున్నారు.ఎన్నికల సమయంలో మాత్రమే చురుకుగా కనిపించే వారికి కాకుండా, పార్టీ బలోపేతం కోసం నిరంతరం శ్రమించిన వారికి గుర్తింపు దక్కాలనే డిమాండ్ వినిపిస్తోంది.పట్టణ అధ్యక్ష పదవి కేవలం ఒక హోదా మాత్రమే కాదని, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే కీలక బాధ్యత అని కార్యకర్తలు చెబుతున్నారు. అందువల్ల వ్యక్తిగత సమీకరణాల కంటే పార్టీ కోసం చేసిన సేవ, విధేయత, ప్రజల్లో ఉన్న ఆదరణను పరిగణనలోకి తీసుకుని నియామకం చేపట్టాలని కోరుతున్నారు.సూర్యాపేట కాంగ్రెస్‌లో పట్టణ అధ్యక్షుడి ఎంపిక పార్టీ భవిష్యత్ కార్యాచరణపై ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. కష్టపడ్డ వారికి నాయకత్వం ప్రాధాన్యం ఇస్తుందా..? లేక కొత్త సమీకరణాలకు పెద్దపీట వేస్తుందా..? అనే అంశం ఇప్పుడు పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.పట్టణ అధ్యక్షుడి ఎంపికలో విధేయత, సేవాభావం, ప్రజల్లో ఆదరణ, పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని ప్రధాన ప్రమాణాలుగా పరిగణించాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. కష్టపడ్డ వారికి తగిన గౌరవం లభిస్తే పార్టీ మరింత బలోపేతం కావడంతో పాటు కార్యకర్తల్లో విశ్వాసం కూడా పెరుగుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ బలోపేతానికి అహర్నిశలు కష్టపడిన నాయకులను పక్కనబెట్టి రాజకీయ సమీకరణాల పేరుతో నిర్ణయాలు తీసుకుంటే క్షేత్రస్థాయి కార్యకర్తల మనోధైర్యం దెబ్బతింటుందని వారు అభిప్రాయపడుతున్నారు.పదవులు వ్యక్తిగత ప్రాధాన్యాల కోసం కాకుండా పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన వారికి దక్కాలనే భావన కార్యకర్తల్లో బలంగా వ్యక్తమవుతోంది. పార్టీని నమ్ముకుని ముందుకు నడిచిన వారికి నాయకత్వం న్యాయం చేస్తుందా..? లేక కష్టపడిన వారిని మరోసారి నిరాశపరుస్తుందా..? అనే ప్రశ్న ఇప్పుడు కార్యకర్తల మధ్య ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

# పని మాత్రం కొండంత... గుర్తింపు గోరంత..!

- అయ్యో పాపం ఆశ కార్యకర్తలు..
- పనిభారం పెరిగి ఇబ్బందులు
- ప్రభుత్వ పనులన్నీ ఆశల భుజాలపైనేనా..?
- సేవ చేస్తున్నా...గుర్తింపు మాత్రం కరువు
- అదనపు బాధ్యతలతో ఆశ కార్యకర్తల అవస్థలు
- జీతం తక్కువ... పని మాత్రం ఎక్కువ
- ప్రతి శాఖకు ఆశలే ఆధారం..?
- ఆశ కార్యకర్తల ఆవేదనకు పరిష్కారం ఎప్పుడు..?
- అయ్యో పాపం... ఆశలపై పెరుగుతున్న భారం
- ఆశ కార్యకర్తల కష్టాలు వినేవారెవరు..?
- శ్రమకు తగ్గ ఫిక్స్ డ్ వేతనం అందించాలి..!



సూర్యాపేట ప్రతినిధి, జూలై 03:(విజన్ ఆంధ్ర) పట్టణ, గ్రామీణ ఆరోగ్య వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న ఆశ కార్యకర్తలపై రోజురోజుకూ పనిభారం పెరుగుతోందని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య సేవలు, టీకాల కార్యక్రమాలు,గర్భిణుల పర్యవేక్షణ,చిన్నారుల సంరక్షణ వంటి ప్రధాన బాధ్యతలతో పాటు, వివిధ శాఖలకు సంబంధించిన అదనపు పనులు కూడా వరుసగా అప్పగిస్తున్నారని చెబుతున్నారు.ఏ శాఖకు పని వచ్చినా ఆశ కార్యకర్తలే గుర్తొస్తున్నారు. కానీ మా సమస్యలు చెప్పుకునే సమయం మాత్రం ఎవరికీ లేదని పలువురు ఆశ కార్యకర్తలు వాపోతున్నారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణం, గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు సేవలందిస్తున్నప్పటికీ,పనికి తగిన గుర్తింపు, భద్రత, సౌకర్యాలు, ప్రోత్సాహకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ పథకాల అమలులో ముందు వరుసలో పనిచేసేది ఆశ కార్యకర్తలేనని అందరూ చెబుతున్నా, వారి పని పరిస్థితులను మెరుగుపర్చడంలో మాత్రం ఆలస్యం జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పనిభారం పెంచడమే కాకుండా, వారి సమస్యల పరిష్కారంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాలని ఆశ కార్యకర్తలు కోరుతున్నారు.ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతం కావాలంటే, ముందుగా ఆశ కార్యకర్తల శ్రమకు తగిన గౌరవం,రక్షణ,న్యాయమైన పారితోషికం,పనికి తగిన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ప్రజలకు ఆరోగ్య సేవలను చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశ కార్యకర్తలు రోజురోజుకూ పెరుగుతున్న పనిభారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు సేవలందిస్తున్నప్పటికీ తరచూ కొత్త సర్వేలు,డేటా సేకరణ, సమావేశాలు, నివేదికల సమర్పణ వంటి పనులు పెరగడంతో కుటుంబానికి సమయం కేటాయించలేకపోతున్నామని వాపోతున్నారు. ప్రజారోగ్య వ్యవస్థలో కీలకమైన ఆశ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, అదనపు పనిభారాన్ని తగ్గించడంతో పాటు తగిన ప్రోత్సాహకాలు, సౌకర్యాలు కల్పించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.వారి సేవలను గుర్తించి, పని పరిస్థితులను మెరుగుపరిస్తే గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని సూచిస్తున్నారు.



### ప్రభుత్వ పథకాల విజయానికి మేమే ముందుంటాం..

ప్రభుత్వ పథకాల విజయానికి మేమే ముందుంటాం కానీ మా సమస్యల పరిష్కారానికి మాత్రం ఎవరూ ముందుకు రావడం లేదు అని ఆశ కార్యకర్తలు అంటున్నారు. రోజంతా గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు సేవలందిస్తున్నప్పటికీ, తమ శ్రమకు తగిన విలువ దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆశ కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం అత్యవసరంగా పరిశీలించి, పనిభారాన్ని సమీక్షించడం, తగిన ప్రోత్సాహకాలు కల్పించి ఫిక్స్ వేతనం అందించి వాటి పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలంటే, ముందుగా ఆ వ్యవస్థను మోస్తున్న ఆశ కార్యకర్తల సంక్షేమంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

*నకరికంటి కవిత ఆశ వర్కర్ యూనియన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు..*

# సింగరేణి సిరిమల్లెలు... నల్లబంగారం వెలుగులు!!

- ఇప్పుడు ఎటు పోయాయి?... ఏమైనాయి?
- నల్లబంగారం నవ్వులు ఏమాయె?
- సింగరేణిలో ఎందుకీ 'నిశ్శబ్ద' రాగం
- రికార్డులొస్తే మైకుల మోత
- తగ్గినప్పుడు మౌన వ్రతమా?
- కార్మికుడి చెమట చుక్కకు లెక్క చెప్పేదెప్పుడు?

హైదరాబాద్, జూలై 3:

తెలంగాణ వెలుగుల జిలుగుల వెనుక, కోట్ల ఇళ్ల దీపాల వెనుక ఉండేది ఒకే ఒక్క పేరు... సింగరేణి. కార్మికుడి చెమట చుక్క, భూగర్భ గనుల్లోంచి వినిపించే గడ్డపారల చప్పుడు మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గుండె చప్పుడు.

కానీ, గత నాలుగైదు నెలలుగా సింగరేణి బొగ్గు గనుల నుంచి ఒక రకమైన 'నిశ్శబ్దం' వినిపిస్తోంది. రికార్డుల మోత మోగినప్పుడు మైకులు పగిలిపోయేలా ప్రచారం చేసుకున్న సంస్థ... ఇప్పుడు బొగ్గు ఉత్పత్తి వివరాలను ఎందుకు గోప్యంగా ఉంచుతోంది? ఇదే ఇప్పుడు అటు కార్మిక లోకంలోనూ, ఇటు రాజకీయ వర్గాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది.




### 'సక్సెస్'కు పబ్లిసిటీ... మరి 'సైలెన్స్'కు రీజన్ ఏంటి?

### నాడు - హై ఎండ్ పబ్లిసిటీ

నిన్నమొన్నటి వరకు సింగరేణిలో టార్గెట్ రీచ్ అయితే చాలు... ప్రెస్ మీట్లు, సోషల్ మీడియాలో పోస్టర్లు, రికార్డు స్థాయి బొగ్గు ఉత్పత్తి అంటూ పెద్ద ఎత్తున హడావుడి కనిపించేది రామగుండం రీజియన్1 పరిధిలో. ఆ సంబరాలు చూసి కార్మికుడు కూడా రొమ్ము విరిచి గర్వపడ్డాడు.

**నేడు - మిస్టరీ సైలెన్స్ :** గత కొన్ని నెలలుగా అసలు ఉత్పత్తి ఎంత జరుగుతోంది? టార్గెట్‌కు ఎంత దూరంలో ఉన్నాం? అనే వివరాలు అధికారికంగా బయటకు రావడం లేదు. అంతా గప్‌చుప్‌గా సాగుతోంది. మీడియా సమావేశంలో సైతం సంబంధిత జనరల్ మేనేజర్ కేవలం బొగ్గు రవాణా విషయాలను మాత్రమే వెల్లడిస్తున్నారు.

### సెంటిమెంట్ టచ్

గని లోపలికి వెళ్లేటప్పుడు 'లాల్ సలాం' అనుకుంటూ వెళ్లే కార్మికుడికి... తను తీసిన నల్లబంగారం దేశానికి ఎంత వెలుగునిచ్చిందో తెలుసుకునే హక్కు లేదా? గెలుపును పంచుకున్నప్పుడు, లోపాలను ఎందుకు దాచాలి?

### ఎక్స్-గవర్నమెంట్ ఆరోపణలు... సమాధానం చెప్పే బాధ్యత లేదా?

ప్రస్తుతం ప్రతిపక్షాలు (మాజీ ప్రభుత్వం) సింగరేణి యాజమాన్యంపై, ఇప్పటి సర్కార్‌పై తీవ్రమైన ఆరోపణలు గుప్పిస్తున్నాయి. "ఉత్పత్తి పడిపోయింది, సంస్థ నష్టాల బాట పడుతోంది, అందుకే వివరాలు దాస్తున్నారు" అంటూ విమర్శలు విసురుతున్నారు.

ప్రశ్నల వర్షం ప్రజాస్వామ్యంలో ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని ఖండించడమో, లేదా వాస్తవాలు ఇవంటూ లెక్కలు చూపించడమో సంస్థ బాధ్యత.

### సైలెంట్ స్ట్రాటజీ?

కానీ సింగరేణి యాజమాన్యం మాత్రం 'మౌనమే నీ భాష ఓ మూగ మనసా' అన్నట్టుగా వ్యవహరిస్తోంది. ఈ మౌనం ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తుందే తప్ప, అనుమానాలను పటాపంచలు చేయలేదు.

### కార్పొరేట్ స్టైల్ వర్సెస్ గ్రౌండ్ రియాలిటీ

మోడర్న్ కార్పొరేట్ లుక్‌లోకి మారుతున్న సింగరేణి... పారదర్శకత విషయంలో మాత్రం వెనుకబడిపోతోందనే వాదన బలంగా వినిపిస్తోంది. బొగ్గు ఉత్పత్తి తగ్గడానికి వాతావరణ పరిస్థితులు, సాంకేతిక ఇబ్బందులు లేదా కొత్త గనుల కేటాయింపుల్లో ఆలస్యం... ఇలా ఏవైనా కారణాలు ఉండొచ్చు. వాటిని స్పష్టంగా చెబితే కార్మికులు, ప్రజలు అర్థం చేసుకుంటారు. కానీ ఇలా 'గోప్యత' పాటించడం వల్ల సంస్థ బ్రాండ్ ఇమేజ్‌కే దెబ్బ.

### వెలుగుల సింగరేణిలో చీకట్లు వద్దు!

తెలంగాణ గుండెకాయ లాంటి సింగరేణి ఎప్పుడూ నవ్వుతూనే ఉండాలి. బొగ్గు బావుల నుంచి వచ్చే నల్లటి పొగల్లో... కార్మికుల ఇళ్లల్లో తెల్లటి వెలుగులు నిండాలి. యాజమాన్యం ఇప్పటికైనా ఈ 'రహస్యాల' తెరలు దించి, అసలు వివరాలను బహిర్గతం చేయాలి. ఆరోపణలకు సమాధానం చెప్పి... సింగరేణి సత్తా ఏంటో మళ్లీ నిరూపించాలి. ఎందుకంటే...సింగరేణి అంటే కేవలం ఒక బొగ్గు సంస్థ కాదు, అది కోట్ల మంది నమ్మకం.

**- గడ్డం సంతోష్ రాజ్**

**స్పెషల్ కరస్పాండెంట్ విజన్ ఆంధ్ర**

# పోలీస్ జాగిలాలు నేరాల ఛేదనలో అత్యంత కీలకం

- జాగిలాల సంరక్షణ, శిక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదు
- పత్తి బజార్‌లోని జిల్లా పోలీస్ డాగ్ కెన్నెల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ
- ఆరోగ్యం, ఆహారం, పరిశుభ్రత, శిక్షణపై అధికారులకు కీలక సూచనలు
- నార్కోటిక్స్ స్నిఫర్ డాగ్‌లతో డ్రగ్స్ నిర్మూలనపై తరచూ ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశం
- నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్





నారాయణపేట, జులై 3 (విజన్ ఆంధ్ర) : జిల్లా కేంద్రంలోని పత్తి బజార్‌లో ఉన్న జిల్లా పోలీస్ డాగ్ కెన్నెల్‌ను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు శాఖలో నేరాల ఛేదన, పేలుడు పదార్థాల గుర్తింపు, మాదక ద్రవ్యాల నియంత్రణ, అదృశ్యమైన వ్యక్తుల ఆచూకీ వంటి కీలక విధుల్లో సేవలందిస్తున్న పోలీస్ జాగిలాల నిర్వహణ, సంరక్షణ, శిక్షణ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కెన్నెల్‌లో ఉన్న నాలుగు ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ జాగిలాలు రూప (ఎక్స్‌ప్లోజివ్), రుద్ర (ట్రాకర్), విక్కీ (నార్కోటిక్స్), లక్కీ (ఎక్స్‌ప్లోజివ్) జాగిలాల ఆరోగ్య పరిస్థితి, ఆహార నిర్వహణ, వసతి, పరిశుభ్రత, శిక్షణ కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్షించారు.జాగిలాల కోసం ఏర్పాటు చేసిన ప్రతి గది వద్ద ఆయా జాగిలాల పేరు, ప్రత్యేక నైపుణ్యం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సాధించిన విజయాలు, అవార్డులు, సేవల వివరాలను స్పష్టంగా ప్రదర్శించేలా సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల జాగిలాల సేవలపై అవగాహన పెరగడంతో పాటు వాటి పనితీరును సమర్థవంతంగా పర్యవేక్షించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ జాగిలాలు పోలీసు శాఖకు అమూల్యమైన ఆస్తి అని అన్నారు. హత్యలు, దొంగతనాలు, పేలుడు పదార్థాల గుర్తింపు, నార్కోటిక్స్ కేసులు, అదృశ్యమైన వ్యక్తుల ఆచూకీ వంటి క్లిష్టమైన కేసుల్లో జాగిలాలు కీలక పాత్ర పోషిస్తూ నేరాల ఛేదనను వేగవంతం చేస్తున్నాయని తెలిపారు. జాగిలాలకు ప్రతిరోజూ నిర్దేశించిన డైట్ చార్ట్ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, శుభ్రమైన తాగునీరు, విశ్రాంతి, సమయానికి వైద్య పరీక్షలు, అవసరమైన టీకాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, ప్రత్యేక శిక్షణ నిర్వహించడం ద్వారా వాటి సామర్థ్యం మరింత పెరుగుతుందని చెప్పారు. డాగ్ కెన్నెల్‌లో పరిశుభ్రమైన వాతావరణం ఎల్లప్పుడూ కొనసాగించాలని, జాగిలాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు నార్కోటిక్స్ స్నిఫర్ డాగ్‌లను మరింత సమర్థవంతంగా వినియోగించాలని, గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలపై తరచూ ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు.పోలీస్ జాగిలాల పనితీరు ఎంత మెరుగ్గా ఉంటే నేరాల ఛేదన అంత వేగవంతంగా జరుగుతుందని, ప్రజలకు మరింత నాణ్యమైన పోలీసు సేవలు అందించడంలో అవి కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అధికారులు జాగిలాల సంరక్షణ, శిక్షణ, ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ఈ తనిఖీలో అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ హుల్ హక్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ భాస్కర్, ఎస్‌బీ ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి, ఆర్.ఎస్.ఐ శివ శంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ డాగ్ కెన్నెల్ ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కాపాడాలని అన్నారు. మొక్కలు నాటడమే కాదు వాటిని పెరిగే వరకు బాధ్యతగా తీసుకోవాలని అన్నారు.

# ఆగస్టు నాటికైనా అందేనా..?

- పాల్వంచ మెడికల్ కాలేజీ సొంత భవనం నాలుగేళ్లుగా నిర్మాణంలోనే
- మెడికల్ కాలేజీ.. విద్యార్థుల నిరీక్షణకు అంతెప్పుడూ?
- హాస్టల్ లేక ప్రైవేట్ అద్దె భవనాలే దిక్కు.. ప్రభుత్వ మెడికల్ కాలేజీ దుస్థితి
- జిల్లాకు వరమైన మెడికల్ కాలేజీ.. నిర్మాణంలో మాత్రం జాప్యం ఎందుకు?



**కొత్తగూడెం బ్యూరో జూలై 04(విజన్ ఆంధ్ర)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ప్రతిష్టాత్మకంగా మంజూరైన ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభమై నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ సొంత భవనం హాస్టల్ విద్యార్థులకు అందుబాటులోకి రాకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.కోట్ల రూపాయలతో చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడంతో విద్యార్థులు,వారి తల్లిదండ్రులు,జిల్లా ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రతి జిల్లాకు ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాల అనే లక్ష్యంతో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు అమలులో మాత్రం తీవ్ర జాప్యం చోటుచేసుకోవడం పట్ల పలువురు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.తెలంగాణ ప్రభుత్వం 2021లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసింది.కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పనిచేస్తున్న ఈ కళాశాలకు నేషనల్ మెడికల్ కమిషన్ (చీవీజ) 150 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతి మంజూరు చేసింది.2022 నవంబర్ 15 నుంచి మొదటి బ్యాచ్ తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం నాలుగు బ్యాచ్‌ల విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు.అయితే కళాశాల ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు సొంత భవనం సిద్ధం కాకపోవడంతో నర్సింగ్ కళాశాల భవనంలోనే ఎంబీబీఎస్ తరగతులు నిర్వహిస్తున్నారు.వైద్య విద్యకు అవసరమైన ప్రత్యేక తరగతి గదులు,అత్యాధునిక ప్రయోగశాలలు,డిపార్ట్‌మెంట్ బ్లాక్‌లు,సెమినార్ హాళు,,అధ్యాపకుల గదులు వంటి మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రభావం చూపుతోందని తెలుస్తోంది.

### హాస్టల్ లేక విద్యార్థులకు ఇబ్బందులు

ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అత్యంత కీలకమైన హాస్టల్ సౌకర్యం లేకపోవడం మరో ప్రధాన సమస్యగా మారింది.బాలురు,బాలికల కోసం శాశ్వత హాస్టళ్లు సిద్ధం కాకపోవడంతో ప్రైవేట్ భవనాలను అద్దెకు తీసుకుని హాస్టళ్లుగా నిర్వహిస్తున్నారు.ఈ పరిస్థితుల్లో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వైద్య విద్యార్థులకు అవసరమైన ప్రశాంతమైన వాతావరణం,గ్రంథాలయ సౌకర్యం,భద్రత,ఇతర మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్,ఛత్తీస్‌గఢ్,ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి కూడా విద్యార్థులు ఈ కళాశాలలో ప్రవేశాలు పొందుతున్నారు.అయితే హాస్టల్,సొంత క్యాంపస్ లేకపోవడం వల్ల కొంతమంది విద్యార్థులు ఇక్కడ చేరేందుకు వెనుకంజ వేస్తున్నారని సమాచారం.ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చేరినా ప్రైవేట్ హాస్టళ్లలో ఉండాల్సి రావడం వల్ల అదనపు ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

### నాలుగేళ్లుగా నత్తనడకనే నిర్మాణం

ప్రస్తుతం నర్సింగ్ కళాశాలకు ఎదురుగా ఉన్న విస్తారమైన స్థలంలో మెడికల్ కళాశాల ప్రధాన భవనం,పరిపాలన విభాగం, ప్రయోగశాలలు,హాస్టళ్లు తదితర నిర్మాణాలను నాలుగేళ్ల క్రితమే ప్రారంభించారు.ప్రారంభంలో కొంత వేగంగా సాగిన పనులు ఆ తర్వాత మందగించాయి.మధ్య మధ్యలో పూర్తిగా నిలిచిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం వల్లే నిర్మాణ పనులు నిలిచిపోయాయని ప్రచారం జరుగుతోంది.మరోవైపు సంబంధిత శాఖల సమన్వయ లోపం,పర్యవేక్షణ లేకపోవడం కూడా నిర్మాణ జాప్యానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మిస్తున్న ప్రాజెక్టు ఇంతకాలం పూర్తి కాకపోవడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

### జిల్లా ప్రజల ఆశలకు ప్రతీక

భద్రాద్రి కొత్తగూడెం వంటి గిరిజన, గ్రామీణ జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు కావడం ఎంతో కీలకమైన పరిణామంగా భావించారు.దీని ద్వారా స్థానిక విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి రావడంతో పాటు జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు కూడా లభిస్తాయని ఆశించారు.భవిష్యత్తులో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు,పరిశోధనలు,వైద్య సిబ్బంది తయారీకి ఈ కళాశాల కేంద్రంగా మారుతుందని భావించారు.కానీ నాలుగేళ్లు గడిచినా మౌలిక వసతులే పూర్తికాకపోవడంతో ప్రజల ఆశలు ఇంకా నెరవేరలేదు.ఒకవైపు కొత్త బ్యాచ్‌ల విద్యార్థులు చేరుతుండగా,మరోవైపు భవన నిర్మాణం మాత్రం ఇంకా పూర్తికాకపోవడం విమర్శలకు తావిస్తోంది.

### ఆగస్టు నాటికైనా పూర్తి చేస్తారా..?

ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు.కనీసం ఈ విద్యా సంవత్సరం ప్రారంభం ఆగస్టు నాటికైనా భవన నిర్మాణం,హాస్టల్ పనులను పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా ప్రజలు,విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.జిల్లాకు మంజూరైన ప్రతిష్టాత్మక ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణం ఇకపై ఆలస్యం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనులను వేగవంతం చేయాలని,ప్రజాధనం వృథా కాకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.సొంత భవనం,హాస్టల్ అందుబాటులోకి వచ్చినప్పుడే ఈ ప్రభుత్వ మెడికల్ కళాశాల పూర్తి స్థాయిలో తన లక్ష్యాలను నెరవేర్చగలదని అభిప్రాయపడుతున్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.